బహిర్గతం కాని రంగులు
రూ॥140/-
పేజీలు:140

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 07, సంచిక: 203 | సోమవారం | 24-06-2024 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00

### అత్యాచారం..నిందితుడిపై పోక్సో

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రేమిస్తున్నానంటూ ఇంటర్ విద్యార్థినికి మాయమాటలు చెప్పి అత్యాచారం చేసిన యువకుడిపై నారాయణగూడ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏసిపి శంకర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సైఫాబాద్ ప్రాంతానికి చెం దిన ఖలీల్ నారాయణగూడలో ఇంటర్ చదువుతున్న విదాయర్థినికి ప్రేమిస్తున్నానని చెప్పి అత్యాచారం చేశాడు. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిరాయదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఖలీల్‌ను అరెస్టు చేశారు.

## నేడు ఢిల్లీకి సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఎంపిల ప్రమాణ స్వీకారనికి హాజరవుతారు. ఆ తర్వాత ఎఐసిసి పెద్ద నాయకులతో పాటు కేంద్ర మంత్రులతో భేటీకానున్నట్టు తెలిసింది. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులు, అదనపు నిధులు, విభజన హామీల అమలు తదితర అంశాలపై ఆయా శాఖలకు చెందిన కేంద్రమంత్రులతో సిఎం రేవంత్ రెడ్డి చర్చించి, వినతిపత్రాలను అందజేయనున్నట్టు తెలిసింది. అలాగే కాంగ్రెస్ అధిష్ఠానంతో సిఎం రేవంత్ రెడ్డి సమావేశం కానున్నారు. రాష్ట్రంలోని నామినేటెడ్ పదవుల, మంత్రివర్గ విస్తరణ, టిపిసిసి అధ్యక్ష ఎంపికతో పాటు తాజా రాజకీయ పరిణామాలు, పరిపాలన అంశాలను ఆయన ఎఐసిసి పెద్ద నాయకులకు వివరించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 36 కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించగా, ఇందులో కొన్ని మార్పులు చేర్పులు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. త్వరలోనే తెలంగాణ రాష్ట్ర పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీ అమలు తీరు, క్షేత్ర స్థాయిలో ప్రజా స్పందనను కూడా రేవంత్‌రెడ్డి ఢిల్లీ తరువాయి 2లో

## 18వ లోక్‌సభ తొలి సెషన్ నేటి నుంచే..

### కొత్త సభ్యులతో ప్రమాణం చేయించనున్న ప్రొటెం స్పీకర్

### 26న స్పీకర్ ఎన్నిక, 27న రాష్ట్రపతి ప్రసంగం





**న్యూఢిల్లీ :** పద్దెనిమిదవ లోక్‌సభ తొలి సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రెండు రోజుల్లో కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈనెల 26వ తేదీన స్పీకర్ ఎన్నిక జరగనుంది. 27వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అయితే ఏడుసార్లు ఎంపిగా సేవలు అందించిన బిజెపి నేత భర్తృహరి మహతాబ్‌ను ప్రొటెంస్పీకర్‌గా నియమించడంపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. 8సార్లు ఎంపిగా ఉన్న కాంగ్రెస్ నేత కె. సురేష్‌ను కాదని మహతాబ్‌ను నియమించడంపై మండిపడుతున్నాయి. ఈ విషయమై పార్లమెంట్‌లో తరువాయి 2లో

## మాఫియా చేతుల్లోకి.. విద్యావ్యవస్థ



### అధికారులను మార్చడం సమస్యకు పరిష్కారం కాదు

### బిజెపి పాలనలో విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వంపై పోరాడాల్సిన పరిస్థితి

### రాజకీయ గూండాయిజం మన విద్యా వ్యవస్థకు గుర్తింపుగా మారింది : కాంగ్రెస్ మండిపాటు

**న్యూఢిల్లీ :** నీట్ యుజి, యుజిసి నెట్ ప్రశ్నపత్రాల లీకేజీతో ముసురుకున్న వివాదాల నేపథ్యంలో ఆదివారం జరగాల్సిన నీట్ పిజి ప్రవేశ పరీక్షను కేంద్ర ప్రభుత్వం వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఎన్‌టిఎ డైరెక్టర్ జనరల్‌పై వేటు వేసిన సంగతీ విదితమే. ఈ చర్యలపై కాంగ్రెస్ మోదీ ప్రభుత్వంపై మండిపడింది. తప్పిదం జరిగిన తరువాత దిద్దుబాటు చర్యలు చేపట్టినా ఫలితం లేదని ఎద్దేవా చేసింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికిర్జున ఖర్గే కేంద్రంపై విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించారు. నీట్‌లో జరిగిన అక్రమాలకు పాల్పడిన అధికారులను మార్చడం విద్యా వ్యవస్థలోని సమస్యకు పరిష్కారం కాదన్నారు. ఎన్‌టిఎ స్వయం ప్రతిపత్తి గల సంస్థ అని, కానీ.. ప్రస్తుతం అది బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలకు అనుగుణంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యార్థులకు న్యాయం జరిగేలా చూసే బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలన్నారు. ఇప్పుడు నీట్ పరీక్ష వాయిదా పడిందని, ఈ పది రోజుల్లో దాదాపు 4 పరీక్షలను వాయిదా వేయడమో, రద్దు చేయడమో చేశారన్నారు. మన విద్యావ్యవస్థలోకి విద్యా మాఫీయా చొరబడి పేపర్ లీకేజీలు, అవినీతి, అవకతవకలకు పాల్పడుతున్నారని, దీంతో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. దీని వల్ల నీట్ అభ్యర్థుల భవిష్యత్తు చిన్నాభిన్నం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్‌గా స్పందిస్తూ ప్రధాని మోదీ హయాంలో దేశంలో తరువాయి 2లో

## 'నీట్‌పై' రంగంలోకి సిబిఐ

### ఎఫ్‌ఆఐర్ నమోదు చేసిన దర్యాప్తు సంస్థ

### గుజరాత్, బీహార్‌కు వెళ్లిన రెండు బృందాలు

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా మే 5న నిర్వహించిన నీట్‌యుజి పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐ కేసు నమోదు చేసింది. పూర్తి స్థాయిలో విచారించనుంది. నీట్ పరీక్ష వ్యవహారంలో దర్యాప్తు బాధ్యతలను సిబిఐకి అప్పగిస్తున్నట్టు శనివారం కేంద్రం ప్రకటించగా, ఆదివారం తన పనిని ప్రారంభించింది. కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు సిబిఐ కేసు నమోదు చేసినట్లు కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. దర్యాప్తు నిమిత్తం తరువాయి 2లో



## ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు నేడు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం వెల్లడి కానున్నాయి. ఇంటర్, ప్రథమ, ద్వితీయ సంవత్సరంతో పాటు ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ఫలితాలు మధ్యాహ్నం 2గంటలకు విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత http://tgbie.cgg.gov.in, http://results.cgg.gov.in వెబ్‌సైట్ల ద్వారా విద్యార్థులు తమ ఫలితాలను చూసుకోవచ్చాని అధికారులు వెల్లడించారు.







### ప్రశ్నా పత్రాల లీకేజీలకు నిరసనగా

## బిజెపి ఆఫీస్ ముట్టడి

### యూత్ కాంగ్రెస్ నేతలు, పోలీసుల మధ్య తోపులాట

### కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇంటినీ ముట్టడించిన విద్యార్థి, యువజన సంఘాలు

### పలువురు నేతల అరెస్టు : విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్/కరీంనగర్**

నీట్ ప్రశ్న పత్రం లీకేజ్‌కు నిరసనగా యూత్ కాంగ్రెస్ శ్రేణులు బిజెపి కార్యాలయాన్ని ముట్టడించారు. దీనితో అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో యూత్ కాంగ్రెస్ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట చోటు చేసుకుంది. యూత్ కాంగ్రెస్ శ్రేణుల ముట్టడిని పోలీసులు అడ్డు కున్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనా రెడ్డి మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజిలో 14 మంది కేంద్ర మంత్రులు ప్రమేయం ఉందని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. వారి పిల్లల భవిష్యత్ కోసం నీట్ పేపర్ లీక్ చేశారని మండిపడ్డారు. నీట్ పరీక్ష లికేజ్ చేసిన నిందితులను విచారిస్తే బిజెపి నేతల బండారం బయటపడుతుందన్నారు. 23 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం ఆడుతోందని విమర్శించారు. నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసలు నిజాలు బయటపడితే కేంద్ర ప్రభుత్వం కుప్పకులుతుందని శివసేనా రెడ్డి సంచలన వ్యాఖ్యాలు చేశారు. అందుకే నీట్ పరీక్ష రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వెనకాడుతుందని మండిపడ్డారు. నీట్ పేపర్ లీకేజికి నైతిక బాధ్యత వహించి, కేంద్ర విద్య శాఖ మంత్రి రాజీనామా చేయాలని శివసేనారెడ్డి తరువాయి 2లో

## నేటి నుంచి జూనియర్ డాక్టర్ల నిరవధిక సమ్మె

**ప్రజాపక్షం/హైదరాబాద్**



రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ వైద్యులు సోమవారం నుంచి సమ్మెకు దిగనున్నారు. అత్యవసర విధులు తప్ప అవుట్ పేషెంట్ (ఓపీ) సేవలు, ఎలక్టివ్ సర్జరీలు, వార్డ్ డ్యూటీలను పూర్తిగా బహిష్కరించనున్నట్లు తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టి జెయుడిఎ) ప్రకటించింది. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గడిచిన మూడు రోజులుగా జూడాలు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాక పోవడం తప్పక నిరవధిక సమ్మెకు దిగుతున్నట్టు టిజెయుడిఎ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్. జి. సాయి శ్రీహర్ష తెలిపారు. రాష్ట్ర వ్యా ప్తంగా జూనియర్ డాక్టర్లు అందరూ ఈ సమ్మెలో పాల్గొననున్నారన్నారు. సకాలంలో జీతాలు చెల్లించడంతో పాటు పని ప్రదేశాల్లో జూనియర్ డాక్టర్లకు భద్రత కల్పించాలని, తదితర తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దశల వారిగా తరువాయి 2లో

## లాభాల ఆశ చూపి.. గోల్డ్ ట్రేడింగ్ పేరుతో మోసం



### రూ.150 కోట్లు టోకరా- లబోదిబోమంటున్న బాధితులు

### సిసిఎస్ పోలీసులకు చిక్కిన నిందితుడు

**ప్రజాపక్షం/హైదరాబాద్**

లాభాల ఆశ చూపించి సుమారు రూ.150 కోట్లు డిపాజిట్లు స్వీకరించి బిచాణా ఎత్తివేసిన ప్రాణేశ్వరి గోల్డ్ ట్రేడింగ్ ఉదంతం హైదరాబాద్‌లో వెలుగు చూసింది. మోసపోయామని గ్రహించిన బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. పరారీలో ఉన్న నిందితుడిని సిసిఎస్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్నాటకు చెందిన రాజేష్ (32) ఎనిమిది నెలల క్రితం హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8లో ప్రాణేశ్వరి గోల్డ్ ట్రేడింగ్ కార్యాలయాన్ని తెరిచాడు. ఇదే కార్యాలయంలో దీక్షా ట్రేడర్స్, రాజేశ్వరీ ట్రేడర్స్, కర్నాటక గోల్డ్ ట్రేడర్స్ పేర్లతో స్కీమ్ తెరిచాడు. తన కంపెనీలో రూ.5 లక్షలు తరువాయి 2లో



## మోదీ..కార్పొరేట్ల కాపలాదారు

### దేశంలో ప్రజాస్వామ్యం అపహాస్యం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని

03

## ఎల్లో అలర్ట్

### పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం హెచ్చరిక

### రాష్ట్రంలో మరో మూడు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్**

రాష్ట్రంలో మరోమూడురోజులు వర్షాలు కు రుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. పలుచోట్ల ఉరుము లు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు ఉత్తర తెలంగాణలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, తరువాయి 8లో

## ఏజెన్సీకి పొంచి ఉన్న ముప్పు

### ఏటా గోదావరి వరదలతో అతలాకుతలం

### ముంచెత్తుతున్న వరదనీరు స్లూయిస్ లీకులకు పరిష్కారం దొరికేనా?

**ప్రజాపక్షం/భద్రాచలం**



ఏజెన్సీకి గోదావరి వరద ముప్పు పొంచి ఉంది. ప్రతీ ఏటా గోదావరి పరీవాహక ఏజెన్సీ ప్రాంతం వరదలతో అతలాకు తలమవుతోంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు జూలై నుండి మొదలుకుని అక్టోబర్ వరకు గోదా వరి వరదల భయం ఇక్కడి ప్రజానీకానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. భద్రాద్రి కొత్త గూడెం జిల్లా పరిధిలోని వాజేడు మండలం నుండి మొదలుకుని భద్రాచలం వరకు ఇరు వైపులా ఎటు చూసిన పంట పొలాలు, గోదావరి ఒడ్డున ఉండే గ్రామాలు, గోదావరిలోనికి ప్రవహించే కా లువలు, పిల్ల కాలువలు ఉంటాయి. ఆ కాలువల ద్వారా మొదట గోదావరి వరద నీరు ఊళ్ల మీద పడుతుంది. దీంతో సమీప ప్రాంతాలు వరద ముంపునకు గురువుతున్నాయి. వానాకాలంలో ఆగస్టు మాసం వరకు ఇక్కడి రైతులు పంటలు సాగు చేయరంటే అతిశయోక్తి కాదు. వరదల కారణంగా ప్రతీ ఏటా రైతు లు, కౌలు రైతులు, చిన్న, సన్న కారు రైతులు తీవ్ర ంగా నష్టపోతుంటారు. గోదావరి వర దల సమయంలో రామాలయం సమీ పంలోని అన్నదాన సత్రం ప్రాంతం నీట మునుగుతుంది. వర్షపు నీరు అధి కంగా వచ్చినా ఈ ప్రాంతం జలమయం అవుతుంది. దీంతో ఆ ప్రాంతం మొత్తం వరదలనీటిలో మునిగి తేలుతుంది. పెద్ద వరద జూన్ మొదలుకుని సెప్టెంబర్ వరకు గోదావరి వరదలు భయం ఈ ప్రాంతాన్ని వెంటాడుతోంది. ప్రధానంగా ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో అతి భయం కర మైన వరదలు గోదావరి నదికి వచ్చాయి. ఇప్పటి వరకు గోదావరి నదికి 1986 వ సంవత్సరంలో అతిపెద్ద వరద వచ్చింది.ఆ ఆగస్టు 15న భద్రాచలం వద్ద 75.6 అడుగుల వరద నీటిమట్టం నమోదైంది. దీంతో ఉమ్మడి తరువాయి 8లో

## 'కార్పొరేషన్ల చైర్మన్' పదవులు తేలేనా..

### మంత్రుల చుట్టూ ప్రకటిత చైర్మన్ల ప్రదక్షిణాలు

### ఎప్పుడెప్పుడా అని ఆశావహుల ఎదురుచూపు

**ప్రజాపక్షం/హైదరాబాద్**



రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్ పదవులలో ఉత్కంఠ కొనసాగుతున్నది. లోక్‌సభ ఎన్నికలకు ముందు 36 కార్పొరేషన్లకు ఛైర్మన్లను ప్రకటించారు. తాజాగా ఇందులో కొన్ని కార్పొరేషన్ ఛైర్మన్లలో మార్పులు,చేర్పులు జరిగే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. దీంతో ప్రకటిత ఛైర్మన్లు తమ పేర్లు యధావిధిగా కొనసాగేలా తమ జిల్లాలకు చెందిన మంత్రులు, కాంగ్రెస్ ముఖ్యనేతల చుట్టు ప్రదక్షణలు చేస్తున్నారు. 36 కార్పొరేషన్ చైర్మన్ జాబితాలో సుమారు 17 మంది నియామకం పట్ల కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్సీ అభ్యంతరం వ్యక్తం తరువాయి 2లో

### మూకదాడి.. హత్య కేసులో
## 23 మంది అరెస్టు



**ఇస్లామాబాద్:** ఖురాన్‌ను అపవిత్రం చేశారనే ఆరోపణతో, పాకిస్తాన్‌లోని, స్వాత్ పట్టణంలో ఒక పర్యాటకుడిని కొట్టి చంపిన ఘటనలో 23 మందిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక మీడియాను ఉటంకిస్తూ పిటిఐ ఇచ్చిన సమాచారం మేరకు, పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్, సియాల్‌కోట్ నివాసి మహమ్మద్ ఇస్మాయిల్ (40) పర్యటన నిమిత్తం స్వాత్ వెళ్లాడు. అతను ఖరాన్‌లోని కొన్ని కాగితాలను తగలబెట్టినట్టు ఫిర్యాదు అందడంతో పోలీసులు అతని అరెస్టు చేశారు. అయితే, ఈ వార్త మసీదుల్లోని లౌడ్‌స్పీకర్ల ద్వారా తెలియచేయడంతో, రెచ్చిపోయిన వేలాది మంది స్వాత్ పోలీస్ స్టేషన్ చేరుకొని, ఇస్మాయిల్‌పై దాడి చేసి, అతనిని కాల్చి చంపిన విషయం తెలిసిందే. అనంతరం అతని శవాన్ని ఈడ్చుకుంటూ తీసుకెళ్లి, నగరం నడిబొడ్డున ఉరితీశారు. ఈ క్రమంలోనే వారు పోలీస్ స్టేషన్‌కు, అక్కడ ఉన్న వాహనాలకు నిప్పుపెట్టారు. ఈఘటన ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కాగా, ఈ కేసులో 23 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని గుర్తుతెలియని ప్రాంతాలకు తరలించారు. మరి కొందరిని అరెస్టు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్వాత్ జిల్లా పోలీస్ అధికారి సయ్యద్ జమాన్ షా పేర్కొన్నారు. ఇస్మాయిల్‌పై తొలుత దైవ దూషణ అభియోగం నమోదైందని, ఆ తర్వాత అతనిని చంపడంతో, హత్య, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం వంటి కేసులను కూడా నమోదు చేశామని వివరించారు.

# సునాక్‌కు బెట్టింగ్ సెగ



**లండన్:** ఎన్నికల వేళ, బ్రిటిష్ ప్రధాని రిషి సునాక్‌కు బెట్టింగ్ సెగ తప్పడం లేదు. జులై 4న పార్లమెంటు ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. అయితే, అంతకు ముందు, ఎన్నికల తేదీపై జోరుగా బెట్టింగ్‌లు కొనసాగాయని, అధికార కన్జర్వేటివ్ పార్టీకి చెందిన కొంత మంది ప్రముఖులకు ఈ గ్యాంబ్లింగ్‌లో పాత్ర ఉందని వార్తలు రావడంతో, రాజకీయ అలజడి చెలరేగిన విషయం తెలిసిందే. 'ది సండే టైమ్స్'లో వచ్చిన వార్త ప్రకారం సునాక్ సన్నిహితులు పలువురు గ్యాంబ్లింగ్‌కు పాల్పడ్డారు. ఈ వార్తపై స్పందించిన గ్యాంబ్లింగ్ కమిషన్ విచారణ చేపట్టింది. పార్టీ చీఫ్ డేటా ఆఫీసర్ నిక్ కార్టర్‌ను ప్రశ్నించింది. ప్రస్తుతం దీర్ఘకాల సెలవుపై ఉన్న అతను, తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చాడు. వ్యక్తిగత కారణాల వల్ల సెలవులో ఉన్నానని ప్రకటించాడు. కాగా, టోరీ పార్లమెంటు అభ్యర్థి అకెగ్ విలియమ్స్, అతని భార్య లారా సాండర్స్‌పైనా విమర్శలు వచ్చాయి. వారిని కూడా విచారించేందుకు గ్యాంబ్లింగ్ కమిషన్‌తోపాటు, పోలీస్ అధికారులు కూడా సిద్ధమయ్యారు. ఇలావుంటే, తాజాగా విలియమ్స్ వ్యాపార భాగస్వామి, కన్జర్వేటివ్ పార్టీ ప్రచార విభాగం డైరెక్టర్ టోనీ లియోకు కూడా ఈ బెట్టింగ్ వ్యవహారంలో సంబంధం ఉందంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ మొదలు పెట్టారు. ఒకరి తర్వాత మరొకరుగా తమ పార్టీ ప్రముఖులు, కీలక వ్యక్తులు ఈ గ్యాంబ్లింగ్ కేసులో చిక్కుకోవడం సునాక్‌ను ఆందోళనకు గురి చేస్తున్నది. ఇప్పటికే కన్జర్వేటివ్ పార్టీపై లేబర్ పార్టీదే పైచేయిగా కనిపిస్తున్నదని వివిధ సర్వేలు పేర్కొంటున్నాయి. జులై 4న జరిగే ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు తప్పవేమోనన్న భయం ఒకవైపు, పార్టీ నాయకులు, కీలక వ్యక్తులు ఒకరి తర్వాత మరొకరిగా గ్యాంబ్లింగ్ కేసులో నిందితులుగా తెరపైకి రావడం మరోవైపు సునాక్‌కు నిద్రలేకుండా చేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ గెలవడం అసాధ్యంగానే కనిపిస్తున్నది.

### యుద్ధం చేయం..
## వెనుకడుగు వేయం..

**మనీలా:** చైనాతో యుద్ధం చేసే ఆలోచన తమకు లేదని, అయితే, ఏ విషయంలోనూ వెనుకడుగు వేయబోమని ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ స్పష్టం చేశారు. ఇటీవల దక్షిణ చైనా సముద్రంలోని సెకండ్ థామస్ షోల్ వద్ద ఫిలిప్పీన్స్‌కు చెందిన రెండు పడవలపై చైనా నావికాదళం దాడులు చేసిన విషయం తెలిసిందే. వివిధ పరికరాలతో వాటిని ధ్వంసం చేసిన దృశ్యాలు వీడియోలు, ఫొటోల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. తమ భూభాగానికి చెందిన సముద్ర జలాల్లోకి నౌకలు ప్రవేశించడాన్ని నౌకాదళం అడ్డుకుందని, ఇది దేశ రక్షణలో భాగమని చైనా ప్రకటించింది. అయితే, చైనా నావీ దాడి చేసిన ప్రాంతం అంతర్జాతీయ జలాల పరిధిలోకి వస్తుందని ఫిలిప్పీన్స్ వాదన. అమెరిక, యూరోపియన్ యూనియన్, జపాన్, ఆస్ట్రేలియా తదితర దేశాలు ఫిలిప్పీన్స్‌కు మద్దతు ప్రకటిస్తూ, దాడులను ఖండించాయి. సైనిక కార్యక్రమంలో పాల్గొనడానికి పలావాన్‌కు, పలువురు అధికారులతో కలిసి వెళ్లిన మార్కోస్ జూనియర్ ఈ పరిణామాలపై స్పందించారు.

తమ దేశానికి చెందిన పడవలు అంతర్జాతీయ జలాల్లోనే ఉన్నాయని ఆయన పునరుద్ఘాటించారు. చైనా నౌకాదళం దాడులు చేయడం, రెండు పడవలను సుత్తులు, కొడవళ్లు, రంపాలు, ఇనుప రాడ్లతో కొట్టి ధ్వంసం చేయడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. చైనాతో యుద్ధానికి కోరుకోవడం లేదని, యుద్ధానికి దిగబోమని ఆయన స్పష్టం చేశారు. అయితే, దేశ రక్షణ విషయంలో వెనుకంజ వేసే ప్రసక్తే లేదని అన్నారు. చర్చల ద్వారా శాంతియుత వాతావరణం నెలకొంటుందని, తాము అదే సూత్రానికి కట్టుబడి ఉన్నామని మార్కోస్ జూనియర్ అన్నారు.

ప్రపంచం

# రష్యాలో కొత్త ఉత్సాహం



**మాస్కో:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల ఉత్తర కొరియా, వియత్నాం పర్యటనలను విజయవంతంగా పూర్తి చేసుకున్న నేపథ్యంలో మాస్కోలో కొత్త ఉత్సాహం కనిపిస్తున్నది. ఉక్రేన్‌పై యుద్ధం ప్రకటించిన అనంతరం అమెరికాతోపాటు పలు ఐరోపా దేశాలు కూడా ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఒంటరిగా మిగిలిపోతున్నామనే ఆందోళన రష్యాను వేధించి ఉండవచ్చు. కానీ, రెండు వరుస పర్యటనలు, కుదిరిన ఒప్పందాలు మాస్కో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తున్నది. కాల్పుల విరమణకు పుతిన్ విధించిన షరతులను ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తిరస్కరించడంతో, ఇరు దేశాల మధ్య శాంతి ఇప్పట్లో సాధ్యం కాదని స్పష్టమైంది. కాల్పుల విరమణకు ముందే తాము స్వాధీనం చేసుకున్నట్టు చెప్తున్న భూభాగాల నుంచి ఉక్రేన్ తన బలగాలను ఉపసంహరించుకోవాలని రష్యా చేసిన ప్రతిపాదనను ఉక్రేన్ తిరస్కరించడంతో పరిస్థితి యథాస్థితికి చేరింది. ఆ తర్వాత స్విట్జర్లాండ్‌లో 90 దేశాలకు చెందిన నాయకులు సమావేశమయ్యారు. కానీ, ఆహ్వానం అందని కారణంగా రష్యా ఆ సమావేశంలో పాల్గొనలేదు. అనంతరం పుతిన్ మీడియాతో మాట్లాడుతూ ఈ అంశాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. నాటో కూటమిలో చేరబోమని ఉక్రేన్ అధికారికంగా ప్రకటిస్తే, యుద్ధ విరమణ జరుగుతుందని ప్రకటించారు. అప్పటి వరకూ ఇరు దేశాల మధ్య లోలోపల రగులుతున్న అభిప్రాయభేదాలు, నాటో సభ్యత్వం కోసం ఉక్రేన్ ప్రయత్నించడంతో తారస్థాయికి చేరాయి. ఈ ప్రయత్నాన్ని విరమించాలని, లేకపోతే, తమ దేశ సార్వభౌమాధికారాన్ని రక్షించుకుందుకు యుద్ధానికైనా వెనుకాడబోమని అప్పట్లో పుతిన్ హెచ్చరించారు. కానీ, అధికార ప్రకటనకు జెలెన్‌స్కీ నిరాకరించడంతో, యుద్ధం అనివార్యమైంది. తాజాగా మరోసారి పుతిన్ అదే ప్రతిపాదన చేశారు. యుద్ధానికి తెరపడాలంటే, నాటో కూటమిలో చేరేది లేదని ప్రకటించాలని మరోసారి సూచించారు. కానీ, జెలెన్‌స్కీ ఆ ప్రతిపాదనను తోసిపుచ్చి, సమస్యను మరింత జటిలం చేశారు. అంతేగాక, జి7 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా అమెరికా, ఉక్రేన్ దేశాలు 10 సంవత్సరాల ద్వైపాక్షిక భద్రతా ఒప్పందంపై సంతకాలు చేశాయి. దీనిని చరిత్రాత్మక ఘటనగా కీవ్ అభివర్ణించింది. మాస్కో మాత్రం ఈ పరిణామాల పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. అమెరికాతో ఉక్రేన్ ఒప్పందాలు కుదుర్చుకున్న తరుణంలో, ఉత్తర కొరియా, వియత్నాం దేశాల్లో పుతిన్ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆ రెండు దేశాలూ రష్యాకు అన్ని విధాలా సహకరించేందుకు సిద్ధమై, వాణిజ్య, రక్షణ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ పరిణామాలతో రష్యాలో కొత్త ఉత్సాహం కనిపిస్తున్నది.



# ఇజ్రాయెల్‌తో పోరుకు వేలాది మంది సిద్ధం!




**బీరూట్:** ఇజ్రాయెల్‌తో యుద్ధానికి సిద్ధమంటూ వేలాది మంది యోధులు లెబనాన్‌కు వస్తున్నట్టు సమాచారం. వీరంతా హిజ్బుల్లా మిలిటెంట్ గ్రూప్‌లో చేరి, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తారని ఆ సంస్థ నాయకుడు హసన్ నస్రల్లా తెలిపారు. ఇరాన్ మద్దతుతో, మధ్యప్రాచ్యంలోని వివిధ సమూహాల నుండి ఎంతో మంది హిజ్బుల్లాలో చేరుతున్నారని విశ్లేకులు, ఇరాన్ వర్గాలు పేర్కోవడం గమనార్హం. హమాస్ దాడికి ప్రతి దాడిగా పేర్కొంటూ, గత ఏడాది అక్టోబర్‌లో గాజాపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని మొదలు పెట్టిన విషయం తెలిసందే. అప్పటి నుంచి విధ్వంస కాండ కొనసాగుతునే ఉంది. మారణహోమానికి తెరపడడం లేదు. కనీసం 37,000 మంది పౌరులు చనిపోయారని పాలస్తీనా అంటున్నది. హమాస్‌ను ఏరివేసే వరకూ విశ్రమించేది లేదని ఇజ్రాయెల్ స్పష్టం చేస్తున్నది. గాజా స్ట్రిప్‌లో పాలస్తీనా పౌరులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, వారికి మానవతా సాయాన్ని అందించేందుకు ఐక్యరాజ్య సమితిసహా వివిధ అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చినప్పటికీ, ఇజ్రాయెల్ నుంచి సరైన స్పందన లేదు. పైగా దాడులను మరింత ఉధృతం చేసింది. ఈ నేపథ్యంలో, పాలస్తీనియన్లకు సంఘీభావంగా, హిజ్బుల్లా ఎదురుదాడులకు సిద్ధమైంది. అంతేగాక, దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడిలో హిజ్బుల్లా సీనియర్ సైనిక కమాండర్ ఒకరు మృతి చెందడంతో, ఉత్తరాన పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇజ్రాయిల్ భూభాగం మీదకు ర్యాకెట్లు, డ్రోన్లను ప్రయోంచి ప్రతీకారం తీర్చుకుంది. ఇలావుంటే, ఇజ్రాయెల్ తన సైన్యన్ని లెబనాన్‌పై మళ్లిస్తే పరిస్థితి విషమిస్తుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఇటీవల పరస్పర దాడులు జరగడంతో, యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో హిజ్బుల్లాలో చేరి, ఇజ్రాయెల్‌తో పోరాడేందుకు వేలాది మంది ఇరాన్ తదితర ప్రాంతాల నుంచి లెబనాన్ చేరుకుంటున్నారని సమాచారం. హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా కూడా ఈ వార్తలను ధ్రువీకరించడంతో, లెబనాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు తప్పవని స్పష్టమవుతున్నది. ఇప్పటికే హిజ్బుల్లాలో వేలాది మంది ఉన్నారని, కొత్తవారికి చోటు లేదని నస్రల్లా వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రస్తుతం హిజ్బుల్లా తన వద్ద ఉన్న మానవ శక్తిలో అతి కొద్ది భాగాన్ని మాత్రమే రంగంలోకి దింపుతున్నదని, అవసరమైతే, పూర్తి సామర్థ్యంతో ఇజ్రాయెల్‌పై యుద్ధానికి సిద్ధమని నస్రల్లా హెచ్చరించారు. లెబనాన్–ఇజ్రాయెల్ సరిహద్దుల్లో యుద్ధం మొదలైతే, ఇరాన్ తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది హిజ్బుల్‌లో చేరతారని కూడా అన్నారు. మొత్తం మీద అతని ప్రకటన హిజ్బుల్ శక్తిని పరిచయం చేస్తున్నది. ఇజ్రాయెల్‌తో పోరాటానికి సిద్ధంగా ఉన్నామనే సంకేతం కూడా అందులో ఉంది.

## నేడు ఢిల్లీకి సిఎం రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

పెద్దల దృష్టికి తీసుకెళ్లే అవకాశాల ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవల బిఆర్‌ఎస్‌కు చెందిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ చేరిన విషయం తెలిసిందే. త్వరలోనే మరో 20 మంది బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు కాంగ్రెస్‌లో చేరుతారని విస్తృత ప్రచారం జరుగుతుంది. దీనికి సంబంధించి, బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికల అంశం కూడా అధిష్ఠాన భేటీలో చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ, కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమిస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొన్నది.

## నిరవధిక సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళనలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతోనే సమ్మెకు దిగాల్సి వస్తుందని వివరించారు. తమ డిమాండ్లు నేరవేరే వరకు సమ్మెను కొనసాగిస్తామని టిజెయుడిఎస్పష్టం చేసింది. సమ్మె కారణంగా రోగులు, సాధారణ ప్రజలకు కలిగే అసౌకర్యానికి తాము చింతిస్తున్నామని డాక్టర్ సాయిశ్రీ హర్ష తెలిపారు.

## 18వ లోక్‌సభ తొలి సెషన్ నేటి నుంచే..

(మొదటి పేజీ తరువాయి)

దుమారం రేగనుంది. ఇప్పటికే పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి కిరణ్ రిజిజు ఈ అంశంపై వివరణ ఇచ్చారు. లోక్‌సభ సభ్యుడిగా నిరంతరాయంగా సుదీర్ఘ కాలం మహతాబ్ పదవీకాలంలో కొనసాగారని, సురేష్ ఎనిమిది పర్యాయాలు ఎంపిగా ఉన్నప్పటికీ, 1998, 2004లో లోక్‌సభ సభ్యుడు కాలేదని, అందుకే పార్లమెంటు దిగువసభలో నిరంతరాయంగా పదవీకాలం కొనసాగించలేదని రిజిజు చెప్పారు. అందువల్ల ఎనిమిది పర్యాయాలు సభ్యుడిగా ఉన్న సురేశ్‌కు బదులుగా ఏడుసార్లు ఎంపి అయిన మహతాబ్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమితులయాయన్నారు. కాగా, సోమవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు రాష్ట్రపతి ముర్ము రాష్ట్రపతిభవన్‌లో మహతాబ్‌చే లోక్‌సభ ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణం చేయిస్తారు. ఆ తరువాత మహతాబ్ పార్లమెంట్‌కు చేరుకుని ఉదయం 11 గంటలకు సభలను ప్రారంభించనున్నారు. 18వ లోక్‌సభ తొలి సమావేశాల ప్రారంభంలో సభ్యులు కొద్దిసేపు మౌనం పాటించనున్నారు. ఈ తరువాత సభా కార్యక్రమాలు మొదలు కానున్నాయి. ఆ తరువాత లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ కొత్తగా ఎన్నికైన సభ్యుల జాబితాను స్పీకర్ ముందుంచనున్నారు. జాబితా ప్రకారం మహతాబ్ లోక్‌సభా నాయకుడు అయిన ప్రధాని మోదీతో ప్రమాణం చేయించనున్నారు. అనంతరం స్పీకర్ ఎన్నికయ్యేంత వరకు తనకు సహాయంగా ఉండేందుకు రాష్ట్రపతి నియమించిన చైర్‌పర్సన్ ప్యానల్ సభ్యులతో ప్రొటెంస్పీకర్ ప్రమాణం చేయించనున్నారు. అటు తరువాత మంత్రులైన వారితో లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేయిస్తారు. ఆయా రాష్ట్రాలకు చెందిన సభ్యులతో ఆల్ఫాబెటికల్ ఆధారంగా ప్రమాణం చేయించనున్నా రు. ఈనెల 26న స్పీకర్ ఎన్నిక జరగనుంది. ప్రధాని తన మంత్రివర్గాన్ని సభకు పరిచయం చేయనున్నారు. షెడ్యూల్ ప్రకారం రాష్ట్రపతి ఈనెల 27న ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తారు. 28వ తేదీన నుంచి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో చర్చ జరగనుంది. జులై 2 లేదా3వ తేదీన ఈచర్చకు ప్రధాని మోదీ సమాధానమిచ్చే అవకాశం ఉంది. ఆతర్వాత కొన్నిరోజుల విరామం అనంతరం జులై 22న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. కేంద్రఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పూర్తిస్థాయి బడ్జెట్‌ను జులై 22న ప్రవేశపెట్టనున్నారు.

## 'నీట్‌పై' రంగంలోకి సిబిఐ

(మొదటి పేజీ తరువాయి)

రెండు బృందాలను గుజరాత్, బిహార్‌కు పంపినట్లు ఆయన చెప్పారు. దాదాపు 24 లక్షల మంది విద్యార్థులు రాసిన నీట్‌యుజి పరీక్షలో అక్రమాలు, మోసాలు జరిగాయని పలుచోట్ల కేసులు నమోదైనట్లు ఆయన చెప్పారు. దీనిపై ఉన్నత స్థాయి సమీక్ష అనంతరం పరీక్షల ప్రక్రియలో పారదర్శకత కోసం ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేసేందుకు సిబిఐకి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నట్లు సదరు అధికారి వెల్లడించారు.

**విద్యార్థుల భారీ నిరసన...** నీట్ యూజీ పేపర్ లీక్ వివాదం తీవ్రరూపం దాల్చడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆదివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మెడికల్ ప్రవేశ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. నిరసనకారులు జంతర్ మంతర్ నుండి లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వరకు ర్యాలీతీశారు. అయితే వారిని పోలీసులు అడ్డుకున్నారు. ప్రధానిని కలవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. పోలీసులు అనుమతి నిరాకరించి, ప్రధానికి లేఖ రాయాలని నిరసనకారులకు సూచించారు. అనంతరం ఆందోళనకారులు పోలీసులకు సదరు లేఖను అందజేసి నిరసనను విరమించారు. బీహార్ పోలీసులు పేపర్ లీకేజ్‌ని బయట పెట్టారని, అందువల్ల కౌన్సెలింగ్‌ను తక్షణమే నిలిపివేయాలని విద్యార్థులు లేఖలో నొక్కి చెప్పారు. 'దయచేసి న్యాయం చేయండి, మా చివరి ఆశ మీరే' అని విద్యార్థులు ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు.

## గోల్డ్ ట్రేడింగ్ పేరుతో మోసం

(మొదటి పేజీ తరువాయి)

డిపాజిట్లు పెడితే ఆరు నెలల్లో రూ.9 లక్షలు ఇస్తానని ఆశ చూపించాడు. ఇతని చెప్పే మాటలకు ఆశపడిన పలువురు అతని వద్ద లక్ష నుంచి ఐదు లక్షల రూపాయల వరకు ఒక్కోక్కరు డిపాజిట్ చేశారు. అతను చెప్పిన ప్రకారమే ప్రతి నెల ట్రేడింగ్‌లో లాభాలు వచ్చాయంటూ ఐదు లక్షలు డిపాజిట్ చేసిన వారికి రూ.40 వేల చొప్పున ఇచ్చాడు. దీంతో సదరు రాజేష్‌పై మరింత నమ్మకం పెరగడంతో సుమారు 500 మంది డిపాజిట్ దారులు సుమారు రూ.150 కోట్లను డిపాజిట్ చేశాడు. గ్యారంటీగా దొంగ సంతకాలు పెట్టి చెక్కులను కూడా ఇచ్చాడు. మొదటి, రెండు నెలలు లాభాలు పంచినట్లే పంచి రెండు నెలల క్రితం బిచాణా ఎత్తివేశాడు.రెపోమాపో డిపాజిట్లు చెల్లిస్తానని బాధితులను నమ్మిస్తూ వచ్చాడు. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆదివారం రాజేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ విషయం తెలిసి బాధితులు కూడా సిసిఎస్‌కు వద్దకు చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలంటూ సిఎం రేవంత్‌రెడ్డికి వారు విజ్ఞప్తి చేశారు.

## 'కార్పొరేషన్ల చైర్మన్' పదవులు తేలేనా..

(మొదటి పేజీ తరువాయి)

చేసినట్టు తెలిసింది. పార్టీ కోసం కష్టపడిన వారిని పరిగణలోకి తీసుకోకుండా, కేవలం మంత్రులు సూచించిన వారినే ఛైర్మన్లుగా నియమించారని అభిప్రాయపడినట్టు సమాచారం. ఇదే విషయాన్ని ఆమె కాంగ్రెస్ అధిష్టానానికి నివేదించినట్టు తెలిసింది. దీంతో ప్రస్తుతం ప్రకటించిన ఛైర్మన్లలో 10 నుంచి 12 మంది వరకు మంత్రుల ప్రధాన అనుచరులు ఉండడం, మరి కొందరు పార్టీకి ఎటువంటి సేవలు చేయనివారు ఉన్నారని, వీరి స్థానంలో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని నియమించాలని ఎఐసిసి పెద్దలు టిపిసిసికి సూచించినట్టు ప్రచారం జరుగుతోంది. మరో వైపు గత పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడిన వారిని కాదని ఇతరులకు అవకాశాలు లభిస్తున్నాయని కొందరు వాపోతున్నారు. ఇదే విషయాన్ని వారు జిల్లాకు చెందిన ముఖ్యనేతలను కలిసి చెబుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చి సుమారు ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ నామినేట్ పదవులు దక్కపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా త్వరితగతిన నియమించాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడిన ద్వితీయ శ్రేణి నేతలకు కూడా నామినేట్ పదవులు ఇవ్వాలని పలువురు నాయకులు ఇది వరకే రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపా దాస్ మున్షీని కోరారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లనుండడంతో నామినేట్ పదవులు దక్కుతాయని ఆశావాహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మరో వైపు ఇది వరకే ప్రకటించిన కార్పొరేషన్ ఛైర్మన్లలో మాత్రం టెన్షన్ నెలకొన్నది.ఒక్క నాయకునికి ఒక్క పదవే ఉండేలా చూడాలని, తద్వారా కష్టపడిన కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదే ప్రతిపాదికన నామినేట్ పదవులను భర్తీ చేస్తారనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే టికెట్ ఆశించిన భంగపడిన కొందరు నాయకులకు నామినేట్ పదవులు ఇస్తామని శాసనసభ, లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎఐసిసి, టిపిసిసి హామీనిచ్చింది. దీంతో వారు కూడా తమకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని మంత్రులను, ముఖ్యనాయకులను కలిసి కోరుతున్నారు. దీంతో కాంగ్రెస్‌లో ప్రస్తుతం కార్పొరేషన్ల పదవుల అంశం హాట్‌టాపిక్‌గా మారింది.

## బిజెపి ఆఫీస్ ముట్టడి

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజ్‌లో దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ చేసిన దోషుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పార్లమెంట్‌ను ముట్టడిస్తామని శివసేనా రెడ్డి హెచ్చరించారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇంటి ముట్టడి

నీట్, యూజీసి పరీక్ష అంశంపై స్పందించాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యచరణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ కోర్టు నుంచి ర్యాలీగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ క్యాంపు ఆఫీస్ ముట్టడి ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. విద్యార్థి నాయకులు ఆందోళన చేపట్టడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈక్రమంలో పోలీసులకు, విద్యార్థి నాయకులకు తోపులాట జరిగి ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. విద్యార్థి నాయకులను బలవంతంగా అరెస్టు చేసి పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. నీట్ పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థుల భవితవ్యంపై నోరు మెదపని బండి సంజయ్‌కు కేంద్రమంత్రిగా కొనసాగే నైతిక హక్కు లేదని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యచరణ సమితి సంయుక్తంగా డిమాండ్ చేసింది. ఈ సంధర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, పిడిఎస్‌యు, డివైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ బండి సంజయ్‌కు మత రాజకీయాలపై ఉన్న శ్రద్ధ లక్షలాది మంది విధ్యార్థుల అంశంపై లేకపోవడం సిగ్గు చేటన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీలు, అవకతవకలు జరిగి విధ్యార్థుల జీవితాలను చిన్నాభిన్నం చేశారని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో విధ్యార్థులు వారి తల్లిదండ్రులు రోడ్డెక్కి ఉద్యమం చేస్తుంటే ఎందుకు మోడీ మాట్లాడడం లేదని వారు ప్రశ్నించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీకి నీట్ పేపర్ లీకేజీ అంశంపై చాయ్‌పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించేలా బండి సంజయ్ మోడీని అడగాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థి నాయకులను పోలీసులు ఇష్టారీతిన దాడి చేసి గాయాల పాలు చేశారని, మెడలు వంచి తలకు గాయం చేసిన తీరు సరికాదని మండిపడ్డారు. అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, అరవింద్, గజ్జల శ్రీకాంత్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు రాణా ప్రతాప్, అంగడి కుమార్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు రేణికుంట్ల ప్రితం, మల్లారపు ప్రశాంత్, గంతులు మహేష్, రోహిత్, సనత్ రెడ్డి, రంజిత్ తదితరులున్నారు.



## విద్యావ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

విద్యావ్యవస్థ ధ్వంసమైందని మండిపడ్డారు. బిజెపి పాలనలో విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వంపై పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అసహనం వ్యక్తం చేశారు. పేపర్ లీక్ రాకెట్, విద్యాశాఖలో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసు కోకుండా కేంద్ర ప్రభుత్వం నిస్సహాయంగా ఉందన్నారు. అసమర్థ మోదీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు పెను ప్రమాదమని, దేశ భవిష్యత్తును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ యుజి సహా జాతీయ పోటీ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ప్రధాని మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ విమర్శనాస్త్రాలు సంధించారు. మొత్తం విద్యా వ్యవస్థను మోదీ ప్రభుత్వం మాఫీయా, అవినీతిపరులకు అప్పగించిందని ప్రియాంక గాంధీ మండిపడ్డారు. నీట్ పిజి, యుజిసి నెట్, సిఎస్ఐఆర్ నెట్ పరీక్షలు ఇప్పటికే రద్దయ్యాయని, నీట్ యుజి ప్రశ్నపత్రం లీక్ అయిందని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రియాంక పోస్ట్ చేశారు.

'దేశ విద్యా వ్యవస్థ, పిల్లల భవిష్యత్తును అత్యాశపరులకు, మతోన్మాద అసమర్థులకు అప్పజెప్పాలన్న రాజకీయ నేతల దురహంకారం వల్లే పేపర్ లీక్‌లు, పరీక్షల రద్దులు జరుగుతున్నాయి. మోదీ ప్రభుత్వ పాలనలో క్యాంపస్‌ల నుంచి విద్య మాయమవుతోంది. రాజకీయ గూండాయిజం మన విద్యా వ్యవస్థకు గుర్తింపుగా మారింది. బిజెపి ప్రభుత్వం ఒక్క పరీక్షను కూడా సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. యువత భవిష్యత్తుకు బిజెపి అతిపెద్ద అడ్డంకిగా మారింది. దేశంలోని సమర్థులైన యువత తమ విలువైన సమయాన్ని, శక్తిని బిజెపిపై పోరాడేందుకు వృథా చేస్తున్నారు. ప్రధాని మోదీ నిస్సహాయంగా మారి ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు' అని ప్రియాంక గాంధీ మండిపడ్డారు. రోజూ విద్యార్థుల భవిష్యత్తుతో బిజెపి ఆడుకుంటోందని కాంగ్రెస్ సీనియర్ నేత మాణికం ఠాగూర్ ఆరోపించారు. 'బిజెపి పాలనలో రోజూ పేపర్ లీక్ అవుతూ వాయిదా పడుతూనే ఉంది. కానీ, ప్రధాని మోదీ మాత్రం స్పందించడం లేదు. ప్రధానిగా నాయకత్వ లక్షణాలను కోల్పోయారు. కనీసం పని చేయలేని మంత్రులపై మోదీ చర్యలు కూడా తీసుకోలేకపోతున్నరు' ఠాగూర్ మండిపడ్డారు.

### సిబిఐ దర్యాప్తుపై సందేహాలు

నీట్ పీజీ పరీక్ష వాయిదాను ఒక రోజు ముందు వాయిదా వేయడంపై ఢిల్లీ మంత్రి ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ తీవ్ర విమర్శలు చేశారు. కొందరు ఇప్పటికే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారని, ఈ సమయంలో పరీక్షను ఎలా రద్దు చేస్తారని నిలదీశారు. ఈ ఘటనపై సిబిఐ దర్యాప్తు చేయిస్తున్నారని కానీ దీనిపై కూడా సందేహాలు ఉన్నాయని, జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ చేయించాలని ఆప్ నేత డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను తొలుత మార్చి 3న నిర్వహించాల్సి ఉండగా.. ఆ తర్వాత జూలై 7న నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అనంతరం జూన్ 23కి అంటే ఈరోజుకి సవరించారు. అయితే.. కొన్ని గంటల ముందు శనివారం రాత్రి 10 గంటలకు కేంద్ర ఆరోగ్యశాఖ స్పందిస్తూ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. దీంతోపాటు జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టిఎ) డైరెక్టర్ జనరల్ సుబోధ్ సింగ్‌కు ఉద్వాసన పలికింది. నీట్ యూజీలో అక్రమాలపై సిబిఐ దర్యాప్తునకు కేంద్ర విద్యాశాఖ ఆదేశించింది.

# మోడీ.. కార్పొరేట్ల కాపలాదారు

- దేశంలో ప్రజాస్వామ్యం అపహాస్యం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని




**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం/బూర్గంపాడు:** ప్రధాని నరేంద్రమోదీ కార్పొరేట్ల కాపలాదారునిగా మారారని, మత విద్వేషాలకు కేంద్రబిందువైన బిజెపి చేతిలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక తాళ్లగొమ్మూరులో ఎఐటియుసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 2వ మహాసభ కడారు వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. సభా ప్రాంగణంలో ఎఐటియుసి జెండాను సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఎగురవేశారు. అనంతరం అమరులకు నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రధాని మోదీకి కార్మికులంటే చులకన భావమని, అందుకే పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చి వారి హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. దేశానికి స్వాతంత్రం రాకమునుపే ఎఐటియుసి కార్మిక సంఘంగా ఉందని, ఆ నాటి నుండి నేటి వరకు కార్మికుల పక్షాన అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. హక్కులు సాధన కోసం కార్మిక లోకం నిప్పుకనెకలై పోరాటాలు చేయాల్సిన తరుణం మరోసారి ఆసన్నమైందన్నారు. కేంద్రంలో మూడో సారి అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం సింగరేణి బొగ్గు గనులను వేలం వేసేందుకు కుట్రలు చేస్తోందని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ కేంద్రంగా ఇందుకు కుట్రలు జరుగుతున్నాయని, దీనిని తిప్పికొట్టాలన్నారు. చట్టసభల్లో వందలకోట్లకు అధిపతులు, నేరగాళ్లు ఉన్నారని, ధనవంతులకు అనుకూలంగా చట్టాలను తయారు చేస్తున్నారని చెప్పారు. సంఘాలు పెట్టుకునే అవకాశం, నిరసనలు తెలిపే హక్కు మాయమైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కార్మిక సంఘాలే లేకుండా చేసే ప్రయత్నాలు చేశారని మండిపడ్డారు. ఇది కర్మాగారాల జిల్లా అని ఎఐటియుసి ఆధ్వర్యంలో సింగరేణి, ఆర్టిసి, బిపిఎల్, నవభారత్, ఎన్ఎండిసి, హెవీవాటర్ ప్లాంట్, ఫిమాకేం, బ్యాంకు, ఎల్ఐసి, పోస్టల్, టెలికాం, గ్రామపంచాయతీ, మున్సిపల్, విఒఎ, 2వ ఎఎన్ఎం, కాం ట్రాక్ట్, అవుట్సోర్సింగ్, మిషన్ భగీరథ, అంగన్వాడీ, ఆ శ, హామాలు, భవన నిర్మాణ రంగానికి చెందిన వేలా ది మంది కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి సమరశీల పోరాటాలు నిర్వహిస్తోందని చెప్పారు. దేశ రక్షణ, కార్మిక హక్కుల పరిరక్షణ ఎర్రజెండాలతోనే సా ధ్యమన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు మాట్లాడుతూ కార్మిక హక్కులు సాధించబడాలంటే పోరాటాలే శరణ్యం అన్నారు. ఎఐటియుసితో కా ర్మిక వర్గానికి ఎంతో మేలు చేకూరింది. నేడు అనేక సంఘాలు కార్మిక హక్కులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయన్నారు. దేశంలో ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ కార్మికులకు అన్యాయం జరిగే చర్యలకు పూనుకుంటు ఎఐటియుసి చూస్తో ఊరుకోదన్నారు. సింగరేణి కాలరీస్ వ ర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామ య్య మాట్లాడుతూ పదేళ్లుగా బొగ్గు పరిశ్రమను ప్రైవేటు పరం చేసేందుకు కేంద్రం కుట్రల చేస్తోందని, కేంద్ర మంత్రి కిషన్రెడ్డి తాజాగా బొగ్గు గనులను వేలం వేసేందుకు హైదరాబాద్ కేంద్రంగా పావులు కదుపుతున్నారని చెప్పారు. పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం జిల్లాలో సిపిఐ నుండి కొత్తగూడెం నియోజక వర్గానికి ఎంఎల్ఎగా ఉండటం కార్మికుల అదృష్టమని, కార్మిక సమస్యను చట్ట సభల్లో వినిపించే అవకాశం ఉందని, ప్రభుత్వంలో సిపిఐ కూడా భాగమే కావడంతో సమస్యలు పరిష్కరించు కునేందుకు వేదిక దొరికిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, భద్రాద్రి జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యాల విశ్వనాథం, బికెఎంయు జిల్లా అధ్యక్షులు రేసు ఎల్లయ్య, గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర నాయకురాలుసిహెచ్సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

## ఎఐటియుసి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కంచర్ల, నరాటి





ఎఐటియుసి జిల్లా అధ్యక్షునిగా కంచర్ల జమలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరాటి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సారపాక తాళ్లగొమ్మూరులో జరిగిన ఏఐటియూసి జిల్లా 2వ మహాసభలో ఈ ఎంపిక చోటు చేసుకుంది. వీరితో పాటు25 మందితో కౌన్సిల్, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన జిల్లా బృంధాన్ని పలువురు అభినందించారు.

## 30 కుటుంబాలు సిపిఐలో చేరిక



పదవులున్నా, లేకున్నా నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండేది సిపిఐ పార్టీయే అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ మండల పరిధిలోని బిక్కూ తండాకు చెందిన 30 కుటుంబాలు కూనంనేని, జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా ఆధ్వర్యంలో సిపిఐ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోనికి ఆహ్వానించి ప్రాథమిక సభ్యత్వాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవలందించే పార్టీలనే ప్రజలు ఆదరిస్తారని, సిపిఐ సేవలను గుర్తించి ఇటవీల వందలాది మంది వివిధ పార్టీల నుండి సిపిఐలో చేరుతున్నారని, వారి నమ్మకానికి అనుగుణంగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. సిపిఐలో చేరిన వారిలో గుగులోత్ సుక్కుదావు, అజ్మీరా లక్కు, భూక్యా వీరన్న, రాములు, వెంకటేష్, రాజు, మంగపతి, వాంక్డోత్ బాబు, లక్ష్మ ణ్, శ్రీను, భద్రు, నూనావత్ కృష్ణ, చిన్న తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీశంశెట్టి పూర్ణచంద్ర రావు, జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, ముత్యాల కిరణ్, వైఎస్ గిరి, వేములపల్లి శేఖర్, మాజీ సర్పంచ్ భూక్యా విజయ్, జకరయ్య, ఎస్కె పాషా, బానోత్ రంజిత్, ప్రేమ్ తదితరులున్నారు.

## పారిస్ ఒలంపిక్స్‌లో సత్తా చాటాలి: మంత్రి జూపల్లి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్బీ స్టేడియంలో ఒలంపిక్ రన్ ను ఉత్సహంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు క్రీడా జ్యోతిని వెలిగించి పరుగులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఒలింపిక్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. పారిస్ ఒలింపిక్స్లో భారతదేశ క్రీడాకారులు తమ సత్తా చాటి దేశ కీర్తి ప్రతిష్టలను పెంచాలని, తెలంగాణ నుంచి బరిలోకి దిగుతున్న ప్లేయర్లు కూడా పతకాలు సాధించాలని అకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో, ఒలింపిక్స్లో రాణించిన క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ రన్ స్టీరింగ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ మహేశ్గౌడ్, రాష్ట్ర ఒలింపిక్ సంఘం మాజీ కోశాధికారి మహేశ్వర్, ఉపాధ్యక్షుడు ప్రేమ్రాజ్, బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## మాజీమంత్రి తలసానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరామర్శ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీమంత్రి, సనత్ నగర్ ఎంఎల్ఎ తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పరామర్శించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ ఈ నెల 10 వ తేదీన మరణించిన తెలిసినా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆదివారం వెస్ట్ మారేడ్ పల్లి లోని రాధికా కాలనీలోని శంకర్ యాదవ్ నివాసానికి వచ్చారు. . అక్కడ శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్ తో పాటు వారి మాతృమూర్తి లలితా బాయి ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

## శ్యామ ప్రసాద్ ముఖర్జీకి బిజెపి శ్రేణులు ఘన నివాళి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ కి బిజెపి శ్రేణులు ఘనంగా నివాళ్లు అర్పించారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి హైదరాబాద్ లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘంటించారు. ఆర్టికల్ 370కి వ్యతిరేకంగా మొట్టమొదటి ఉద్యమం చేపట్టిందని శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశ సమగ్రత, సమైక్యత లక్ష్యం కోసమే భారతీయ జనసంఘ్ స్థాపించబడిందని, దాని కోసమే మొట్ట మొదటి అధ్యక్షులు శ్యామ ప్రసాద్ ముఖ్యర్జీ బలిదానం అయ్యారన్నారు. ఆయనను స్ఫూర్తి మరిన్ని ఉద్యమాలకు సిద్ధం కావాలని కిషన్‌రెడ్డి కోరారు.

## నేడు గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈనెల 24న రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కోఆర్డినేటర్ నీలం పద్మ తెలిపారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యాక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యనిర్వహక కార్యదర్శులు, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మండల, టౌన్ అధ్యక్షులు హాజరు కావాలని ఆమే కోరారు.

## కాంగ్రెస్‌లో యువతకు సముచిత స్థానం

ఎంఎల్‌సి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ యువత, విద్యార్థులకు ప్రాధాన్యత ఇస్తుందని ఎంఎల్సి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఇందిరా భవన్‌లో ఆదివారం యూత్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం యువత, విద్యార్థులకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. యువత సమస్యలపై శివసేనా రెడ్డి నాయకత్వంలో యువజన కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం చేసిందని అభినందించారు. కాంగ్రెస్ పార్టీలో అనేక మంది యువ నాయకులు ఎంతో గొప్ప నాయకులుగా ఎదిగారని అన్నారు. అదే స్ఫూర్తితో యువత, విద్యార్థులు కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని కోరారు.

## ఆర్‌టిసిలో వేధింపుల నుంచి కార్మికులకు విముక్తి కల్పించాలి

ఆర్‌టిసి మాజీ డైరక్టర్ ఎం.నాగేశ్వర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి కార్మికుల మద్ధతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సంస్థలో కార్మికుల పట్ల జరుగుతున్న అన్యాయానికి అడ్డుకట్ట వేయాలని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరక్టర్ ఎం.నాగేశ్వర్ రావు ప్రభుత్వాన్ని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. టిఎస్ ఆర్‌టిసిలో కొనసాగుతున్న శ్రమదోపిడీ, పనిభారం, పనిష్మెంట్లు, వేధింపుల నుంచి కార్మికులకు విముక్తి కల్పించాలన్నారు. యాజమాన్యపు దుందుడుకు విధానాలనుఅదుపుచెయ్యకపోతేప్రభుత్వప్రతిష్టకుతీవ్రనష్టంకలుగుతుందన్నారు.

## నా జీవితం ప్రజాసేవకు అంకితం

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/చిట్యాల:** తన జీవితం ప్రజాసేవకు అంకితం చేశానని, తాను పదవిలో ఉన్నా, లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై రూ. 40 కోట్ల అంచనా నిధులతో నిర్మించనున్న ఫ్లైఓవర్ బ్రిడ్జికు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశంతో కలిసి ఆదివారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ తన రాజకీయ జీవితం చిట్యాల పట్టణానికి ముడిపడి ఉందని అందుకే ఫ్లైఓవర్ బ్రిడ్జిల శంఖుస్థాపనను ఇక్కడ ప్రారంభించానని అన్నారు. జాతీయ రహదారిపై ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 17 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, వీటి నివారణ కోసం ఆయా ప్రాంతాల కోసం మొదటి విడతగా రూ. 325 కోట్లను మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. అలాగే నల్లగొండ జిల్లాలో రహదారుల నిర్మాణం కోసం రూ. 500 కోట్ల నిధులను తీసుకురావడం జరిగిందన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుకు నిధులను మంజూరు చేయించి మూడు నెలల్లో పూర్తి చేయించి ఆయకట్టు క్రింద 20 వేల ఎకరాలకు నీరు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. జిల్లాకు ఇరిగేషన్ అభివృద్ధి కోసం ఎస్ఎల్‌బిసిని కలుపుకుని రూ. 2200 కోట్లను ముఖ్యమంత్రి మంజూరు చేశారని, రూ.30 వేల కోట్ల నిధులతో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే మల్కాపుర్ నుండి కోదాడ వరకు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం కేంద్ర మంత్రి గడ్కరీకి వివరించి నిధులను తీసుకువస్తానని అన్నారు. తనకు నల్లగొండ, నకిరేకల్ నియోజకవర్గాలు రెండు కళ్ళ లాంటివని వాటి అభివృద్ధిక ఎల్లవేళలా కృషి చేస్తానని కోమటిరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డిసిసి నాయకులు పోకల దేవదాసు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, నాయకులు గుడిపాటి లక్ష్మి నర్సింహ్మా, ఎద్దులపురి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అశా వర్కర్లకు పరీక్ష.. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ముఖ్యమంత్రి రెవంత్‌రెడ్డికి తమ్మినేని వీరభద్రం లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఆశా వర్కర్లకు పరీక్ష నిర్వహించాలన్నా నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్యమంత్రి కె.రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన ఆదివారం సిఎంకు లేఖ రాశారు. అనునిత్యం గిరిజన ప్రాంతాల్లో గత 33 ఏళ్లుగా మైదాన ప్రాంతాల్లో 19 సంవత్సరాలుగా 28 వేల మంది ఆశావర్కర్లు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు, బాల బాలికలకు వారంతా ఆరోగ్య సేవలు అందిస్తున్నారని, ఆలాంటి వారికి కొత్తగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా పరీక్ష నిర్వహించాలని సర్క్యూలర్ జారీ చేయడం ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సరేనంటూ నిర్ణయం తీసుకోవడంతో అశా వర్కర్లందరూ తీవ్ర భయాందోళనాలకు గురువుతున్నారని తన లేఖలో వివరించారు. ఆశాల నైపుణ్యం పెంచేందుకే తప్ప, తొలగింపుల కోసం కాదని అధికారులు చెపుతున్నారని, అదే నిజమైతే మరింత శిక్షణ ఇస్తే సరిపోతుంద కాదా కరోనా కాలంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ వీరికి ''హెల్త్ గ్లోబల్ లీడర్స్'' అని అవార్డ్ కూడా ప్రకటించిందని గుర్తు చేశారు. అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం అనేక అనుమానాలకు తావిస్తోందని, దీనిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండ చర్యలు తీసుకోవాలని తమ్మినేని వీర భద్రం సిఎం రేవంత్‌కు విజ్ఞప్తి చేశారు.

## పద్మశ్రీ సకిని రామచంద్రయ్య మృతి

అదికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు ఏర్పాట్లు

సంతాపం ప్రకటించిన భట్టి,పొంగులేటి





**భద్రాద్రి కొత్తగూడెం :** పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య(75) ఆదివారం అనారోగ్యంతో స్వగృహంలో మృతి చెందారు. మణుగూరు మండలం బావికూనవరం గ్రామానికి చెందిన రామ య్య కంచుమేళం, కంచుతాళం వాయిస్తూ ఆదివాసీ తెగల కథలు చెప్పే కళాకారుల్లో చిట్టచివరివాడు. మేడారం జాతరంలో ప్రధాన ఘట్టమైన చిలకలగుట్ట నుంచి సమ్మక్కను గద్దెలపైకి తరలించే సమయంలో సకిని రామచంద్రయ్య కీలకంగా వ్యవహరించే వారు. ఆయన ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం 2022 లో కేంద్రప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని అందించింది. అదే క్రమంలో రా ష్ట్ర ప్ర భుత్వం ఆయనకు రూ.1 కోటి నజరానాతో పాటు 426 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించింది. అయితే నేటికి కూడా ఆ నజరానా ఆయనకు అందలేదు. దీంతో పాటు నెలకు రూ.30 వేల పింఛన్ అందిస్తామని చెప్పిన ప్పటికీ ఆయనకు అందలేదు. పలు మార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. కాగా గత కొంతకాలంగా అనారోగ్యంతో మంచంపట్టిన ఆయన ఆదివారం తుదిశ్వాస విడిచారు. దక్షిణ భారత దేశంలో జానపదకళల్లో పద్మశ్రీ అందుకున్న ఏకైక వ్యక్తి.

**అధికారిక లాంఛనలతో అంత్యక్రియలు:** పద్మశ్రీ రామచంద్రయ్య మృతి చెందడంతో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆయన పార్థీవదేహాన్ని సందర్శించి పూల మాల లు వేసి నివాళ్లు అర్పించారు. రామచంద్రయ్య అంత్యక్రియలు అధికారిక లాంఛనలతో జరిపిస్తామని, ప్రభు త్వం పరంగా కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు.

### జానపద కళకు తీరని లోటు

డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అంతరించిపోతున్న డోలు వాయిద్యానికి జీవం పోసి.. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడిన పద్మశ్రీ సాకిని రామచంద్రయ్య మృతి జానపద కళకు తీరని లోటు అని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారసత్వంగా వచ్చిన గిరిజన సంప్రదాయ కళను జీవనాధారంగా చేసుకొని డోలు వాయిద్యానికి రామచంద్రయ్య దేశవ్యాప్తంగా గుర్తింపు సాధించిపెట్టారని గుర్తు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం కూనవరం గ్రామానికి చెందిన రామచంద్ర య్య ఉమ్మడి ఖమ్మం జిల్లాకే కాదు.. తెలంగాణ రాష్ట్రానికి తన డోలు వాయిద్యంతో కీర్తిని సాధించి పెట్టారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రామచంద్రయ్య అకాల మృ తి పట్ల వారి కుటుంబానికి తన ప్రగాఢ సం తాపాన్ని, సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు.

## ఎంఎల్ హెచ్‌పిలకు రూ. 45వేల వేతనం ఇవ్వాలి

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ్మా డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇతర రాష్ట్రాల తరహాలోనే తెలంగాణ రాష్ట్రంలో కూడా నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు నెలకు రూ.45 వేల వేతనం ఇవ్వాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్, ఏఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌పి రాష్ట్ర నాయకులు తోట రామాంజనేయులు అధ్యక్షతన ఎంఎల్ హెచ్ పి రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి నరసింహ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ 12 రకాల సేవలతో పాటు 14 రకాల కేంద్ర ప్రభుత్వ విధులను కూడా మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లతో చేయించుకుంటున్నారని వివరించారు. వీరికి ఇతర రాష్ట్రాలకు భిన్నంగా కేవలం రూ. 29 వేలు మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కూడా వర్తించడం లేదని, కనీసం హెల్త్ ఇన్సూరెన్స్ కూడా చేసే పరిస్థితి లేదని విమర్శించారు. ప్రజా ఆరోగ్యం, వారి బాగోగులను చూసుకునే హెల్త్ ప్రొవైడర్లకు తమ ఆరోగ్యంపై భద్రత లేకపోవడం ఇబ్బందికరమైన విషయమన్నారు. చాలా పల్లె దావఖానాల్లో పక్కా భవనాలు లేవని, భవనాలు ఉన్న ప్రాంతాలలో కనీస వసతులు కూడా కల్పించలేదని ఆయన మండిపడ్డారు. వీలైనంత త్వరగా పక్కా భవనాలను పూర్తి చేయడంతో పాటు మంచినీరు, విద్యుత్ తదితర సదుపాయాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో ఏర్పాటు చేసిన పల్లె దావఖానాలకు ప్రభుత్వమే కిరాయిలు చెల్లించడంతో పాటు ప్రతి పల్లె దావఖానాకు విద్యుత్ బిల్లును కూడా చెల్లించాలన్నారు. త్వరలో వీరి సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా మరో సమావేశాన్ని ఏర్పాటు చేసి, భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ సమావేశానంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్‌కు అందించారు.

**ఎంఎల్‌హెచ్‌పి రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక**

ఎంఎల్‌హెచ్‌పి రాష్ట్రస్థాయి సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ : గౌరవాధ్యక్షులు ఎటియుసి రాష్ట్ర నాయకులు తోట రామాంజనేయులు ,అధ్యక్షులుగా బి. సందీప్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎండి అస్పియా, ఉపాధ్యక్షులుగా బి. చంద్రకళ, బి రమ్య , సహాయ కార్యదర్శులుగా జి రాము ,ఎం. సంధ్య, కోశాధికారిగా షేక్ లతీఫ్, కార్యవర్గ సభ్యులుగా ఏం. శ్రీకాంత్, బి.జితేందర్,ఆర్. దీపిక, బి. మురళిని ఎన్నుకున్నారు.

'ప్రభుత్వ ఆసుపత్రుల కార్మికుల సమస్యల'పై

## జులై 3న డిఎంఇ ముందు ధర్నా

కార్మికులను దోచుకుంటున్న కాంట్రాక్టర్లు

తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులను దోచుకుంటున్నారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి యూసుఫ్, ఎం నరసింహ విమర్శించారు. వారికి అందాల్సిన వేతనాలను స క్రమంగా ఇవ్వడం లేదని మండిపడ్డారు. కాంట్రాక్టర్ల అవినీతిని అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టిందుకు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 3న కోఠిలోని డిఎంఈ కార్యాలయంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్, హిమాయత్ నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎండి యూసుఫ్, ఎం నరసింహ మాట్లాడుతూ జిఒ నంబర్ 60 ప్రకారం ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాన్ని రూ.15600లుగా నిర్ధారించగా, పిఎఫ్, ఈఎస్ఐల వాటా పోగా ప్రభుత్వంజారీ చేసిన జిఒ నంబర్ 21ని అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని, కార్మికుల అక్రమ తొలగింపులను అరికట్టాలని, కార్మికులపై కాంట్రాక్టర్లు, అధికారుల వేధింపులను మానుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహ అధ్యక్షురాలు ఎం. లక్ష్మి బాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, రాష్ట్ర కార్యదర్శులు పి సురేష్, సిరా దేవేందర్, సుధాకర్, ఎస్ కిష్టమ్మ, ఇమ్రాన్,వెంకటరాజ్యం, వి నోద్ తదితరులు పాల్గొన్నారు.

# సాహితీ విహారి

## భారత స్వాతంత్ర్యోద్యమం-తెలంగాణ ముస్లిం యోధులు



సురవరం సుధాకర రెడ్డి

'భారత స్వాతంత్రోద్యమం తెలంగాణ ముస్లిం యోధులు పుస్తకాన్ని రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ గారు నాకు పంపారు. వారికి ధన్యవాదాలు. భారత స్వాతంత్రోద్యమంలో తెలంగాణ సాయుధ పోరాటం ఒక మహోజ్వల ఘట్టం. ఈ పుస్తకాన్ని ఆసక్తితో చదివాను. నశీర్ అహమ్మద్ గారు న్యాయవాది. అనేక పుస్తకాల రచయిత. ఈ పుస్తకంలో కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ చాలా మంచి సమాచారం ఉంది. 1857 లో ప్రధమ భారత స్వతంత్ర పోరాటం నుండి 1948 వరకు తొమ్మిది దశాబ్దాల లో జరిగిన విభిన్న తిరుగుబాట్లు, పోరాటాలు, అందులో పాల్గొన్న ముస్లిం దార్మికులు, మేధావులు, నాయకుల గురించి సమాచారం ఇందులో ఉంది. సహజంగా ఇది చరిత్ర. దీనికి తగిన ఆధారాలు లభించటం కష్టం. ఇవన్నీ రాసి పెట్టబడలేదు. విజేతలే చరిత్ర లిఖిస్తారు అని ఒక నానుడి ఉంది. అక్కడక్కడా దొరికిన కొంత సమాచారాన్ని సేకరించి కష్టపడి దీనికొక పుస్తక రూపం తెచ్చారు. గొప్ప విశ్లేషకులు, రచయిత, మిత్రులు వేణుగోపాల్ గారు, పరిచయవాఖ్యంలో ఇలాంటి సమాచార సేకరణలో ఉండే పరిమితులు చెప్తూ, ఈ పుస్తకం ఆవశ్యకత గురించి వివరించారు. పరిచయ వాఖ్యం చదివిన తర్వాత మరింత ఆసక్తితో ఈ పుస్తకం 350 పేజీలు రెండు రోజుల్లో చదివాను.

దేశావ్యాప్తంగా మతోన్మాదులు ముస్లిం మైనారిటీల మీద అబద్ధాల ప్రచారం తో తీవ్ర ద్వేషాన్ని రెచ్చగొడుతూ, భయోత్పాతాన్ని సృష్టిస్తూ వారి మూలాలను, వారి దేశ భక్తిని ప్రశ్నార్థకం చేసి, సాధారణ ప్రజలలో అనుమానాలను రేకెత్తిస్తున్న నేపథ్యంలో, ముస్లిం దేశభక్తులు విప్లవకారుల చరిత్ర రావటం ఒక చారిత్రిక అవసరం.





హైదరాబాదు సంస్థానం భారతదేశంలో అతిపెద్ద సంస్థానం. కాలం చెల్లిన ఫ్యూడలిజం ప్రతి రూపం. ముస్లిం ప్రజలు కొద్దిశాతం ఉన్నప్పటికీ, అధికారుల లో తొంభై శాతం ముస్లింలే. విచిత్రమేమిటంటే అందులో ఎక్కువ భాగం స్థానిక ముస్లింలు కాదు. ఉత్తర హిందూ స్థానం నుండి, ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ నుండి వచ్చినవారు. ముస్లింలో అత్యధికులు పేదవారు. గ్రామీణ హైదరాబాదు అత్యధిక భూమి నిజాంను బలపరిచే హిందు భూస్వాములు దేశముఖుల చేతుల్లో ఉండేది. దారుణమైన వెట్టిచాకిరి ఉండేది.

ఇలాంటి పరిస్తితుల్లో కొందరు ముస్లిం మేధావులు, జర్నలిస్టులు ముఖ్యంగా మధ్య తరగతిలో నిజాం వ్యతిరేక భావాలుండేవి. నగరంలో పేద ముస్లిములలో లంపెన్ సెక్షన్లు రజాకార్లు అయ్యారు. స్వతంత్ర రాజ్యంగా హైదరాబాదు సంస్థానాన్ని ప్రకటించుకొని ప్రపంచ ముస్లింల చక్రవర్తి కావాలనే మూర్ఖపు దురాశతో రజాకార్లను ఎగదోసాడు. ఈ పుస్తకంలో రాసినట్లుగా, నిజాంకు వ్యతిరేకులైన వారి మీద మాత్రమేగాక, సాధారణ పేద రైతులు, వ్యవసాయ కూలీల మీద రజాకార్లు ఘాతుకాలు చేశారు. మానభంగాలు హత్యలు జరిగాయి. రజాకార్లు షోయబుల్లా ఖాన్ లాంటి గొప్ప సంపాదకుడిని కూడా హత్య చేశారు.

భారతదేశంలో సంస్థాన విలీనం తర్వాత, మారాత్వాడా ప్రాంతం లో ముస్లింల మీద అనేక అరాచకాలు, దాడులు హత్యలు జరిగినట్లు పండిట్ సుందర్ లాల్ కమిటీ రిపోర్టును నశీర్ అహమ్మద్ గారు ఇందులో వివరించారు. అది ఇప్పటికైనా

### గ్రంథ పరిచయం

బయటకు రావలిసిందే. నెహ్రూ మ్యూజియంలో ఉన్న ఆ పుస్తకం ప్రస్తుతం అందుబాటులో ఉందో ప్రస్తుత ప్రభుత్వం మాయం చేసిందో తెలియదు.

హైదరాబాదు నగరంలో వరంగల్ లో పెద్ద పరిశ్రమలు, రైల్వే, అర్.టి.సి. లాంటి వాటిలో కార్మికులలో అత్యధికులు ముస్లింలే. వారు న్యాయమైన వేతనాల కోసం, హక్కుల కోసం సమ్మె పోరాటాలు చేశారు.

నవాబు ముస్లిం గనుక ఈ పోరాటం ముస్లిం వ్యతిరేకమని మౌల్వీలు ప్రచారం చేసినా, వారు తిరగబడ్డారు. వ్యక్తులుగా తోపాటు ముస్లిం,హిందూ కార్మికుల సామూహక పోరాటం ముఖ్యమైంది.

అలాగే మహబూబ్ నగర్ జిల్లాలో ప్రభుత్వద్యోగానికి రాజీనామా చేసి సాయుధ పోరాటం చేసిన యోధుడు మార్జా ఫరాహతుల్లా బేగ్. మెదక్ జిల్లలో ముస్లిం జగర్ దారు కుటుంబంలో పుట్టి సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన మొయనుద్దీన్ జహీర్ దంపతులు, సిద్ధి పేటలో సిరాజుద్దీన్. హైదరాబాదు నగరం లో ఆర్.టి.సి. కార్మికోద్యమ నిర్మాత సయ్యద్ ఖాసిం తదితరుల చరిత్ర ఇలాంటి పుస్తకంలో రావలసి ఉంది.

రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ చాలా గొప్ప పరిశోధన చేశారు. స్వయంగా పరిశోధించి సమాచారం సేకరించడం, రాయటం, ప్రచురించడం, ప్రజలలో పంపిణి చేయటం చాలా శ్రమతో కూడిన కార్యక్రమం. ఇది తప్పక చదవ వలసిన పుస్తకం. నశీర్ అహమ్మద్ గారికి అభినందనలు.

## ఆలోచనా పరిధిని పెంచే సైన్స్ ఫిక్షన్

రచయిత దార్శనికుడైతే మంచిది. ఈ లక్షణం సైన్స్ ఫిక్షన్ రచయితలకు అత్యవసరం. చాలా మంది రచయితలు సమకాలీన అంశాలపై స్పందిస్తారు. వాటిని విశ్లేషిస్తారు. ఉదాత్తమైన రచనలతో ప్రజల్లోకి తీసుకెళతారు. సహజంగా ఇలాంటి రచయితలే ఎక్కువగా కనిపిస్తారు. అయితే, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకొని, దానిని అందంగా, ఆకర్షణీయంగా రచనల్లో పొందుపరచే వారు కూడా ఉన్నారు. వీరినే సైన్స్ ఫిక్షన్ (వైకల్పన) రచయితలు అంటాం. పాఠకుల ఆలోచనా పరిధిని పెంచడానికి సైన్స్ ఫిక్షన్‌ను మించిన మార్గం లేదు. సైన్స్‌లో ఏ అంశాన్నయినా, ఒక పాఠంగా చెప్తే సులభంగా అర్థం కాదు. అత్యధికులు దానిపై శ్రద్ధ చూపరు. వినడానికి లేదా చదవడానికి కూడా ఇష్టపడరు. అదే సైన్స్‌ను ఒక కథ లేదా నాటకం రూపంలో వివరిస్తే, తొందరగా ఆకర్షితులవుతారు. సైన్స్‌కు నాటకీయత కూడా జోడించడమే అందుకు కారణం. సైన్స్ ఫిక్షన్ కథలు లేదా నవలల్లో వివిధ సామాన్య శాస్త్రాల మూల సూత్రాలను మార్చరు. కానీ, ఆ మూల సిద్ధాంతాల చుట్టూ కథను అల్లుకుంటూ వెళతారు. పాత్రలు, సందర్భాలు సృష్టిస్తారు. కథనంలో ఎక్కడా ఆసక్తి తగ్గకుండా జాగ్రత్త పడతారు. అందుకే, సైన్స్ ఫిక్షన్ నవల చదువుతున్నంత సేపూ, అందులోని రచయిత చేర్చిన ఊహలు లేదా అంచనాలను పాఠకులు పట్టించుకోరు. రచయిత ఎంతో యుక్తిగా అందించిన కథను ఎంతో ఆసక్తిగా చదువుతాడు. తనకు తెలియకుండానే, సైన్స్‌లో ప్రాథమిక అంశాలు లేదా సిద్ధాంతాలను అర్థం చేసుకుంటాడు. వాటిపై పట్టు సాధించలేకపోయినా, కనీస అవగాహనైనా లభిస్తుంది. నేటి ప్రపంచానికి సైన్స్ ఫిక్షన్ కథాంశాలే అవసరం. ఎందుకంటే, గతంతో పోలిస్తే, ఎన్నడూ లేనంతగా ఇప్పుడు శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం కొత్త తొక్కుతున్నది. అధునాతన సంకేతికత అందుబాటులోకి వచ్చింది. అన్ని రంగాల్లోనూ సాంకేతిక విప్లవాన్ని చూడవచ్చు. పుంఖానుపుంఖంగా వస్తున్న ఈ మార్పులను అవగాహన చేసుకోవడం అనుకున్నంత సులభం కాదు. నేటి తరం యువత కొంతవరకైనా సులభంగా అర్థం చేసుకుంటుందేమోగానీ, సామాన్యులకు, ప్రత్యేకించి గ్రామీణులకు మాత్రం ఈ మార్పులను పట్టుకోడం చాలా కష్టం. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న.. లేని .. రెండు భిన్న ధ్రువాల మధ్య వారధిగా సైన్స్ ఫిక్షన్‌ను పేర్కోవాలి. ఈ సాహిత్యం తరచుగా తన సమయం కంటే ముందు ఉంటుంది,





భవిష్యత్తులో సాంకేతిక పురోగతులు, సామాజిక మార్పులను అంచనా వేస్తుంది. దీనికి ఒక ఉదాహరణ జార్జ్ ఆర్వెల్ రాసిన క్లాసిక్ నవల '1984'ను పేర్కోవాలి. ఇది నిరంకుశ ప్రభుత్వం నియంత్రించబడే డిస్టోపియన్ సమాజాన్ని వర్ణిస్తుంది. ఇది సాంకేతిక పరిజ్ఞానం ద్వారా దాని పౌరులను పర్యవేక్షిస్తుంది. నేటి ప్రపంచంలో, నిఘా సాంకేతికత పెరిగింది. ప్రభుత్వ నియంత్రణపై ఆందోళనలు నెలకొంటాయి. సైన్స్ ఫిక్షన్ సాహిత్యానికి మరొక ఉదాహరణ ఆల్డస్ హక్స్లీ రచన 'బ్రేవ్ న్యూ వరల్డ్'. ఈ నవలలో, హక్స్లీ భవిష్యత్ సమాజాన్ని ఊహించాడు. ఇక్కడ మానవులను జన్యుపరంగా మారుస్తారు. నిర్దిష్ట సామాజిక పాత్రలకు సరిపోయేలా తీర్చిదిద్దుతారు. జన్యుపరమైన మార్పులతో విప్లవాత్మక మార్పులకు వ్యవసాయ రంగం ఇప్పటికే ప్రయోగాలకు కేంద్రంగా మారింది. ఫిలిప్పీన్స్‌లో పసుపు బియ్యం ఈ రకమైన ఇంజనీరింగ్ మార్పులతో జరిగిన సృష్టే. భవిష్యత్తులో మానవులంతా ఇలాంటి జన్యు మార్పిడి ఆహార పదార్థాలను వినియోగించక తప్పదని శాస్త్రవేత్తలు అంటున్నారు. అంటే, జన్యుపరమైన మార్పులను హక్స్లీ ఊహించాడు. మనుషులను జన్యమార్పిడి ద్వారా మార్చవచ్చని అంచనా వేశాడు. 'బ్రేవ్ న్యూ వరల్డ్'ను చదివిన వారు ఎవరికైనా జన్యుపరమైన మార్పులపై ఎంతోకొంత అవగాహన ఏర్పడుతుంది. దాని ప్రాధాన్యం, ఆవస్యకతలపై ప్రాథమిక ఆలోచన ఏర్పడుతుంది. ఇప్పుడు వ్యవసాయ రంగంలో జరుగుతున్న ప్రయోగాలను అర్థం చేసుకునే కనీస పరిజ్ఞానం వారికి లభిస్తుంది. ఒకవైపు పాఠకుడికి గొప్ప నవల చదివిన అనుభూతిని కలిగిస్తూనే, మరోవైపు సైన్స్‌పై అవగాహన కల్పించడంలో హక్స్లీ కృతకృత్యుడయ్యాడు. ఇక్కడ ఆనందాన్ని కోరుకునే వినియోగదారువాదం సర్వోన్నతంగా ఉంటుంది. జన్యు ఇంజనీరింగ్‌లో పెరుగుతున్న పురోగతులు, వినియోగదారు సంస్కృతి పెరుగుదల, అనుకూలత వంటి అంశాలను చర్చిస్తారు. సౌకర్యం కోసం వ్యక్తిత్వాన్ని, స్వేచ్ఛను త్యాగం చేయడం వల్ల కలిగే ప్రమాదాల హక్స్లీ గొప్పగా వివరిస్తాడు. ఆ నవలలో అతను చేసిన హెచ్చరిక అప్పటి కంటే ఇప్పుడే చాలా సందర్భోచితంగా అనిపిస్తుంది. సైన్స్ ఫిక్షన్ సాహిత్యం ఎల్లప్పుడూ సమాజం ఆశలు, భయాలు, భవిష్యత్తు కోసం అవకాశాలను ప్రతిబింబిస్తుంది. కొత్త సాంకేతికతలు, నైతిక సందిగ్ధతలు, సామాజిక మార్పుల నేపథ్యంలో, ఎటు అడుగులు వేయాలో తెలియని సందిగ్ధంలో చిక్కుకున్నప్పుడు, సైన్స్ ఫిక్షన్ రచయితల అంతర్‌దృష్టులు, చేసే హెచ్చరికలు మనకు దారి చూపిస్తాయి. మన దారి ఎటు అనే ప్రశ్నకు విలువైన సమాధానాన్ని ఇస్తాయి. శాస్త్రీయ పురోమనాలు, సామాజిక మార్పులు కల్పించే అవకాశాలను అందుకోవడం కోసం పరిణామాలను అన్వేషించడం ద్వారా సైన్స్ ఫిక్షన్ సాహిత్యం మనం జీవిస్తున్న ప్రపంచం, మనం సృష్టిస్తున్న భవిష్యత్తు గురించి విమర్శనాత్మకంగా ఆలోచించమని ఉత్సాహపరుస్తుంది. అందుకు అవసరమైన కనీస పరిజ్ఞానాన్ని అందిస్తుంది. ఇంతటి కీలకమైనది కాబట్టే, సైన్స్ ఫిక్షన్ అనేది శతాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా పాఠకుల ఊహలను ఆకర్షించే శైలిగా విరాజిల్లుతున్నది. జూల్స్ వెర్న్ రాసిన '20,000 లీగ్స్ అండర్ ది సీ' నుండి ఐజాక్ అసిమోవ్ రచన 'ఫౌండేషన్' సిరీస్ వరకు, సైన్స్ ఫిక్షన్ సాహిత్యం భవిష్యత్ అవకాశాలను విపులీకరిస్తున్నది. సమాజంపై సాంకేతికత ప్రభావాన్ని అన్వేషిస్తున్నది. ఈ కథల ద్వారా, రచయితలు మానవత్వ స్వభావం, శాస్త్రీయ పురోగతి పరిణామాలు, అత్యాధునిక సాంకేతికతల నైతిక చిక్కులు వంటి సంక్లిష్టమైన అంశాలను మనకు పరిచయం చేస్తారు. నైతిక, తాత్విక ప్రశ్నలను పరిశీలించి, పరిశోధించి మన అనుమానాలను నివృత్తి చేస్తారు. జిజ్ఞాసను మరింత పెంచుతారు. ప్రపంచ సాహిత్యంలో సైన్స్ ఫిక్షన్ ముఖ్య ఉపయోగాలలో మొదటిది హెచ్చరిక కథగా పనిచేయగల సామర్థ్యం. సాంకేతికత విపరీతంగా నడుస్తున్న లేదా సమాజం కొత్త మార్గాల్లో విభజించిన ప్రపంచాలను ఊహించడం ద్వారా రచయితలు సరికొత్త ప్రపంచాన్ని మన ముందు ఆవిష్కరిస్తారు. సంభావ్య పరిణామాలను అన్వేషిస్తారు. ఈ ఊహాజనిత కథనాల ద్వారా, పాఠకులు తమతమ ఎంపికల గురించి విమర్శనాత్మకంగా ఆలోచించమని బోధిస్తారు. ఆ ఎంపికలు భవిష్యత్తుపై చూపే ప్రభావం గురించి వివరిస్తారు. సరైన మార్గంలో పయనించేలా ప్రోత్సహిస్తారు. వైజ్ఞానిక కల్పన రచయితలు సామాజిక, రాజకీయ, నైతిక సమస్యలను ఊహించి, సమీక్షించమేడమేగాక, పరిష్కారాలను కూడా చెప్పగలుగుతారు. అంతటి దార్శకత వారిది. సైన్స్ ఫిక్షన్ సాహిత్యం ఆవిష్కరణ, సృజనాత్మక ఆలోచనలను ప్రేరేపించడానికి శక్తివంతమైన సాధనం. కొత్త ప్రపంచాలు, సాంకేతికతలు మరియు సమాజాలను ఊహించడం ద్వారా, రచయితలు పాఠకులను పెట్టె వెలుపల ఆలోచించమని మరియు ప్రత్యామ్నాయ అవకాశాలను పరిగణించమని సవాలు చేస్తారు. ఈ శైలి పాఠకులను వర్తమానానికి భిన్నమైన భవిష్యత్తును ఊహించుకోమని ప్రోత్సహిస్తుంది, ఉత్సుకతను రేకెత్తిస్తుంది మరియు కొత్త ఆలోచనలు మరియు అవకాశాలను అన్వేషించడానికి వారిని ప్రేరేపిస్తుంది. సాధ్యమయ్యే సరిహద్దులను నెట్టడం ద్వారా, సైన్స్ ఫిక్షన్ పాఠకులను సృజనాత్మకంగా ఆలోచించమని, వర్తమాన పరిమితులచే నిర్బంధించబడని ప్రపంచాన్ని ఊహించమని సవాలు చేస్తుంది.

**సత్యశ్రీ**

### చదువు విలువను తెలియ చేయడానికి ఇంత కంటే మంచి ఉత్తమ మార్గం ఏముంటుంది?



### పుస్తక పఠానాన్ని ఒక అలవాటుగా మార్చుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. వాటిలో కొన్ని...

1. పుస్తకాలు విస్తారమైన జ్ఞానాన్ని అందిస్తాయి
2. పదజాలం మెరుగుపడుతుంది. కొత్తకొత్త పదాలు తెలుస్తాయి.
3. పుస్తకాలు చదవడం అనేది జ్ఞాపకశక్తిని పెంచుతుంది. అభిజ్ఞా పనితీరుకు పదును పెడుతుంది. మనస్సును చురుగ్గా ఉంచుతుంది. ఏకాగ్రతతో పనులు చేసే అలవాటు ఒంటపడుతుంది.
4. దైనందిన ఆందోళనల నుంచి బయపడాలంటే పుస్తక పఠనాన్ని మించిన మార్గం లేదు. ఇది తాత్కాలిక ఉపశమాన్నివ్వడమేగాక, మనసుకు, తద్వారా శరీరానికి అత్యవసరమైన విశ్రాంతినిస్తుంది.
5. పుస్తక పఠనంతో ఏకాగ్రత పెరుగుతుంది. ఎక్కువ సమయం దృష్టి కేంద్రీకరించే సామర్థ్యాన్ని పెంచుతుంది.
6. సమాజాన్ని, మనుషులను వివిధ కోణాల్లో చూడడం, అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది. మనిషిని మనిషిగా చూసే తత్వం అలవాటవుతుంది.
7. సృజనాత్మకత పెరగాలంటే పుస్తకాలు చదవడం అత్యవసరం. అంతేకాదు, ఎన్నో రకాల సమస్యలకు పుస్తకాల్లో పరిష్కారాలు లభిస్తాయి. అవి నిత్య జీవితంలోనూ ఉపయోగపడతాయి.
8. మన అభిప్రాయాలను సమర్థంగా కాగితంపై పెట్టే నైపుణ్యం పదెరుగుతుంది. రైటింగ్ స్కిల్స్ మెరుగుపడతాయి. సంభాషణల్లో స్పష్టత ఉంటుంది. ప్రవర్తనలో గుణాత్మక మార్పులకు అవకాశం కల్పిస్తుంది.
9. నిద్రలేమితో బాధపడుతున్న వారికి మంచి ఔషధంగా పుస్తక పఠానాన్ని పేర్కోవాలి. పడుకునే ముందు పుస్తకం చదవడానికి కొంత సమయాన్ని కేటాయించడం అలవాటు చేసుకుంటే, మంచి నిద్ర పడుతుంది.
10. కొత్త ప్రపంచాలకు మనకు పరిచయం చేసేవి పుస్తకాలే.
11. ఒకరి జీవితకాల అనుభవాలను, నేర్చుకున్న పాఠాలను మనం వారి పుస్తకాల ద్వారా కొన్ని గంటల్లోనే గ్రహించగలుగుతాం.

## ఈ వారం కవితలు

### నెత్తురు ఊరుతుంది!!

అధికార భద్రత కోసం
ఉక్కుపాదం మోపిన
నేల దండకారణ్యం...!
ఏ గూడెంను కదిలించినా
రక్తం స్రవిస్తుంది
ఎక్కడ త్రవ్వినా
నెత్తురు ఊరుతుంది...!
ఏర్లూ వాగులూ వంకలన్నీ
రక్త ప్రవాహాలే..!
దాడులకు ఆకులు
అల్లల్లాడుతున్నాయి
నెత్తుటి దుప్పటి కప్పుకున్న
నేడు దండకారణ్యం
కత్తుల కోలాటంతో
కదుల్తూనే ఉంటుంది
యుద్ధ సంగీతాన్ని
మ్రోగిస్తూన్నాం.....!!!

**శోభరమేష్**
8978656327

### కన్న పేగు



జన్యువులు కట్టిన..
అనువంశిక వారధి..
ప్రాణాధార కన్న పేగు
తరతరాలకు పెన్నిధి !

మాతాపితలిచ్చిన దేహం..
అపూర్వ ప్రేమ ప్రాణ ప్రసాదం
సృష్టి దాతలే అమ్మనాన్నలు
మమకారపు నుడికారాలు !

తల్లితండ్రుల తదేక తపనలు
పేగు కూర్చిన అనుబంధాలు
కన్న బిడ్డలకు కంటికి రెప్పలు
కన్నోళ్లను నిలబెట్టే తల్లి వేళ్లు !

అయ్యవ్వలు పుస్తకాల పుటల్లో..
దాగిన నెమలి కన్నే కాదు
చంటోళ్ల ఉజ్వల మనుగడకు..
బలమైన వెన్ను దన్ను కూడా !

అమ్మ ఆకలిని తీర్చే ఒడి
నాన్న నడత నేర్పే బడి
అయ్యవ్వల ఊపిరే సంతానం
అమ్మనాన్నల బాకీ తీర్చలేని నిధి !

చిట్టి పొట్టి వేళ్ళకు..
నాన్న చేయి ఊతకర్ర
శిశువుకు అమ్మ ఒడి..
మహాశక్తిమాతల పుణ్య గుడి !

ఊరూరా పుట్టగొడుగుల్లా..
మొలుస్తున్న వృద్ధాశ్రమాలు..
ముసలి అమ్మనాన్నల గుండెల్లో..
పరుగెత్తే అనాథ రైలు ప్రతిధ్వనులు !

తాత బామ్మల్ని వృద్ధాశ్రమంలో..
చూసి మనవడు నేర్చిన పాఠం
కడకు తన అమ్మనాన్నల్ని..
గెంటేస్తాడు అనాథాశ్రమంలోకి..
మీరు నేర్పిన విద్యయే కదా అమ్మనాన్న !

**మధుపాళీ**
9949700037

### నేను మామూలు మనిషిని

సఖీ!
నీ తేజో మంగళ రూపాన్ని
కనినంతనే
నా హృదిలోని భావాలు
రాగాలుగా మారగా,
నీ క్రీగంటి చూపు
నా కాళ్ళకు బంధాలు,
మనసుకు కళ్ళెం వేసింది.
నీ మధుర స్వరం
తుమ్మెద నాదంగా,
నీ గానామృతం
వీణాతరంగాలుగా వినిపించగా
ముగ్ధుడనైన నేను
హృదయ తలుపులు తెరచి
నిన్ను ఆహ్వానించాలనుకున్నా
మనస్ఫూర్తిగా...

కానీ...
ఎన్నో అడ్డంకులు
సామాజిక కట్టుబాట్లు
కులమతాల అడ్డుగోడలు
వెనక్కు లాగుతున్నాయి...

నిన్ను నా హృదయ పీఠంపై
ప్రతిష్టించాలనుకున్నా..
చేయలేని దుస్థితి...

నీ నవ్వులను ఒడిసిపట్టి
నా గుండె గూటిలో దాచుకోవాలనుకున్నా...
దాచలేని మూర్ఖత్వం నాది.

ఎగురుతాను ఆశల రెక్కలతో,
ఊగుతాను కోర్కెల ఊయలలో
పరవశిస్తాను నీ తలపుల సమీరాలలో,
ఆలపిస్తాను నీకై వలపుల
మోహనరాగాన్ని.

కానీ....ప్రేమకోసం
సాహసం చేయలేని
మామూలు మనిషిని నేను.
ఏం చేయను?
నా పరిస్థితి అటువంటిది.

**వేమూరి శ్రీనివాస్**
9912128967

### వరి 'వర్రీ' !?

పంట భూమిలో పడ్డ వరి గింజకు' వర్రీ వర్రీ !'
పండగ పోతే రైతు ఏమై పోతాడేమోనని' వర్రీ !'
వాన మబ్బుకూ 'వర్రీ 'ఉండాలి కురవాలని !
అయితేనే జనం 'వర్రీ 'పోతుంది !
చిన్న గింజే వరి !
పెద్ద సంకల్పం మరి !
పండి అందరి పెద్ద ఆకలి పోగొట్టాలని!!



**కందాళై రాఘవాచార్య**
8799593638

### ఏరొక్క పున్నమి

ఏరొక్క పున్నమి వచ్చింది
ఏరువాక ఏకమై సాగింది
వెన్నెలంత చల్లదనం తెచ్చింది
పారుకుంటూ పారుకుంటూ
పంట చేండ్లను పలకరించుకుంటూ
ఏరు మా ఊరు వచ్చింది
బసవన్నల పండుగే చేసింది
పులగం ముద్దలు పెట్టింది
చుట్ట పక్కాలను పిలిచింది
పోలెలు ,భోజనాలు పెట్టింది
ఊరంతా సంబరాలు చేసింది
ఎద్దు వ్యవసాయల ఆసామి
తోరణాలు తెంచిండు
వెన్నెల్లో చిందేసి ఆడిండు
పాడిపంటలు పొర్లి పండాలని
భూ లక్ష్మి ని మొక్కిండు
ఏరువాక సాగించే ఓ రైతన్న
నువ్వెప్పుడు పైకి వస్తావు రా!
ఏ సర్కారు రైతులకు బందువు
అవుతుంది రా!
సామి దగ్గర నువ్వెప్పుడూ
ఆసామివేనా !
వీడెప్పుడ స్వామి అవుతాడు రా
ఓరి దేవుడా!
ఏటేటా ఏరొక్క పున్నమి
చుట్టమై వస్తుంది
ఏమి చెప్పకుండానే పోతుంది.

**పి.బక్కారెడ్డి**
9705315250

### రూపాయి

రూపాయి రూపాయి
నీవు ఒక పాపాయి
బుజ్జగిస్తే వెంట ఉంటవ్
కోపగిస్తే దూరమైతవ్
కష్టం కడుపున పుట్టిన
కలికితురాయి
సేద్యపు బిందువుల
పాపాయి
చేయి జారితే కష్ట
మోయి
చెంత ఉంటే స్వర్గ
మోనోయి.



**గుండెల్లి ఇస్తారి**
9849983874

### అక్కరకు రాని చుట్టం

ధనం ఉన్నా ధాన గుణం
లేనివాడు
ఆపదలో ఆదుకోని
స్నేహితుడు
ముఖం చాటేసే...
పరిచయస్థుడు
చెప్పుడుమాటలు
నమ్మి చెడేవాడు
పేరుకు మాత్రమే ...
ఆత్మీయుడు
అలాంటి వాడు అక్కరకు
రాని చుట్టం
విడి పోకుండానే దూరం
పెట్టడం మన లౌక్యం

**డా.ఎస్ సూర్య ప్రకాష్**

## మున్సిపల్ సమస్యలపై పొన్నం ఫోకస్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** కరీంనగర్ నగరపాలక సంస్థలోని సమస్యలపై రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోకస్ పెట్టారు. ఈ సంధర్బంగా ఆదివారం నగరంలోని కార్పోరేటర్లు, మాజీ కార్పోరేటర్లతో కరీంనగర్ డిసిసి కార్యాలయంలో సమావేశమై ఆరా తీశారు. మున్సిపల్ కార్పోరేషన్లోని పలు సమస్యలను కార్పోరేటర్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కార్పోరేటర్లు చెప్పిన పలు సమస్యలపై స్పందించిన మంత్రి వెంటనే అధికారులతో మాట్లాడారు. మేయర్ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని, ప్రజల పక్షాన కార్పోరేటర్లు అండగా వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని మంత్రి సూచించారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని, సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## విద్యార్థులకు తీవ్ర నష్టం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నీట్‌లో జరిగిన అవకతవకల కారణంగా విద్యార్థులు నష్టపోయారని వెంటనే నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని పలు ఉపాధ్యాయ, యువజన, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించకపోవడంతో పేపర్ లీకేజ్ అయి లక్షలాది మంది విద్యార్థులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా పరీక్షను రద్దు చేసి పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.గణేష్, శ్రీనివాస్ చారి, రామయ్య, ముప్వా రామారావు, అంబటి నాగయ్య, వేణుగోపాల్ రెడ్డి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడుకు నిధులు

**ప్రజాపక్షం/మునుగోడుః**జిల్లా ప్రజాపరిషత్ 15వ ఆర్థిక సంఘం 2024/25 సంవత్సరానికి సంబంధించిన జెడ్‌పిటిసి నిధులు మునుగోడు మండలానికి 17 లక్షలు మంజూరు అయ్యాయని జిల్లా సాంఘిక సంక్షేమ స్థాయి సంఘం చైర్మన్ మునుగోడు జెడ్‌పిటిసి నారబోయిన స్వరూప రాణి రవి తెలిపారు. మునుగోడు మండలంలోని పలు గ్రామాలలో అభివృద్ధి కోసం రూ.17 లక్షలు నిధులు మంజూరు కాగా మండలంలోని మునుగోడు,పులిపల్పుల,ఇప్పర్తి చల్మెడ,గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులను చేపడుతున్నట్లు జెడ్‌పిటిసి నారబోయిన స్వరూప రాణి రవి ముదిరాజులు తెలిపారు.

## రైతుల సంక్షేమానికి కృషి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ః** రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షులు బచ్చు అశోక్‌కుమార్,నియోజకవర్గఅధ్యక్షుడు పులిచింతల అంజిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కిసాన్ సెల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తుందన్నారు. రాహుల్,ప్రియాంక గాంధీలు రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారన్నారు.రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధు సూదన్‌రెడ్డి, చిట్యాల నర్సిరెడ్డి, కోటయ్య,లక్ష్మీ నారాయణరెడ్డి, రేపాకుల కన్నయ్య, అరవింద్‌రెడ్డి, మాతంగి బసవయ్య, సోమిరెడ్డి రామిరెడ్డి పాల్గొన్నారు.

## వైశ్యులంతా కలిసికట్టుగా ఉండాలి




**ప్రజాపక్షం/ఆలేరు :** రాష్ట్రంలో వైశ్య సంఘం సభ్యులు కలిసికట్టుగా ఉండి పార్లమెంటులో శాసనసభలో ఎన్నిక అయ్యేంతవరకు కృషి చేయాలని ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, బూడిద బిక్షమయ్య గౌడ్ అన్నారు. ఆదివారం ఆలేరు పట్టణంలోని ప్రకాష్ గార్డెన్లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి వారు హాజరై ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ గుప్తా, నారాయణ, స్వప్న, భాగ్యలక్ష్మి, మంజుల, రవికుమార్, సంతోష్, నరేష్, జిల్లా అధ్యక్షులు సరబు సంతోష్, నియోజకవర్గ ఇన్చార్జి వంగపల్లి ఆంజనేయస్వామి, జిల్లా అధ్యక్షురాలు సముద్రాల కల్పన, నాయకులు సముద్రాల కుమార్, శ్రీనివాస్, లక్ష్మణ్, సాయిబాబా, వేణు, మణికంత, రమేష్, వరప్రసాద్, అశోక్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై వినతుల వెల్లువ

**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డికి వినతులు వెల్లువెత్తాయి. మంత్రి క్యాంపు కార్యాలయ సమీపంలో గల పార్క్ లో వివిధ సమస్యలకు సంబంధించి పట్టణ ప్రజలతో పాటు నియోజకవర్గానికి సంబంధించిన ప్రజలు మంత్రికి కలిసి వినతి పత్రాలు సమర్పించారు. పలువురు సమస్యలను విన్న మంత్రి ఫోన్‌లో పలువురు అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించారు. మరి కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పలువురి పేద విద్యార్థుల చదువు కోసం మంత్రి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, జెడ్‌పిటిసి వంగూరి లక్ష్మయ్య తదితరులున్నారు.



# హామీలే తప్ప.. ఇళ్ళేవి?

**ప్రజాపక్షం/నల్లగొండ :** నల్లగొండ పట్టణ పరిధిలోని సాగర్ రోడ్డులో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో జరిగిన పార్టీ పట్టణ సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా వివిధ ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం వచ్చిన పేదలు సొంత ఇండ్లు లేక అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. పాలకులు ఎన్నిసార్లు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇస్తామని వాగ్దానాలు చేశారే తప్పా ఇంతవరకు నల్లగొండ పట్టణంలో ఏ ఒక్కరికి కూడా ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. నల్లగొండ పట్టణ పరిధిలోని గంధంవారిగూడెంలో వెంకటరమణ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న నిరుపేదల గుడిసెలను ఇటీవల కాలంలో పోలీసులు అకారణంగా తొలగించారని పేర్కొన్నారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే ఎలా తీసివేస్తారని పోలీసులను ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. పుట్ల సుజాత అధ్యక్షతన వహించారు. సిపిఐ పట్టణ నాయకులు విశ్వనాథుల లెనిన్‌బాబు, చిత్రం యాదగిరి, దిగజారుల కోటిలింగం, ఎస్‌డినసార్, గారయ్య, రేణుక, కౌసల్య, జె.విజయ,నుస్రత్,జ్యోతి,కళ్యాణి, రజిత, భవాని, సౌజన్య తదితరులున్నారు.



## ‘మీ మేలు మరువను’

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:**దామన్న మీ మేలు ఎన్నటికి మరువను అన్నా అంటూ నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్న అన్నారు. తన గెలుపులో కీలకంగా కృషి చేసిన మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జీ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డిలను ఆదివారం సూర్యాపేటలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్చాలు అందజేశారు. అభినందనలు తెలిపారు. అనంతరం దామోదర్‌రెడ్డి కూడా నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్నను ఘనంగా సన్మానించారు. ఇరువురు ఆత్మీయ అలింగనం చేసుకున్నారు. నీ తమ్ముడిగా నీ వెంట నడుస్తానని సూర్యాపేట నియోజకవర్గ అభివృద్ధిలో తన పాత్ర ఉంటుందని చెప్పారు.

## కల్వర్టుకు రక్షణగోడ నిర్మించాలి



**ప్రజాపక్షం/నేరేడుచర్లః** నేరేడుచర్ల నర్సయ్యగూడెం గ్రామానికి మధ్యన ఉన్న కల్వర్టుకు రక్షణగోడ తక్షణమే నిర్మించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రమాదకర పరిస్థితిలో ఉన్న రక్షణగోడ లేని కల్వర్టును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వర్టుకు వాల్,ఎలాంటి ప్రమాద సూచికలు లేకపోవడం వలన వాహన దారులకు ప్రమాదం పొంచి ఉన్నదన్నారు.తక్షణమే అధికారులు జోక్యం చేసుకుని కల్వర్టుకు వాల్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.కనీస ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శన మన్నారు.పట్టణం నుంచి పాలకవీడు మండల చివరి గ్రామాల వరకు ఇలా అనేక కల్వర్టులు రక్షణ గోడలు లేకుండా ఉన్నాయన్నారు.మండలాలలోని గ్రామాల అభివృద్ధికి కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నామని చెప్పుకుంటున్న నాయకులకు ఇలాంటి ప్రమాదకర కల్వర్టులు కనిపించక పోవడం శోచనీయమన్నారు. గతంలో అనేక సందర్భాల్లో ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకవచ్చినప్పటికి ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ప్రజల విలువైన ప్రాణాలు పోకముందే సంబంధిత అధికారులు కల్వర్టులకు ఇరువైపులరక్షణగోడలునిర్మించాలనిఆయనవిజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను,ఏఐఎస్ఎఫ్ నాయకులు కొమ్రరాజు వెంకట్,లక్ష్మయ్య స్థానికులు తదితరులు ఉన్నారు.

## ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆదివారం వైద్యాధికారులతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పూర్తిగా శుభ్రపరిచి ఆసుపత్రికి వచ్చే రోగులకు వారి వెంట వచ్చే సహాయకులకు విశ్రాంతి తీసుకునే విధంగా ఉండేలా చెట్లను, బల్లలను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా రోగుల కోసం తయారు చేసే భోజనాలను పరిశీలించారు. ఏరియా ఆసుపత్రి అంటే సొంత ఇల్లు ఎలా ఉంటుందో అంత శుభ్రంగా ఉండాలని అధికారులకు సూచించారు. పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ సమరథ్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల సమస్యలు పట్టవా? : ఎఐటియుసి

**ప్రజాపక్షం/చింతపల్లి :** కాంగ్రెస్ పార్టీ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి వారి సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ చింతపల్లి ప్రాజెక్టు నాయకులు గోవింద్ అంజలి, జి రమణ డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటియుసి ఆధ్వర్యంలో నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సమ్మె నిర్వహిస్తే ఆ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ అంగన్వాడీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చిన విధంగా అంగన్వాడీలకు తక్షణమే రూ. 18 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు లక్షరూపాయలు, ఆయాలకు రూ. 50 వేలు మాత్రమే చెల్లిస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలపై పనిభారం తగ్గించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఖాళీగా ఉన్న సుపర్వైజర్ పోస్టులు భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో నేడు నిర్వహించే ధర్నాలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అలివేలు, పద్మ, జయమ్మ, వెంకటమ్మ, వీణ, ప్రమీల, వసీమబేగం, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనుల్లో నాణ్యత తప్పనిసరి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ః** ఈ నెల 19వ తేదీన కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో శంకుస్థాపన చేసిన ఆర్‌అండ్‌బి పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆర్అండ్‌బి అధికారులకు సూచించారు.ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలు ఆర్‌అండ్‌బి సీఈ మోహన్‌నాయక్, రాజేశ్వర్ రెడ్డి,ఇతర ఆర్అండ్‌బి అధికారులతో కలసి సమీక్ష నిర్వహించారు.అనంతగిరి నుండి చనుపల్లికి డబుల్ రోడ్డు రూ.20కోట్లు,బరాఖత్‌గూడెం నుండి కేసీఆర్‌సిపురం డబుల్‌రోడ్డు రూ.20కోట్లు, ఎన్‌హెచ్ 9 నుండి మోతె వరకు డబుల్‌రోడ్డు రూ.25కోట్లు, మల్లారెడ్డిగూడెం నుండి రేవూరు మీదుగా రామాపురం వరకు డబుల్‌రోడ్డు రూ.20 కోట్లు, అమరవరం నుండి అలింగాపురం వరకు డబుల్‌రోడ్డు రూ.23కోట్లు,నేరేడుచర్ల నుండి దూపాడ్ వరకు డబుల్‌రోడ్డు రూ.26కోట్లు మంజూరైన రోడ్లకు త్వరగా టెండర్లు పిలవాలని,అనంతగిరి,పాలకవీడు,చింతలపాలెం మండలాల్లో మంజూరు చేయించిన తహసీల్దార్, ఎంపిడివో,పోలీస్‌స్టేషన్ కార్యాలయ భవనాల నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని మంత్రి ఉత్తమ్ ఆర్అండ్‌బి అధికారులను కోరారు.



# రైతు కుటుంబాలకు పెద్ద కొడుకు సిఎం

### ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ మంత్రి ఆర్‌డిఆర్




**ప్రజాపక్షం/సూర్యాపేట:**రైతు కుటుంబాలకు పెద్ద కోడుకు సిఎం రేవంత్ రెడ్డి అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ దేశంలోనే చారిత్రాత్మకమైన నిర్ణయమని కొనియాడారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో రైతు పంట రుణమాఫీని హర్షిస్తూ సిఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి ఏకకాలంలో రూ. 2లక్షల మాఫీ చేస్తున్నట్లు తెలిపారు. దీంతో రాష్ట్రంలోని 40లక్షల కుటుంబాలు రుణవిముక్తులు అవుతున్నారని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన పథకాలు మరే పార్టీలు తీసుకరాలేదన్నారు. రాష్ట్రంలో ఉచిత కరెంటు అందించిన ఘతన కాంగ్రెస్ పార్టీదని చెప్పారు. గత పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ లక్ష రూపాయల రైతు రుణమాఫీ చేయలేదని నేడు ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం 2లక్షలు మాఫీ చేస్తున్నట్లు తెలిపారు. సాగులో లేని భూములకు రైతుబంధు ఇచ్చి మాజీ సిఎం కెసిఆర్ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. నేడు సిఎం రేవంత్ రెడ్డి సాగులో ఉన్న భూములకు రైతుభరోసా అందించనున్నట్లు చెప్పారు. సూర్యాపేట నియోజకవర్గంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇందీరమ్మ ఇండ్లు తప్పా ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఏ ఒక్కరికి డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వలేదన్నారు. భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో జరిగిన అవకతవకల్లో జగదీష్‌రెడ్డి జైలుకు పోవడం ఖాయమన్నారు. అనంతరం ఎమ్మెల్సీ హోదాలో సూర్యాపేటకు మొదటిసారి గా వచ్చిన మల్లన్నకు దామోదర్‌రెడ్డి సన్మానించారు. ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, జిల్లా అధ్యక్షులుచెవిటి వెంకన్నయాదవ్, రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు అబ్దుల్ రహీం, సూర్యాపేట ఎంపిపి బీరవోలు రవీందర్ రెడ్డి, వైస్ ఎంపిపి రామసాని శ్రీనివాస్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు అంగన్‌వాడీల ధర్నా

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కోట్ల శోభ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 రోజుల సమ్మె చేస్తే కాంగ్రెస్ పార్టీ అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరిస్తామని గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అంగన్‌వాడీ టీచర్లకు రూ.18వేల వేతనం, ఆయాలకు రూ. 14వేల వేతనంను ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ. 10లక్షలు, ఆయాలకు రూ. 5లక్షలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలపై పనిభారాన్ని తగ్గించి, ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. వెంటనే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని, వారికి చేదోడుగా ఉండాలని సూచించారు.

## సింగిల్‌విండో పాలకవర్గం రద్దు ఉపసంహరించండి

### మాజీ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ చౌటుప్పల్ :** చౌటుప్పల్ సింగిల్ విండో పాలక వర్గాన్ని రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే రద్దు చేసి, కమిటీ ఏర్పాటు చేశారని మాజీ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి ఆరోపించారు. చౌటుప్పల్ సింగిల్ విండో పాలకవర్గం 2020 ఫిబ్రవరి 15న ఎన్నుకున్నారు. అప్పటి నుండి పాలకవర్గం జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించకుండా ఆలసత్వం చేసిందనే ప్రధాన కారణంతో డిసిఓ ప్రవీణ్ కుమార్ శనివారం పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ఆరు మందితో కమిటీని ఏర్పాటు చేసి చైర్మన్‌గా చెన్నగోని అంజయ్యను నియమిస్తు మరో ఉత్తర్వు కాపిని విడుదల చేశారు.డిసిఓ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్‌కు చెందిన మాజీ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి తో పాటు డైరక్టర్లు దుబ్బాక శశిధర్‌రెడ్డి, దొడ్డి శ్రీశైలం, దౌడి బాలరాజు, పబ్బతి వెంకటయ్య, పానుగోత్ సూర,గుండెబోయిన రూపమ్మ లు ఆదివారం చౌటుప్పల్ సింగిల్ విండో కార్యాలయం ఏదుట బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా చేశారు. డిసిఓ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తు సింగిల్ విండోలను భ్రష్టు పట్టిస్తున్నారని నినదించారు. రాజగోపాల్‌రెడ్డి కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం చింతల దామోదర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రభుత్వ నిబంధనల మేరకు సమావేశాలు నిర్వహంచలేదని అన్నారు. తర్వాత కాలంలో సమావేశాలను రెగ్యూలర్‌గా నిర్వహించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పార్టీ మారలేదని కక్షతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అప్రజాస్వామ్య చర్యలకు పాల్పడి పాలకవర్గాన్ని రద్దు చేయించారని ఆరోపించారు. డిసిఓ ప్రవీణ్ కుమార్ నేరుగా కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళాలని ఫోన్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారని అన్నారు. సమావేశాలు నిర్వహించలేదని పిర్యాదు అందితే విచారణ జరపాలి. కానీ ఎలాంటి విచారణ చేయకుండా ఎకపక్షంగా పాలకవర్గాన్ని రద్దు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకవర్గ రద్దును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డిసిఓ ను సస్పెండ్ చేయాలని కోరారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్, మాజీ జెడ్పీటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి,వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఢిల్లీ మాధవరెడ్డి, ఉప్పు కృష్ణ, గుండెబోయిన వెంకటేష్, అల్మాసిపేట కిష్టయ్య, సుర్కంటి రాంరెడ్డి, కొత్త పర్వతాలు, ఉడుగు మల్లేష్, తొర్పునూరి మల్లేష్, సుర్వి మల్లేశం, మున్నా, బాతరాజు యాదయ్య, సత్యం, దుబ్బాక ఆకాష్‌రెడ్డి, గణేష్, లింగస్వామి, శంకర్‌రెడ్డి, గంజి విజయ్,ఓరుగంటి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ అప్పగించకుంటే కేసులు

### డిఎస్ఒ మోహన్ బాబు హెచ్చరిక

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రభుత్వం మిల్లర్లకు అప్పగించిన ధాన్యానికి సంబంధించిన సిఎంఆర్‌ను అప్పగించకుంటే సదరు మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయక తప్పదని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మోహన్ బాబు అన్నారు. ఆదివారం ఆయన సిఎంఆర్ పెండింగ్‌కు సంబంధించి ఓ ప్రకటన విడుదల చేశారు. గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఎంకేఆర్ బిన్ని మోడ్రన్ రైస్ మిల్ యజమాని మల్లేపల్లి కరుణాకర్ కు ప్రభుత్వం 2022/23 రబీ, 2023/24 ఖరీఫ్ సీజన్‌లో సిఎంఆర్ కోసం అప్పగించిన ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించామని చెప్పారు. సదరు మిల్లర్ ప్రభుత్వానికి ఇప్పటి వరకు సిఎంఆర్ చెల్లించలేదని దీనిపై పలు మార్లు అతనికి నోటీసులు జారీ చేయగా కొంత గడువు అడిగి అప్పగిస్తానని లిఖీతపూర్వకంగా తమకు రాసి ఇచ్చినట్లు తెలిపారు. కాని అతడు అప్పగించకపోవడంతో శనివారం మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేయగా 2,35,000 బస్తాల ధాన్యం పక్కదారి పట్టించినట్లుగా గుర్తించినట్లు తెలిపారు. సత్వరమే మిల్లును సీజ్ చేసి సదరు మిల్లర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అందరూ సహకరించాలన్నారు. నిర్లక్ష్యం తగదన్నారు. సకాలంలో స్పందించాలన్నారు. జిల్లాలోని ఇతర రైస్ మిల్లుల యజమానులు కూడా తమకు కేటాయించిన సిఎంఆర్‌ను సకాలంలో చెల్లించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మిస్టరీగా మారిన వ్యక్తుల అదృశ్యం..

## రంగంలోకి క్లూస్ టీం

**ప్రజాపక్షం/నందికొండః** నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక హిల్ కాలనీలో నూతనంగా ప్రారంభించిన ద స్కూల్ ఆఫ్ ఆక్స్ ఫర్డ్ పాఠశాలలో పని చేస్తున్న ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే అక్కడున్న ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం హిల్ కాలనీ కి చెందిన రెహమాన్ నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనంలో ఎలక్ట్రిషన్ గా పనిచేస్తున్నాడని.అదే సమయంలో రాజమండ్రి నుంచి వచ్చిన ఒక గుర్తు తెలియని వ్యక్తి సదరు పాఠశాల భవన యజమాని వద్దకు వచ్చి తనకు పెయింటింగ్ పని వస్తుందని తనకు ఏదైనా పని ఇప్పించవలసిందిగా ప్రాధేయపడటంతో భవన యజమాని కనికరించి గుర్తుతెలియని వ్యక్తికి పని ఇవ్వడం జరిగిందని అన్నారు. అయితే యధావిధిగా శనివారం రాత్రి ఒకరు ఎలక్ట్రికల్ పనిని, మరొకరు పెయింటింగ్ పనిని చేసుకుంటూ ఉన్నారని అయితే పెయింటింగ్ పని చేసే వ్యక్తి భవన యజమానికి అర్ధరాత్రి ఫోన్ చేసి నేను ఉదయాన్నే మా ఊరికి వెళ్ళిపోతున్నాను అని నాకు అంతవరకు చేసిన పనికి డబ్బులు ఇవ్వవలసిందిగా అడగడం జరిగిందని అన్నారు. అయితే ఎలక్ట్రీషియన్ రెహమాన్ తన పనిని ఆపేసి విశ్రాంతి తీసుకుంటూ ఉండగా పెయింటింగ్ పని చేసే వ్యక్తి తన పనిని కొనసాగిస్తూ ఉన్నాడని దీనితో ఎలక్ట్రిషియన్ రెహ్మాన్‌కు నిద్ర భంగం కలగడంతో భవన యజమానికి ఫోన్ చేసి చెప్పడంతో అతను మీ ఇద్దరు గొడవ పెట్టుకోవద్దని నువ్వు వేరే గదిలోకి వెళ్లి పడుకోమని రెహమాన్ కు చెప్పడం జరిగిందని అన్నారు. అయితే ఉదయాన్నే భవన యజమాని కొంతమంది పనివారు పాఠశాలకు వచ్చి చూడగా రాత్రి పని చేసిన ఇద్దరు వ్యక్తులు కనిపించడం లేదని వారు పనిచేసిన పాఠశాల భవనం లోపల పరిసర ప్రాంతంలో, గోడల పైన,మెట్లమీద పెద్ద మొత్తంలో రక్తపు ఆనవాళ్లు కనిపించడంతో సదరు భవన యజమాని కంగారుపడి పోలీసులకు సమాచారం ఇవ్వడం జరిగిందని అన్నారు. దాంతో ఆదివారం మధ్యాహ్నం క్లూస్ టీం రంగంలోకి దిగి డాగ్ స్క్వాడ్ ద్వారా అదృశమైన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే అదృశ్యమైన వ్యక్తులలో ఎవరైనా చనిపోయి ఉంటారని స్థానికంగా అనుమానం రేకెత్తిస్తుంది.





## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్




**ప్రజాపక్షం/చిట్యాల :** దేశములో నిజాం పాలకుల కర్కసత్వానికి వ్యతిరేకంగా పోరాడి వారి అరాచకాలను రూపుమాపి దేశ స్వతంత్ర ఉద్యమంలో పాల్గొని అనేకమంది అమరుల త్యాగాలు గల 100 సంవత్సరాల చరిత్రను గలిగిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ జిల్లా కార్యదర్శి కోరిమి రాజ్ కుమార్ అన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హై స్కూల్ ఆవరణంలో ఆదివారం సిపిఐ మండల మహాసభను సిపిఐ పార్టీ జిల్లా నాయకుడు పసరగొండ మహేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేశ స్వతంత్ర ఉద్యమంలో సిపిఐ ఆధ్వర్యంలో ఎంతోమంది కమ్యూనిస్టులు ప్రాణ త్యాగం చేశారని 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, నిజాం పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర సిపిఐ ఎర్ర దండుదేనని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, నీట్ పరీక్ష ఫలితాలను రద్దుచేసి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పేదలకు ఉచిత పథకాల కంటే విద్య వైద్యం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. మండలంలో భూమిలేని నిరుపేదలు పోడు భూములు కొట్టుకున్న వారికి హక్కు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాల మండల సమస్యల కోసం సిపిఐ పార్టీ మండల మహాసభ ఎంతో దోహదపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా నాయకులు సోతుకు ప్రవీణ్ కుమార్, క్యాతరాజ్ సతీష్, ముకుంద రెడ్డి, మామిడి చెట్టు నారాయణ, తిరుపతి, లక్ష్మయ్య, సంపత్, ఓదన్న, వివిధ గ్రామాల నుండి వచ్చిన సిపిఐ పార్టీ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు, మహిళ కామ్రేడ్స్ పాల్గొన్నారు.

## టియుడబ్ల్యుజె రాష్ట్ర నాయకులకు సన్మానం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** టియూడబ్ల్యూజే(ఐజేయూ) తెలంగాణ రాష్ట్ర కమిటీలో చోటు సంపాదించుకున్న జర్నలిస్టులకు ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సియాసత్ పత్రిక సీనియర్ పాత్రికేయులు ఇస్మాయిల్ జబి ఆధ్వర్యంలో ఉర్సు దర్గా మాషుకే రబ్బాని పీఠాధిపతి ఉబేద్ బాబా ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర కమిటీలో ఎన్నికైన వారిని సన్మానించారు. సంఘం రాష్ట్ర 3వ మహాసభలు ఇటీవల ఖమ్మంలో నిర్వహించారు. ఈ మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గాడిపెల్లి మధు, ఈసీ మెంబర్లు పెండెం వేణుమాధవ్, కంకణాల సంతోష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వరంగల్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్యను ఉబేద్ బాబా తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. అనంతరం ఉబేద్ బాబాను రాష్ట్ర కమిటీ, ప్రెస్‌క్లబ్ బాధ్యులు, యూనియన్ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టియూడబ్ల్యూజే నేషనల్ కౌన్సిల్ మెంబర్ సంగోజు రవి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గా ప్రసాద్, వరంగల్ ప్రెస్‌క్లబ్ ఈసి మెంబర్ నయిమ్, పెరుమాండ్ల మధు, సాజిద్, ఎండి అమీర్, హుస్సేన్ పాషా, అమీర్, అక్రం, కలికోట శ్రీధర్, నయిం, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల వర్క్ షాప్‌లో పాల్గొన్న జిల్లా అడ్వకేట్లు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ, స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు క్రిమినల్ చట్టాలపై 22, 23న న్యాయవాదులకు రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి ఐదుగురు అడ్వకేట్ పాల్గొన్నారు. తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ, బండ్లగూడ హైదరాబాద్‌లో2 రోజులు ట్రైనింగ్ ప్రోగాంలో భూపాలపల్లి జయశంకర్ జిల్లా బార్ అసోసియేషన్ పక్షాన ఈ కార్యక్రమంలో హాజరు కావడానికి అవకాశం కల్పించిన జయశంకర్ జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కునూరి సురేష్ కుమార్, జనరల్ సెక్రెటరీ బల్ల మహేందర్ లకు ప్రత్యేకంగా హాజరైన న్యాయవాదుల తరుపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. 2 రోజులు ట్రైనింగ్ ప్రోగాంలో న్యాయవాదులు ఎండి.రఫి, కేరవేణి చిరంజీవి, మంగళపల్లి రాజ్ కుమార్, ఆరెల్లి వెంకటస్వామి, రేపాల సంతోష్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## పాలిసెట్ సర్టిఫికెట్ వేరిఫికేషన్ ప్రారంభం



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** స్థానిక ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటిరోజు పాలిసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.ఎ నర్సయ్య మాట్లాడుతూ సుమారుగా 150 మంది విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియలో డాక్టర్ టి వెంకటరెడ్డి, డాక్టర ఎ రవీందర్ నాయక్, వై గణేష్, టి కరుణాకర్, సీహెచ్ మోహన్, జి కల్పనా, ఎస్ ప్రసన్న లక్ష్మి , వై కళావతి, సుజాత పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీ నిర్ణయం హర్షణీయం

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం పట్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు పిన్ని కావ్యశ్రీరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఇచ్చిన మాట తప్పకుండా కేబినెట్ సమావేశంలో ఆగష్టు 15తేదీ లోపు ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసేందుకు ఆమోదం తెలుపడం పట్ల రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గత పదేళ్లలో నాలుగు విడతల్లో రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులకు పూర్తి స్థాయిలో మాఫీ చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి అని, ప్రభుత్వ నిర్ణయం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ సిఎం రేవంత్‌రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళ మండల అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి , మాజీ సర్పంచ్ నల్లగోని కవిత, మహిళ నాయకులు వేణు, పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని రక్షించుకుందాం

ఈ బాధ్యత అందరిది
బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణలో
మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ఎప్పటికీ ఓడిపోదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం గాంధీనగర్ మాణిక్యపూర్‌లో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నరు. ఈ సందర్భంగా మాణిక్యపూర్ నుంచి గాంధీనగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం రచించడం వల్ల ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ఏర్పడేటప్పుడు వాళ్లంతా వ్యతిరేకించిన ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ ఏర్పడిందన్నారు. రాజ్యాంగానికి ఉన్న గొప్ప లక్షణం ఇదని, రాజ్యాంగం రక్షించుకుంటేనే మన భవిష్యత్, పిల్లల భవిష్యత్ నిర్మాణాత్మకంగా చేసుకోవచ్చునని, రాజ్యాంగం ఎప్పటికీ ఓడిపోదు అని, శాశ్వతంగా నిలిచి ఉంటుందన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యానికి తొలి ప్రాధాన్యత కల్పిస్తుందని, ప్రభుత్వంలో ఉన్న మంత్రిగా ప్రభుత్వం ఏర్పడగానే రాష్ట్రంలో ఉన్న 25 వేల స్కూళ్లకు రూ. 1100 కోట్లతో తాగునీరు, విద్యుత్, బాత్‌రూమ్, పాఠశాలలకు రంగులు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా స్కూళ్లలో కొత్త ధనం కనిపిస్తుందని, గత పదేళ్లుగా టీచర్ల నియామకం జరుగలేదని, ఇప్పుడు మెగా డీఎస్సీ వేసి టీచర్ల నియామకాలు చేస్తున్నాం అన్నారు. ప్రైవేటు ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం కమిటీ వేసిందని,అభివృద్ధిలో ముందుకు పోతున్న గౌరవెల్లి ప్రాజెక్టు త్వరగా పూర్తి చేసి నీళ్ల అందించేందుకు వేగంగా ముందుకు పోతున్నాం అని, రేపు హుస్నాబాద్ నియోజకవర్గంలో జీరో నుంచి పీజీ వరకు తిరుమల గార్డెన్స్‌లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, నిరుద్యోగులందరూ ఈ జాబ్ మేళాను ఉపయోగించుకొని ఉద్యోగాలు తెచ్చుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాలో విదేశాల్లో స్కిల్ డెవలప్‌మెంటు ద్వారా మంచి జీతంతో ఉద్యోగవకాశాలున్నాయని, నియోజకవర్గంలో విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి అంబేద్కర్, జ్యోతిరావుపూలే ఆలోచనలతో ఈ కార్యక్రమాలు ముందుకు పోతున్నాయన్నారు. అందరం బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచనలతో ముందుకు కదలాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్, గాయకులు ఏపూరి సోమన్న, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాచగిరి క్షేత్రానికి 28 గుంటల స్థలం విరాళం

**ప్రజాపక్షం/గజ్వేల్ :** ప్రసిద్ధ నాచగిరి శ్రీ లక్ష్మీ నృసింహ క్షేత్రానికి కీర్తిశేషులు త్రిగుల్ల చంద్రశేఖర శర్మ సతీమణి శ్రీమతి అరుణ, కుమారులు కృష్ణచంద్ర శర్మ, రఘువీర్ శర్మ, నందకిషోర్ శర్మలకు చెందిన సర్వే నంబర్ 360 నాచారంలోని హీరా బాయమ్మ తోటకు సంబంధించిన 28 గుంటల స్థలాన్ని నాచగిరి క్షేత్రానికి ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీమతి అన్నపూర్ణకు స్థల రిజిస్ట్రేషన్, ధరణి పాస్ బుక్ అందజేశారు. అలాగే కీర్తిశేషులు త్రిగుల్ల పద్మనాభ శర్మ కుమారులు త్రిగుల్ల గోపాలకృష్ణ శర్మ, త్రిగుల్ల విద్యాసాగర్ శర్మ సంబంధించిన 54 చదరపు గజాల బిల్డింగు సంబంధించిన దాన పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ప్రధాన అర్చకులు జగన్నాథచార్యులు, వేద పండితులు నాగబాల కామేశ్వర శర్మ, అర్చకులు హరిప్రసాద శర్మ, రమేష్ శర్మ, విద్యాసాగర్ శర్మ, గోపాలకృష్ణ శర్మ, నాగరాజు శర్మ, రామకృష్ణ శర్మ, సిబ్బంది సుధాకర్ జూనియర్ అసిస్టెంట్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావు రాజీనామాకు సిద్ధంగా ఉండాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రూ.2 లక్షల రుణమాఫీ చారిత్రాత్మక నిర్ణయం అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం హన్మకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రుణమాఫీ నిర్ణయాన్ని అమలు పరిచేలా క్యాబినెట్ తీర్మాణం చేయటంపై హర్షం వ్యక్తం చేస్తూ సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే రైతు పక్షపాతి అని, రైతుల కోసం నాడు ఉచిత విద్యుత్ ప్రవేశపెట్టిన, రైతుల కోసం సాగు నీటిలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని, నేడు సిఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ఏకకాలంలో రుణమాఫీతో మరో మారు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని నిరూపించుకుందన్నారు. గడిచిన ఐదేళ్లుగా రైతులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను దూరం చేయటానికి ఎన్నికల్లో వరంగల్ వేదికగా రాహుల్‌గాంధీ ఇచ్చిన రైతు డిక్లరేషన్ రుణమాఫీ ప్రకటించారన్నారు. అనంతరం సిఎం రేవంత్‌రెడ్డి హయాంలో ఏకకాలంలో రూ. 2 లక్షల చొప్పున 31 వేల కోట్ల రుణమాఫీకి విధివిధానాలు రూపొందించి, వచ్చే ఆగస్టు 15లోపు పూర్తి చేస్తుందన్నారు. రుణమాఫీ చేసినందున హరీష్ రావు తన మాటకు కట్టుబడి రాజీనామాకు సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు. ఈ కార్యకమంలో కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టిపిసిసి కార్యదర్శి ఈవి శ్రీనివాసరావు, కార్పోరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పోరేటర్లు పోతుల శ్రీమాన్, సయ్యద్ విజయశ్రీ రజాలి, మామిండ్ల రాజు,చీకటి శారద ఆనంద్, నసీం జహాన్, వీరగంటి రవిందర్, నలుబోల సతీష్, నాయిని లక్ష్మారెడ్డి, మహ్మద్ అంకూష్, డాక్టర్ పి. రామక్రిష్ణ, బంక సరళ, సంపత్ యాదవ్, గుంటి స్వప్న, కె. సుకన్య, సహరి, నల్ల సత్యానారాయణ, సమతా రాజు, రఘుపాల్ రెడ్డి, రవిందర్, సమద్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుంది

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్ :** రాష్ట్రంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ లోని స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీకి కాంగ్రెస్ కట్టుబడి అమలు చేస్తుందని, సిఎం రేవంత్ రెడ్డి రైతు పక్షపాతిగా నిలుస్తూ వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు స్పష్టం చేశారు. రుణమాఫీతో రాష్ట్రంలో 46 లక్షల కుటుంబాలకు ప్రయోజనం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ వర్తింప చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించగా, రుణమాఫీ చేస్తే తాను సిద్ధిపేట ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన హరీష్ రావు అందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో సైతం రూ 76 వేలకోట్ల రుణమాఫీ చేసినట్లు గుర్తు చేశారు. ప్రాజెక్టులు నిర్మాణంతో నష్టపోయిన నిర్వాసిత రైతుల ఆర్థికాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుండగా, వారికి సైతం హామీ ఇచ్చిన ప్యాకేజీ, రుణమాఫీ వర్తింప చేసే విధంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ తదితరుల సహకారంతో కృషి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి రాములు గౌడ్, నాయకులు సుభాష్ చంద్రబోస్, సర్దార్ ఖాన్, గంగిశెట్టి రాజు, సమీర్, గాడిపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, జగ్గయ్యగారి శేఖర్, మల్యాల భద్రయ్య, శివారెడ్డి, అంజాద్ పాషా, ఇక్బాల్ , బలరాం, నందకిషోర్, యాదగిరి, రమేష్ గౌడ్, నేత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రైతన్నలకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీని చేయడం హర్షనీయమన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ ఉద్దేశమని, సీఎం రేవంత్‌రెడ్డి రైతు బిడ్డ కాబట్టే రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షడు జలగం కుమార్, నాయకులు గంగు కృష్ణమూర్తి, నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు గోనె మహేందర్‌రెడ్డి, కమ్మగాని నాగయ్య, నీరటి చంద్రయ్య, గాదెపాక భాస్కర్, ఎం హరీష్, సురేష్, భాస్కర్, అశోక్, ప్రభాకర్, వెంకన్న, సోమేశ్వర్, అశోక్, సునీల్, శ్రీధర్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



# రైతు రుణమాఫీ చారిత్రక నిర్ణయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, రైతును రాజును చేయడమే లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ నిర్ణయాన్ని హర్షిస్తూ ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో, నియోజకవర్గంలోని రేగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయగా, ఇట్టి కార్యక్రమాలల్లో డిసిసి అధ్యక్షుడు, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, ఇతర ముఖ్య నేతలతో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని సిఎం చిత్రపాటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎస్ఆర్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, రైతును రాజును చేయడమే లక్ష్యమని, అప్పుల్లో ఉన్న రైతులకు ఈ రుణమాఫీ ఎంతో మేలు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని ఈ నిర్ణయం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, ఇస్లావత్ దేవన్, కాంగ్రెస్ జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య, అంబాల శ్రీనివాస్, దాట్ల శ్రీనివాస్, సాంబమూర్తి స్థానిక కౌన్సిలర్లు సింగరేణి నాయకులు పాల్గొన్నారు.

### మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

కాంగ్రెస్ ప్రభుత్వంలోని ముస్లిం మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీలో రూ.15 లక్షలతో నూతనంగా నిర్మాణం చేపడుతున్న మజీద్‌కు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు భూమి పూజ చేశారు. ముస్లిం మైనార్టీ సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిత ప్రకాష్ రెడ్డి, పిసిసి సభ్యుడు చల్లూరి మధు, పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, కాంగ్రెస్ జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య, చల్లూరి సమ్మయ్య, సాంబమూర్తి పైడిపల్లి రమేష్, కౌన్సిలర్లు దాతల శ్రీనివాస్ శిరుప అనిల్, ముంజాల రవీందర్, పిల్లలమర్రి శారద నారాయణ, ఐఎన్‌టియుసి నాయకులు బండి శ్రీనివాస్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా రేషన్ బియ్యం దందా



**ప్రజాపక్షం/గార్ల :** మండలంలో రేషన్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతుంది. ఒక పక్క రాష్ట ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు రేషన్ బియ్యం అక్రమ రవాణా, గుడుంబా తయారి, గంజాయి విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నా అక్రమ సంపాదనే ధ్యేయంగా అక్రమార్కులు అధికారుల కండ్లు కప్పి వారి పని వారు కానిస్తున్నారు. ఆదివారం సాయంత్రం గార్ల మండల పరిధిలోని రామాపురం గ్రామంలో కోందరు రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులు లబ్ధిదారుల నుండి ఇంటింటికి వెళ్లి తక్కువ దరకు రేషన్ బియ్యాన్ని విక్రయించి అదే గ్రామంలో ఒక చోట డంప్ చేసినట్లు గ్రామస్తులు తేలిపారు. మండలంలో ముల్కనూరు, మద్దివంచ,పెద్ద కిష్టాపురం , చిన్న కిష్టాపురం , గ్రామాల నుండి కొందరు వ్యాపారులు రేషన్ బియ్యాన్ని కొని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్రమ వ్యాపారుల ఆగడాలను అరికట్టాలంటే ప్రభుత్వం పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాని అందించాలని పేద ప్రజలు కోరుతున్నారు.

# కూరగాయలు పిరం

- ఏమితినేటట్టులేదు..ఏమి కొనేటట్టులేదు
- బెంబేలెత్తుతున్న పేద మధ్య తరగతి ప్రజలు
- సెంచరికి చేరువాలో టమాట



**ప్రజాపక్షం /జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఏమితినేటట్టు లేదు ఏమి కొనేట్టు లేదు నాగులో..నాగన్నా ధరలిట్ల పెరగవట్టి నాగులో నాగన్న అనే ఒకవి రాసిన పాత పాట యాదికొస్తుంది.ఇది ఇప్పుడున్న పరిస్థితులకు అద్దంపట్టినట్టు గా ఉంటదని చెప్పక తప్పదు.అమ్మవోతే అడివి కొనవోతే కొరివి అన్న చందంగా తయారయ్యింది కూగా యల ధరల పరిస్థితి.నిత్యం అవసరాలుగా ఉండే కూరగాయల రేట్లు పట్టపగలే ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి.కూరగాయల ధరలు అమాంతం పెరగడంతో పేద మధ్య తరగతి ప్రజలు అల్లాడుతూన్నారు.పొద్దంతా పనికి పోతే రూ.500 లు వస్తే అందులో కూరగాయలకే సగం పోతే మిగిలిన బియ్యం ఉప్పులు,పప్పులు చిల్లర సామానులు రాక నరకయాతన పడుతున్నారు.అటు కూరగాయలు,ఇటు నిత్యవసర ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి.వీటికి తోడు పప్పుతోటి కడుపునింపుదామని అనుకుంటే పప్పుల ధరలు మండి పోతున్నాయి. దీంతో పెద ప్రజలకు పచ్చడి మెతుకులతోనే కాలం వెల్లదీసే పరిస్థితి కనబడుతుం టది. గతంలో 40 రూపాయలు ఉన్న టమాట సెంచరికి చేరువైంది. కూరగా యలన్ని చికెన్ తోటి పోటిపడుతున్నాయి.బెండకాయ100,బీరకాయ140, చిక్కుడు120, కాకర, క్యారేట్100, క్యాలీ ఫ్లవర్ 100, వంకాయ 100, దొండకాయ80, దోసకాయ100,సోరకాయ కెజి 100,బీట్ రూట్ 2250, పచ్చి మిర్చి కెజి 150, కొత్తి మీర150,పూదీన150 అనేక కూరగాయలు ఉన్నాయి.ఏకూరగాయలైన సుమారు.కిలో 150 పైనే రేటు పలుకుతున్నాయి.కిలో ఉల్లి గడ్డ 60,మటన్ 800,చికెన్ 300,గుడ్డు ఒకటి7రూపాయలు పలుకుతుంది. దీనికి కారణం అడిగితే మన రాష్ట్రంలో కూరగాయలు పండటం లేదని ఇతర రాష్ట్రాల నుండి దిగుబడి అవుతుంది కాబట్టి రేట్లు పెరుగుతున్నాయని అమ్మకం దారులు చెబుతున్నారు.అదును చూసి ఈ వ్యాపార స్తులు కూరగాయలను బ్లాక్ చేసి సరఫర లేకుండా నిలువ చేసి అవకాశాన్ని బట్టి ఎక్కువరేటు కు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.అదే కూరగాయలు పండించిన రైతుకు మాత్రం గిట్టు బాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి రాష్ట్రంలో ఉన్నది.ఈ తప్పిదమంతా ప్రభుత్వాలదని చెప్పక తప్పదు ఎందుకంటే మన రాష్ట్రంలో రైతులను కూగాయల పంటలు వేయడానికి ఎందుకు ప్రోత్సహించడంలేదు కూరగాయలు పండిస్తే సబ్సీడిలు ఇవ్వడంలేదు.అదే విధంగా ఈ ప్రభత్వాలు వేల కోట్లు బెట్టి ఎన్నికల్లో గెలవడం కోసం ఉచితాలు ఇస్తామని హామీలు ప్రకటించి గద్దెనెక్కె నాయకులకు ఈ పేద వాడికిచ్చే కూరగాయల రేట్లను ఎందుకు అదుపు చేయలేక పోతుంది.ఈ పాలకుల విధానాల వల్లనే ఈ దుస్థితి కనబతుంది.ముందు పాలకులు ప్రజలకు ఏమి కావాలో ఆలోచించడంలేదు.కేవలం ఓట్ల కోసమే అమలు కాని హామీలిచ్చి పేద వాడు చివరికి చనిపోతే కప్పే గుడ్డపై న సైతం జివిఎస్టీ పేరుతో పన్నులు వేసి దండుకుంటున్న ప్రభుత్వాలు ప్రజలకు కావలసిన అవసరాలను తీర్చలేక పోతున్నారు.నిత్యవసర ధరలను దేశంలో నియంత్రించకపోవడం వల్లనే ఈ ధరల పరిస్థితి దాపురించిదని ఇప్పటి కైన పాలకులు ఉచిత హామీలను పక్కనబెట్టి ప్రజలకు అవసరమైన కూరగాయలు,నిత్యవసరాల పై వేసే ధరలను నియంత్రిచాలని ప్రజలు ప్రభతుత్వాలను వేడకుంటున్నారు.

## ఏడుపాయల క్షేత్రంలో భక్తుల రద్దీ

పెద్ద ఎత్తున మొక్కులు చెల్లింపు



**ప్రజాపక్షం/పాపన్నపేట :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని క్షేత్రంలో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి క్షేత్రానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. దీనితో అమ్మవారి క్షేత్రమంతా భక్తులతో నిండిపోయింది. ఆదివారం సెలవు దినం కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వనదుర్గమ్మ దర్శనానికి తరలిరావడంతో ఆలయ పరిసరాలలో ఉన్న ప్రభుత్వ, ప్రవేటు సత్రాలన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులు ముందుగా చెక్ డ్యాం, అమ్మవారి ప్రధాన ఆలయం ముందున్న మంజీరా నదీ పాయలో పుణ్యస్నానాలు ఆచరించి, వనదుర్గాదేవి దర్శనానికి బారులు తీరారు. పలువురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుళ్లు, మేళ తాళాలతో బోనాలు, ఒడిబియ్యం సమర్పించారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు శంకర శర్మ పార్థివ శర్మ, మురళీ శర్మ, పార్థీవ శర్మలు పూజలు చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ చైర్మన్ బాలా గౌడ్, పాలక మండలి సభ్యులు ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. భక్తులు ఆలయ పరిసరాల్లోని షెడ్లు, పచ్చని చెట్ల కింద భోజనాలు చేసి ఇళ్లకు తిరుగుపయనమయ్యారు. ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## ఉద్యోగాల సంఖ్య పెంచాలి

మెదక్ మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్ రెడ్డి

ప్రజాపక్షం/పాపన్నపేట : గ్రూప్2, గ్రూప్ 3లో ఉద్యాగల సంఖ్య పెంచి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నాడు మెదక్ మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. ఇటీవల జరిగినటువంటి మంత్రివర్గ క్యాబినెట్ భేటీలో వారి గ్రూప్ వన్ మెయిన్స్ కు 1:100 చొప్పున అదించకపోవడం గ్రూప్ టూ మరియు గ్రూప్ త్రీ లో అదనంగా ఉద్యోగాలు కల్పించిన తర్వాతేనే ఈ యొక్క పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా పరీక్షల యొక్క తేదీల మధ్య వ్యవధి ఉండాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచిన కొత్త ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగ యువతను రోడ్డు మీదకు తీసుకొచ్చారన్నారు. నియామక ప్రక్రియపై వారు ఖచ్చితంగా దృష్టి సారించాలన్నారు. నిరుద్యోగ సమస్యల పట్ల వెంటనే స్పందించి వారికి సరైనటువంటి న్యాయం చేయాలనివిజ్ఞప్తి చేశారు.

# ఊరించి..ఉసూరుమనిపించిన వర్షాలు

డెడ్ స్టోరేజీకి ప్రాజెక్టులు, చెరువులు
జూన్ ముగుస్తున్నా జాడలేని వానలు
పొలాలు బీళ్లుగా మారే అవకాశం



**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** నైరుతి రుతుపవనాలు ముందే రాష్ట్రానికి వచ్చాయి అని రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కానీ ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉండటంతో రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చెదురు మదురు వర్షాలు కురిపించి ఆ తర్వాత వానలు ఆగిపోయాయి. దీంతో ఈలోపు సాగు ప్రారంభించిన రైతులకు చుక్కెదురైంది. జిల్లాల్లో నాటిన పత్తి విత్తనాలు మెలుకెత్తనే లేదు. ఇప్పటికే పత్తి సాగు చేస్తున్న ఒక్కో రైతు ఎకరానికి కలుపు కూలితో కలుపుకొని రూ.20 వేల నుంచి 30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. జొన్న సాగు చేస్తున్న రైతు ఎకరానికి రూ.6 వేల చొప్పున డబ్బు వెచ్చించి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. విత్తనాలు మొలకెత్తే దశలో వాన జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు నాటి రెండు వారాలు దాటుతున్నా ఇప్పటికీ మొలకలు వేయలేదని వాపోతున్నారు.

**మంచిర్యాల జిల్లాలో..**

జిల్లా పరిధిలో మొత్తం 18 మండలాలకు గాను 14 మండలాల్లో ఈ సీజన్లో వానలు అంతంతమాత్రంగా కురిశాయి. దీంతో పంటల సాగు మందకొడిగా జరుగుతుంది. జూన్ మూడవ వారం పూర్తయ్యే నాటికి జిల్లాలో సుమారు 90.0 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగాఇప్పటివరకు కేవలం 30.6 మి.మీ వర్షపాతం కూడ నమోదు కాలేదు.జిల్లాలోని 16 శాతం విస్తీర్ణంలో మాత్రమే సాగు పనులు మొదలుపెట్టారు.

**ఆసిఫాబాద్ జిల్లాలో..**

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా పత్తి సాగుకు పెట్టింది పేరు. జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా రైతులు ఈ పంటనే సాగు చేస్తారు. ఈ సీజన్లో రైతులు 4.8 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. దీనిలో అధిక భాగం 3.9 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే 1,90,000 ఎకరాల్లో విత్తనాలు నాటారు. జిల్లాలో ఇప్పటివరకు నామమాత్రంగా వర్షం కురిసింది. పంట చేతికి రావాలంటే కనీసం 30 సెం.మీ వర్షపాతం కురిస్తే తప్ప పంట చేతికి రావని నిపుణులు వెల్లడిస్తున్నారు.

**డెడ్ స్టోరేజీలో నీటి వనరులు...**

మంచిర్యాల జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, ఆసిఫాబాద్ జిల్లాలోని అడ ప్రాజెక్టులోని నీరు డెడ్ స్టోరేజీకి వెల్లడంతో ప్రజలు, రైతులు, అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, ప్రాజెక్టులు నిండితేనే ఖరీఫ్‌లో వరి సాగుకు మోక్షం ఉండడంతో ప్రస్తుత పరిస్థితిలో వర్షాలు లేక చెరువుల్లో, ప్రాజెక్టుల్లో నీరు రాక బోసిపోయి కనిపిస్తున్నాయి. వాతావరణ శాఖ వర్షాలు కురుస్తాయని చెప్పినా జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో చిరుజల్లులు తప్ప భారీ వర్షాలు కురవకపోవడం వలన రైతుల పంటల సాగుకు ఆటంకం కలుగుతోంది. గత సంవత్సరం ప్రాజెక్టులన్ని జూన్, జూలై మాసంలోనే కురిసిన వర్షాలకు నిండిపోగా ఆ తర్వాత అక్టోబర్ వరకు వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టులు, చెరువుల్లో ఉన్న నీరు ఖాళీ అయ్యాయి, దీంతో ఈ ఏడాది సాగుకు నీటి కొరత ఏర్పడింది. అక్టోబర్ వరకు వర్షాలు కురిస్తే ఈ ప్రాజెక్టులు, చెరువుల్లో నీటి నిల్వ శాతం పెరిగేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడం సర్వత్రా ఆందోళనకు గురిచేస్తోంది.

ఇప్పటికైనా వాసదేవుడు కరుణించి వర్షాలు కురిపించి చెరువులు, ప్రాజెక్టులు నింపితేనే తప్ప పంటలు పండే పరిస్థితి లేదు. రైతన్నలు, ప్రజలు ఆశతో నింగి కేసి చూస్తున్నారు.

## కొట్టుకుపోయిన వంతెన.. 42 గ్రామాలకు రాకపోకలు బంద్



**ప్రజాపక్షం/ కాగజ్ నగర్ :** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం అందవెల్లి వద్ద నిర్మించిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. శనివారం రాత్రి నుండి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షం కారణంగా ఈ వంతెన కొట్టుకుపోయినట్టు అధికారులు వెల్లడించారు. జిల్లాలోని దహెగాం మండలం, కాగజ్ నగర్ మండలం మధ్య రాకపోకలకు ఏకైక ప్రత్యామ్నాయం అందవెల్లి పెద్దవాగుపై ఉన్న వంతెన. గత వర్షాకాలం అందవెల్లి పై నిర్మాణం చేసిన వంతెన రెండు ఫిల్లర్లు కుంగిపోవడంతో దాని స్థానంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టారు. వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజల రాకపోకలకు ఆటకం కలగకుండా ఉండేందుకు తాత్కాలిక వంతెన నిర్మాణం చేశారు. ప్రజల రాకపోకలకు తాత్కాలికంగా వాగులో నుంచి రోడ్డు వేసి వాగు ప్రవాహానికి ఆటంకం లేకుండా చూశారు. కానీ శనివారం కురిసిన వర్షానికి ఈ తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

## జెసిబి ఢీకొని కూలీ మృతి

**ప్రజాపక్షం/ మందమర్రి :** జెసిబి ఢీకొని కూలీ మృతి చెందిన ఘటన మందమర్రిలో చోటుచేసుకుంది. మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. చెక్ డ్యామ్ నిర్మాణ పనుల కోసం తీసుకువచ్చిన ఇసుక ట్రాక్టర్ మట్టిలో దిగబడింది. దానిని జెసిబి సహాయంతో బయటికి లాగుతుండగా డ్రైవర్ అకస్మాత్తుగా జెసిబిని వెనక్కు తీయడంతో నవీన్ (33) అనే కూలీకి బలంగా తాకింది. తీవ్రంగా గాయపడిన నవీన్‌ను మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. నవీన్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## పదోన్నతులు కల్పించండి



**ప్రజాపక్షం/చింతలమానేపల్లి :** రాష్ట్రంలోని ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిఎస్‌హెచ్‌ఎం పోస్టును మంజూరు చేసి ఎస్‌జిటి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని పిఆర్‌టియు టిఎస్ జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాస్ రావు అన్నారు. ఆదివారం పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ పొందిన రాంటెకి దేవాజీ ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ దేవాజీ 33 సంవత్సరాలు సర్వీస్ లో ఎందరో విద్యార్థులను ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్తేజపరుస్తూ విద్యార్థులను ఉత్తమంగా, ఉన్నత స్థానాల్లో ఉండేందుకు కృషిచేసినారని కొనియాడినారు.బిక్షపతి, కుర్మాదాస్, రవి కుమార్, రాజు, ప్రకాష్, రాజా కమలాకర్ రెడ్డి, బాబు రావు, జ్ఞానేశ్వర్, జయరాజ్, దేవ్ రావు, ఆత్మారాం, భీమయ్య, అరుణ్, హనుమంతు, నరులే ప్రకాష్, గణపతి, రాకేష్ గుప్త, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం /కాగజ్ నగర్ :** కాగజ్‌నగర్ ప్రెస్ క్లబ్ పూర్తి స్థాయి కార్యవర్గం ఏర్పాటైంది. గౌరవాధ్యక్షులుగా ఎ. తిరుపతి, ఎండి ఇసాక్, జి. శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా జె. మధుకర్, వి. శ్రీనివాస్, అధ్యక్షుడిగా టి. సురేందర్ రావు, ప్రధాన కార్యదర్శిగా తిరుమలాచారి, కోశాధికారిగా షఫీ ఉల్లా, ఉపాధ్యక్షులుగా ఎ. సురేష్, డి.మహేష్, ఈర్ల సతీష్, జమీల్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా మహేష్, జాయింట్ సెక్రెటరీగా పి. సంతోష్ నియమితులయ్యారు.

## పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలి

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీని బలపేతం చేయడంపై దృష్టి సారించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి సూచించారు. ఆదివారం తన నివాసంలో బిజెపి జిల్లా సీనియర్ నాయకులు, జడ్‌పిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షులు అరిగెల నాగేశ్వరావు మర్యాదపూర్వకంగా కలసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. నిర్మల్ మాజీ ఎంఎల్‌ఎ ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఉన్నారు.

## డిగ్రీ కళాశాలకు నిధులు

**ప్రజాపక్షం/బైంసా:**బైంసాలోనిప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేంద్ర ప్రభుత్వం పీఎం ఉషా పథకం కింద ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ తెలియజేశారు.గదుల నిర్మాణానికి,మరమ్మతులకు మూడు కోట్ల 97 లక్షల రూపాయలతో పాటు మిగతా నిధులు సౌకర్యాల కల్పన కోసం మంజూరు కాల్పన కోసం మంజూరు కావడం జరిగిందన్నారు.ప్రధాని నరేంద్ర మోడీ హాయంలోనే దేశం విద్యరంగానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు.త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు.

## రాజన్న సన్నిధిలో హైకోర్టు జడ్జి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని తెలంగాణ హైకోర్టు జస్టిస్ సూరేపల్లి నందా ఆదివారం దర్శించుకున్నారు. అంతకుముందు జడ్జికి ఆలయాచకులు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఇక్కడ జిల్లా జడ్జి ప్రేమలత, వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి సుజన ఆర్డీఓ రాజేశ్వర్, డిఎస్పి నాగేంద్ర చారి, ఆలయ ఈవో రామకృష్ణ, ఏఈఓ బీ.శ్రీనివాస్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి ఓపెన్ వర్సిటీ పరీక్షలు

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటి స్టడి సెంటర్ ప్రభుత్వ డిగ్రి కళాశాల కాగజ్‌నగర్‌లో ప్రస్తుతం డిగ్రీ బి.ఎ, బి.కాం, బిఎస్సి 3వ సంవత్సరం సెమిస్టర్ 6 చదువుతున్న విద్యార్థులకు ఈనెల 24 సోమవారం నుండి థియరీ పరీక్షలు ప్రారంభం అవుతాయని కళాశాల కోర్డినేటర్ తూడురు దత్తాత్రేయ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఒరిజినల్ ఐడెంటిటి కార్డును తప్పనిసరిగా తమ వెంట తీసుకురావాలని సూచించారు. లేనిపక్షంలో పరీక్షలు రాయడానికి అనుమతించబోమని పేర్కొన్నారు. అందరూ సహకరించాలన్నారు.

## 'నీట్'పై విచారణకు ఎఐఎస్ఎఫ్ డిమాండ్

ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి :** నీట్ పరీక్ష లీకేజ్ పై స్పందించని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయంను ముట్టడించడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు.ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని, మే 5న పరీక్షను నిర్వహించడం జరిగిందని, ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని, విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారని,వారి అనుమానాలకు ప్రత్యక్ష సాక్ష్యం ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం మరల వారి యొక్క పరీక్ష కేంద్రం ఒకటే కావడం వలన వారి అనుమానాలకు బలాన్నిస్తుందని,కావున తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు..అదేవిధంగా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలనీ దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర ప్రభుత్వానికి చెప్పిన కూడా వారి మాటని పెడచెవిన పెట్టి, నిర్లక్ష్యం చేయడం ద్వారా వేలాది మంది ప్రతిభగల విద్యార్థులు మె డికల్ విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు..ప్రస్తుత విద్యాసంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై,పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాల న్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ స్టాలిన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్నకొండ సాయి ఆజాద్, జిల్లా ఉపాధ్యక్షులు మొలుగూరి సోను, జిల్లా సహాయ కార్యదర్శి కనుకుంట్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వేములవాడ పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, వేములవాడలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఆలయ ఈఓ, అధికారులతో కలిసి ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు.అనంతరం విప్ మాట్లాడారు. గతంలో సమీక్షించిన పనులను త్వరగా మొదలుపెట్టి పూర్తి చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు. భక్తులకు బ్రేక్ దర్శనం ఏర్పాట్లను మొదలుపెట్టాలని దీని కోసం పనులు పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ సూచించారు. గోవుల సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని విప్ ఆదేశించారు. వేములవాడ గుడి చెరువు అభివృద్ధి పనులు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని విప్ ఆదేశించారు. బండ్ పార్క్‌లో కొనసాగుతున్న నిర్మాణాలను విప్, కలెక్టర్ పరిశీలించారు. భక్తుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో వారి సౌకర్యార్థం నూతన వసతి గృహాల నిర్మించాలని ఆదేశించారు.గుడి చెరువులో వంద గదుల నిర్మాణం, బద్ది పోచమ్మ ఆలయ సమీపంలో గదుల నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించి అందుకు స్థల పరిశీలన చేశారు. పోచమ్మ ఆలయ నిర్మాణం పనుల్లో వేగం పెంచాలని సూచించారు. వేములవాడ రెండో బై పాస్ లో 60 స్టాల్స్ రెండో బై పాస్ రోడ్డులో రూ.70 లక్షలతో 60 స్టాల్స్ నిర్మించనున్నమని విప్ తెలిపారు. వేములవాడ మూలవాగు బ్రిడ్జి తో పాటు బ్రిడ్జి నుండి గుడి ముందర వరకు మొదటి ఫేజ్ లో రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలన్నారు.

## మెగా స్పెషల్ డిఎస్‌సి ప్రకటించండి



**ప్రజాపక్షం/ ఇచోడ :** షెడ్యూల్ ప్రాంతంలోనే మెగా స్పెషల్ డీఎస్సీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలనీ, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఐటీ డీఏలో బ్యాగ్ లాక్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలనీ తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షులు గోడం గణేశ్ డిమాండ్ చేశారు. తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నేడు ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నా రు. ఆదివారం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో నంబర్ 3 ను యధావిధంగా కొనసాగించాలనీ, జీవో నం 3 ప్రకారం ఉద్యోగస్తులకు పదోన్నతులు, బదిలీలు కల్పించా లన్నారు. పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీ రైతులకు హక్కు పత్రాలను ఇవ్వాలన్నారు. 5 వ షెడ్యూల్ ప్రాంతంలో జీవో నంబర్ 317ను వెంటనే రద్దు చేయాలనీ పేర్కొన్నారు. తుడుం దెబ్బ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని ఆది వాసీ 9 తెగల ఉద్యోగులు, విద్యార్థి, కార్మిక, కర్షక సంఘాలు, మేధా వులు, కవులు, కళాకారులు, మహిళలు తుడుం దెబ్బ అనుబంధ సం ఘాలు సర్మెడీలు, గ్రామ పటేలు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలనీ ఆయన కోరారు. ఈ సమావేశంలో తుడుం దెబ్బ నాయకులు ఉయిక సంజీవ్, వెట్టి మనోజ్, రేణుక, ఇందిర, ఆత్రం గణపతి, వెడ్మ ముకుందరావ్, తొడశం ప్రకాశ్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం..

ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయరమణ రావు వెల్లడించారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీకి క్యాబినెట్ ఆమోదం తెలపడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలోని జెండా చౌరస్తా వద్ద స్థానిక రైతులు మరియు కాంగ్రెస్ నాయకులతో కలిసి మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు.అనంతరం మాట్లాడుతూ..ఆగస్టు 15లోగా రైతులందరికీ రూ.2 లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసిందని చెప్పారు.రుణమాఫీతో పాటు ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుల పంటల బీమా పథకాన్ని అమలు చేయబోతున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న పంటల బీమా కోసం రైతు నయా పైసా చెల్లించకుండానే పంటల బీమా పథకం అమలు కానున్నదని స్పష్టం చేశారు. వర్షాకాలం పండించే సన్న వడ్లకు మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తామని తెలిపారు. పది సంవత్సరాలు క్రితం తెలంగాణ పేరిట అధికారంలోకి వచ్చిన కేసీఆర్ సర్కార్ విడతల వారీగా రుణమాఫీ తప్ప ఏక కాలంలో 2లక్షల రైతు రుణమాఫీ చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఏక కాలంలో 2లక్షల రైతు రుణ మాఫీ చేయలేదని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తన రాజీనామా పత్రాన్ని రెడీ చేసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయరమణ రావు సూచించారు. రైతుల రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేస్తోందని,సవాల్‌ను హరీశ్ నిలబెట్టుకోవాలన్నారు.రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రూ.500కు వంటగ్యాస్ సిలిండర్,రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం వంటి హామీలను సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తూ గతంలో వరంగల్ డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామన్నారు. రైతులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్లు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ అభిమానులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## వెంగళాపూర్‌లో పోచమ్మ బోనాలు



**ప్రజాపక్షం / గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల వెంగళాపూర్ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవత పెద్ద పోచమ్మ బోనాలు తీసి చెల్లించుకున్నారు. వాతావరణంలో మార్పు జరుగుతున్న వేళ గ్రామంలోని ప్రజలు అందరిని చల్లంగా చూడాలంటూ గ్రామ దేవత పోచమ్మ తల్లికి రజక సంఘం ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్లతో నెత్తిన బోనాలతో పోచమ్మ గుడి వద్దకు ఊరేగింపుగా వెళ్లి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి నేవేద్యం పెట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రజక సంఘం అధ్యక్షులు వనపర్తి తిరుపతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షాకాలంలో నిర్వహించే కార్యక్రమాన్ని గ్రామంలోని పెద్ద పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించడం జరిగింది. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆ పోచమ్మ అమ్మవారిని వేడుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు వనపర్తి తిరుపతి, సంఘం సభ్యులు రాజేందర్, ఎం. శ్రీను, శంకర్, మహేష్, వి. శ్రీను, మల్లేష్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లవేళలా సేవా కార్యక్రమాలు




**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** వాసవి క్లబ్ సేవలు చిరస్మరణీయమని, సేవా కార్యక్రమాల్లో ఎప్పుడు ముందుంటుందని ఆసిఫాబాద్ వాసవి క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శంకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వాసవి ఆలయంలో క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా 60 మంది విద్యార్థులకు అతిథులుగా వచ్చిన ముక్త సురేష్, గుండా బాలేశ్వర్, పాపిని శంకర్‌లతో కలిసి నోట్ బుక్స్ పెన్నులు అందజేయడంతో పాటు ముగ్గురు వృద్ధులకు వాకింగ్ స్టిక్, ఒక పేద వ్యాపారికి తోపుడు బండి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవారికి సేవ చేయడంలో తమ క్లబ్ ఎప్పుడు ముందుంటుందన్నారు. సమాజంలోని హెచ్చుతగ్గులు తగ్గించే ప్రయత్నం నిరంతరం చేస్తున్నట్లు వివరించారు. సాటివారికి సేవ చేసే గుణాన్ని ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని సూచించారు. క్లబ్ కార్యదర్శి తాటిపల్లి ఆదిత్య, కోశాధికారి చిలువేరు శ్రీధర్, నాయకులు గుండా ప్రమోద్, పిన్న వివేక్, కొలిపాక వేణు గోపాల్, పుల్లూరి సంతోష్, చెట్ల ప్రశాంత్ పాల్గొన్నారు.

## దారితప్పి జనవాసాల్లోకి నెమలి



**ప్రజా పక్షం/ ముత్తారం :** అడవిలో ఉండాల్సిన నెమలి జనం మధ్యకు వచ్చింది.. రెండు రోజులుగా పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలోని మాజీ సర్పంచ్ తుంగని సమ్మయ్య యాద వ్ ఇంటి పరిసర ప్రాంతాల్లో సందడి చేస్తుండగా ప్రజా పక్షం కెమెరాకు చిక్కింది. గ్రామంలో తిరుగుతున్న నెమలి గురించి కొంతమంది గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.అడవి నుంచి దారి తప్పి వచ్చిన నెమలి అడవి శ్రీరాంపూర్ గ్రామంలో పలు వీధుల్లో తిరుగుతూ చూపరులను ఆకట్టుకుంటోంది. మనుషుల దగ్గరకు వచ్చి నిలబడుతోంది. గ్రామస్తుల ఇండ్లపైన నడచి వెళుతుంటే వారి వెంట కొద్దిదూరం వెళ్లి ఎగిరిపోతోంది. గ్రామంలో తిరుగుతున్న నెమలిని పలువురు యువకులు తమ సెల్ ఫోన్ లో నెమలి ఫోటోలను బంధించారు.అయితే ఈ నెమలి దారి తప్పి వచ్చి ఇక్కడ చిక్కుకున్నట్టుగా ఉంది. గ్రామంలో రెండురోజులుగా నెమలి తిరుగుతున్నప్పటికీ అటవీశాఖ అధికారులు ఇప్పటివరకూ పట్టించుకోలేదు. ఎవరిదైనా కన్ను నెమలిపై పడితే అంతే. ఇప్పటికైనా అటవీ శాఖాధికారులు స్పందించి నెమలిని పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే కౌశిక్‌కు లీగల్ నోటీసులు జారీ

పలు చానళ్లు, పత్రికలకు సైతం
లీగల్ నోటీసులు జారీ చేసిన అడ్వకేట్



**ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధి:** ఫ్లై యాష్ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధార ఆరోపణలు చేసినందుకు గాను హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, టీ న్యూస్ ఛానెల్, టీ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ జోగినపల్లి సంతోష్ కుమార్, నమస్తే తెలంగాణ దినపత్రిక చీఫ్ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి, తెలంగాణ పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌లకు లీగల్ నోటీసులు జారీ చేసినట్లు అడ్వకేట్ ఈటోరు పూర్ణచందర్‌రావు తెలిపారు. ఫ్లైయాష్ ఎన్టీపిసి నుంచి ఉత్పత్తి అవుతుండగా వినియోగించుకోవడానికి వీలుండదని, దీనిని టెండర్ల ప్రక్రియ ద్వారా ఉచితంగా సరఫరా చేస్తారని పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణానికి, బ్రిక్స్ తయారీకి ఉపయోగిస్తారని తెలిపారు. ఈ లారీలలో ఎంత ఫ్లై యాష్ పోతుందనేది అన్లోడ్ పూర్తిగా ఎన్టిపిసి మాత్రమే చూసుకుంటుందన్నారు. ఫ్లై యాష్ ఎక్కడ లోడింగ్ అవుతుందో అక్కడ అడగాల్సింది పోయి హుజురాబాద్‌లో కౌశిక్ లారీలను ఆపి మంత్రిపై ఆరోపణలు చేశారన్నారు. ఆ లారీల్లో ఓవర్ లోడ్‌తో వెళ్తుందని, ప్రతి లారీకి డబ్బులు తీసుకుంటూ పంపిస్తున్నారని మంత్రి పొన్నం పరువుకు భంగం కలిగేలా నిరాధార ఆరోపణలు చేశారన్నారు. వ్యక్తిగత కక్షతో రాజకీయంగా ఎదుర్కోలేక మంత్రి పొన్నంపై చేసిన ఆరోపణలకు గాను లీగల్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అది ప్రసారం చేసిన టీ న్యూస్ చానెల్‌తో పాటు నమస్తే తెలంగాణ దినపత్రికకు లీగల్ నోటీసులు పంపించారు.

## ఉచితాలపై ఆశతో మోసపోవద్దు



**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మూఢనమ్మకాలు, మద్యపానం, రోడ్డు ప్రమాదాలు, సమాజంలో జరిగే నేరాల పైన కనువిప్పు కలిగేలా రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ కళాబృందం, ముత్తారం ఎస్సై మధుసూదన్ రావు ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలు నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి ఉచితలకు ఆశతో మోసపోవద్దని ఈమెయిల్ లేదా మెసేజ్ లో సామాజిక మధ్యమాలలో ప్రకటన కనిపించిన జాగ్రత్తపడండి అని బ్యాంకులో ఎటువంటి అత్యవసర మార్గాన్ని సృష్టించి మిమ్మల్ని సైబర్ నేరగాళ్లు మోసగిస్తారని గుర్తించాలని అన్నారు. పాన్ కార్డును అప్డేట్ చేసుకోవడం కోసం క్రింది లింకును క్లిక్ చేయండి ఇలాంటి మెసేజ్లను ఎవరు కూడా స్పందించకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్లు తాత్కాలిక వెబ్ సోషల్ మీడియా పోస్టులు చాలాసార్లు నిజమైన వ్యాపార సంస్థలను పోలి ఉంటాయని ఇలాంటి విషయాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కస్టమర్ కేర్ నెంబర్ గూగుల్ లో వెతక వద్దు, మీకు లాటరీలు తగిలినాయి అని మీకు లోన్స్ వస్తాయని తక్కువ ధరలకే ఆన్లైన్లో వస్తువులు వస్తాయని ఇలా అనేక రకాలుగా మోసాలు జరుగుతున్నాయి. కాబట్టి అపరిచిత వ్యక్తుల నుండి కాల్స్ వచ్చినప్పుడు వారి నుండి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ మధునయ్య, రమేష్ నాయక్, గోపాల్, రమేష్, తోపాటు పోలీస్ కళాబృందం, తోపాటు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్పీకర్ పదవిపై బిజెపి పట్టు?



న్యూఢిల్లీ: లోక్‌సభ కొత్త స్పీకర్ ఎవరన్నది ఇప్పుడు యావత్ దేశంలో చర్చనీయాంశమైంది. 18వ లోక్‌సభ వర్షాకాల సమావేశాలు ఈనెల 24వ తేదీ, సోమవారం నుంచి ప్రారంభంకానున్న విషయం తెలిసిందే. జులై 3న ఈ సమావేశాలు ముగుస్తాయి. పార్లమెంటు దిగువ సభకు కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రారంభ సమావేశాలు కావడంతో ఈనెల 26న కొత్త స్పీకర్‌ను ఎన్నుకుంటారు. అప్పటి వరకు ప్రోటెం స్పీకర్‌గా భర్తృహరి మహతాబ్ వ్యవహరిస్తారు. కాగా, ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో 543 సీట్లకుగాను భారతీయ జనతా పార్టీ (బిజెపి) 240 సీట్లు సాధించింది. ఈ సంఖ్య స్పష్టమైన మెజారిటీకి 32 తక్కువ. తెలుగుదేశం పార్టీ (టిడిపి), జనతాదళ్ (యునైటెడ్) వంటి ఎన్‌డిఎ మిత్రపక్షాలతో కలిసి ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన విషయం తెలిసిందే. కాగా, స్పీకర్ ఎన్నిక బిజెపికి ప్రతిష్ఠాత్మకం కానుంది. ఈ పదవికి పోటీ చేస్తే మద్దతునిస్తామని టిడిపికి 'ఇండియా' కూటమి ఇప్పటికే ఆఫర్ ఇచ్చింది. టిడిపి అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా స్పీకర్ పదవిని తమ పార్టీకి ఇవ్వాలని కోరుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో, స్పీకర్ పదవిపై ఆసక్తి నెలకొంది. లోక్‌సభలో అత్యంత కీలకమైన పాత్ర పోషించే స్పీకర్‌ను సభ్యులు ఎన్నుకుంటారు. ఒకరు మాత్రమే బరిలో ఉంటే, ఎన్నిక ఏకగ్రీవమవుతుంది. ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీపడితే, ఎన్నిక అనివార్యమవుతుంది. ఎంపిలు రహస్య ఓటింగ్‌లో పాల్గొని, తమతమ ఓట్లు వేస్తారు. ఎక్కువ ఓట్లు పొందిన అభ్యర్థి స్పీకర్ అవుతారు. నిబంధనల ప్రకారం ఎంపిల్లో ఎవరైనా స్పీకర్ పదవికి పోటీ చేయవచ్చు. సాధారణంగా ఈ పదవికి అభ్యర్థిని ఎంపిక చేసే సమయంలో అనుభవం, నిష్పక్షపాత వైఖరి వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటారు. 16వ లోక్‌సభ (2014), 17వ లోక్‌సభ (2019)లలో సంకీర్ణ భాగస్వామ్య పక్షాలపై ఆధారపడకుండా స్వతంత్రంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థానాలను బిజెపి సాధించింది. అప్పుడు వరుసగా బిజెపి ఎంపిలు సుమిత్రామహాజన్, ఓం బిర్లా స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏదైనా అసాధ్య పరిస్థితుల్లో లోక్‌సభ రద్దవడం లేదా తీవ్రమైన ఆరోపణలపై తొలగించబడడం లేదా స్వయంగా రాజీనామా చేయడం వంటి సందర్భాలను మినహాయిస్తే, సభాకాలం పూర్తయ్యే వరకూ స్పీకర్ పదవిలో ఉంటారు. సభలోని ఎంపిలు తమతమ నియోజకవర్గాలకు ప్రాతినిథ్యం వహిస్తుండగా, స్పీకర్ మొత్తం లోక్‌సభకు ప్రాతినిథ్యం వహిస్తారు. పార్లమెంటరీ సంప్రదాయాలు, ప్రజాస్వామ్య విధానాలు, విలువల ప్రకారం సభను నడిపిస్తారు. సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు. సభ్యుల మధ్య క్రమశిక్షణ, మర్యాదను కొనసాగిస్తారు. ఇందులో ఎవరు మాట్లాడాలో నిర్ణయించడం, ప్రోసీడింగ్స్ క్రమాన్ని నిర్దేశించడం, సభా నియమాలు పాటించేలా చూసుకోవడం వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తారు. స్పీకర్ చర్చల్లో పాల్గొనవచ్చు. ఏదైనా అంశంపై ఓటింగ్ జరిగినప్పుడు, సదరు ప్రతిపాదనకు అనుకూలంగా, వ్యతిరేకంగా సమానమైన ఓట్లు పోలైతే, ఫలితాన్ని ఖరారు చేయడానికి ఓటు వేయవచ్చు. దీనినే 'కాస్టింగ్ ఓట్' అంటారు. సభ్యులను క్రమశిక్షణ పాటించేలా చూస్తారు. అవసరం అనుకుంటే ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులను సభ నుంచి తాత్కాలికంగా లేదా పూర్తి కాలానికి తొలగించే హక్కు స్పీకర్‌కు ఉంటుంది. స్పీకర్ స్థానంలో కూర్చున్న వ్యక్తి రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి. సంయమనం పాటించాలి. సభా మర్యాదలను కాపాడాలి. రాజ్యాంగ విలువలను నిలబెట్టాలి. అంతటి కీలకమైన పాత్ర పోషించే అవకాశాన్ని ఎవరు దక్కించుకుంటారన్నది ప్రస్తుతానికి సస్పెన్స్.

## నిరుపేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

### గోద శ్రీరాములు డిమాండ్



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం హనుమాపురం గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని నిరుపేదలకు ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఆ స్థలంలో పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం ప్రకటించిన కొత్త ఇండ్లు మంజూరు చేసి 350 మందికి కొత్త ఇండ్లు ఇచ్చి కొత్త కాలనీ నిర్మాణం చేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కాగా స్థానిక పోలీసులు గ్రామాన్ని సందర్శించి అనుమతి లేకుండా ధర్నా నిర్వహించకూడదన్నారు. దీంతో భువనగిరి ఎసిపితో మాట్లాడిన ధర్నా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఫోన్లో మాట్లాడుతూ నిరుపేదలకు పట్టాలు ఇచ్చేందుకు సహకరిస్తామని, సోమవారం క్యాంపు కార్యాలయం వద్దకు వచ్చి కలవమని తెలిపారు. ధర్నా కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, నాగపురి యాదగిరి, మారగోని ప్రవీణ్, పైళ్ల రవీందర్‌రెడ్డి, సుధారాణి, మిర్యాల లక్ష్మి, ఏనుగు సుస్మిత, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి లక్ష్మయ్య, పట్టణ సిపిఐ కార్యదర్శి పుట్ట రమేష్, 11వ వార్డు కార్యదర్శి చింతల పెంటయ్య, మండల కౌన్సిల్ సభ్యులు సోమన ఐలయ్య, కోట శంకర్, బద్దం వెంకటరెడ్డి, కడారి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## హమాలీలకు సంక్షేమ పథకాలు అమలుచేయాలి : ఎఐటియుసి వినతి



ప్రజాపక్షం/వేలేరు : కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు హమాలీ కార్మికులకు సంక్షేమపథకాలు అమలు చేయాలని ఎఐటియుసి హనుమకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మల రాంమూర్తి కోరారు. ఆదివారం వేలేరు మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో హనుమకొండ జిల్లా హమాలీ సంఘం వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధ సంఘం సమావేశం శనిగరపు రాజుకుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వేలేరు మండల హమాలీ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు అధ్యక్షుడుగా కీర్తి కొమురయ్య, కార్యదర్శిగా పుట్టి రాజు, ఉపాధ్యక్షులుగా భూక్యరాజ్‌కుమార్, మాలోతు శంకర్, కోశాధికారిగా కన్నెబోయిన నాగరాజు ఎన్నుకున్నారు. సమావేశంలో రాంమూర్తి మాట్లాడుతూ హమాలీ కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాలలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. 50 సంవత్సరాలు వయసు దాటిన వారికి రూ.3000ల పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇళ్లులేని వారికి ఇండ్లు కట్టించి ఇవ్వాలని, జీవిత బీమా సౌకర్యాం కల్పించాలన్నారు. ఐకెపి, పిఎసిఎస్ సెంటర్లలో లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్నప్పుడు బస్తాలు మీదపడి గాయపడితే ప్రభుత్వమే వైద్యం అందించి, కార్మికుడి కుటుంబసభ్యలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కీర్తి కొమురయ్య, పుట్టి రాజు, భూక్యరాజ్‌కుమార్, మాలోతు శంకర్, కన్నెబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## చెంచుమహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి : సదాలక్ష్మి



ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామంలో చెంచు మహిళపై జరిగిన దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మంద సదాలక్ష్మి కోరారు. ఆదివారం హన్మకొండ సమీపంలోని గుండ్లసింగారం గ్రామంలో చెంచు మహిళపై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సదాలక్ష్మి మాట్లాడుతూ చెంచు మహిళను కౌలుదార్లు నిర్భందించి పాశవికంగా హింసించిన ఘటనపై బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆమెకు తగిన న్యాయం చేయాలని, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు చిర్ర కవిత,రజిని, యమున, శ్రీలత, స్వప్న, రమ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు : ఎఐఎస్ఎఫ్




ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్ పిలుపునిచ్చారు. ఈనెల 25, 26, 27 న కరీంనగర్ జిల్లాలో ఎఐఎస్ఎఫ్ విద్యా, వైజ్ఞానిక, రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆయన కోరారు. జయశంకర్ జిల్లా భూపాలపల్లి పట్టణంలోని భగత్‌సింగ్ భవన్ సిపిఐ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి రాజకీయ, విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపైన భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించడానికి ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయని తెలిపారు. మోదీ అవలంబిస్తున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసారు. నీట్ పరీక్ష పత్రాలు లీకేజ్ బాధ్యులను కఠినంగా శిక్షించి, తిరగి పరీక్ష నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు కాసర బోయిన ఓంకార్, ఇందారపు అరవింద్, గోలి లావణ్య, గడ్డం స్వరూప, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలపై హత్యాకాండ నిలిపివేయాలి

### కాంగ్రెస్ మాజీ ఎంపి దీపక్ భయిజ్ డిమాండ్

### వారు ఆదివాసీలు కాదు..ఖనిజ సంపద జోలికి వెళ్తున్న వనవాసీలని మోదీ అంటున్నారని ఆగ్రహం



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఛత్తీస్‌ఘఢ్‌లో ఆదివాసీలపై హత్యాకాండను నిలిపివేయాలని కాంగ్రెస్ మాజీ ఎంపి, ఛత్తీస్‌ఘడ్ పిసిసి రాష్ట్ర అధ్యక్షులు దీపక్ భయిజ్ డిమాండ్ చేశారు. అటుకేంద్రంలో, ఇటు ఛత్తీస్‌ఘడ్‌లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆదివాసీల మీద దాడులు పెరగడం విచారకరమన్నారు. ఈ ఏడాది జనవరి నుండే 130 మంది దాకా బస్తర్ ఆదివాసీ, గిరిజన బిడ్డలను కేంద్ర, రాష్ట్ర పోలీసులు, పారా మిలిటరీ సైనిక బలగాలు హత్యచేశారని, ఇదంతా బిజెపి కనుసన్నల్లోనే జరిగిందని ఆరోపించారు. ఈ ఏడాది ఆరంభం నుంచి ఒక్క ఛత్తీస్‌ఘడ్‌లోనే కాదు, బిజెపి అధికారంలో ఉన్న మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఆదివాసీల ఎన్‌కౌంటర్ హత్యలను, దమనకాండను తాము తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు. ఈ మేరకు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక' ఆధ్వర్యంలో ఆదివారం ఒక సమావేశం జరిగింది. ఆదివాసీల జాతీయ అధ్యక్షులు, టిపిసిసి రాష్ట్ర నాయకులు డా.బెల్లయ్య నాయక్ తేజావత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దీపక్ భయిజ్ మాట్లాడారు. జల్, జంగల్, జమీన్ తమ హక్కు అంటూ ఆదివాసీ బిడ్డలు అడవుల్లో ఉంటుంటే.. ఆదివాసీల తల నరికేందుకు బిజెపి నేతలు కుట్రలు పన్ని ఆ భూములను స్వాధీనం చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది జనవరి నుండే 130 మంది దాకా ఆదివాసీలను హత్య చేయడంతో బస్తర్ ఆదివాసీలు తీవ్ర ఆందోళనకు గురి అవుతూ ప్రాణభయంతో బిక్కుబిక్కు మంటున్నారన్నారు. దీనిపై ప్రధాని మోదీకి పలు సార్లు ఫోన్లు చేసి అడిగితే "వారు ఆదివాసీలు కాదు ఖనిజ సంపద జోలికి వెళ్తున్న వనవాసీలు" అని తమకు సమాధానం చెప్పడం విస్తుకలిగిస్తోందన్నారు. వారు ఖనిజ సంపద దోచే వనవాసీలో.. ఆదివాసీలో తేలుద్దాం రండి అనిడిమాండ్ చేస్తున్నామన్నారు. బిజెపి హత్యాకాండకు పాల్పతున్న క్రమంలో దండకారణ్యంలో ఉండే తమ ఆదివాసీ బిడ్డలను రక్షించుకునేందుకు దేశ వ్యాప్తంగా ఆదివాసీకో బచావ్ ఉద్యమాన్ని తీసుకువస్తామని కేంద్రానికి హెచ్చరించారు. బిజెపికి ఎంపిల సీట్లు పెరిగి ఉంటే దేశంలో ఇంకే పరిస్థితులు వచ్చి ఉండేవోనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డా.బెల్లయ్య నాయక్ తేజావత్ మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ మా ఆదివాసీల హక్కు అని వారి జోలికి వస్తే దేశంలోని ఆదివాసీల నుండి ఇక పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ లక్ష్మణ్, సెక్రటరీ ఎన్.నారాయణరావు, ప్రముఖ కవి శివారెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గోవర్ధన్, విరసం నేత పాణి, తెలంగాణ ప్రజాఫ్రంట్ కో కన్వీనర్ ఎం.సంజీవ్ రావు, సిఆర్‌పిపి రాష్ట్ర అధ్యక్షులు బల్లా రవి, రైతాంగ పోరాట సమితి రాష్ట్ర బాధ్యులు జక్కుల వెంకటయ్య, భారత్ బచావో సంస్థ నేత జంజర్ల రమేష్ తదితరులు ప్రసంగించారు.

## సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలి

### సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

ప్రజాపక్షం/మునుగోడు : రైతాంగానికి ఉపయోగపడే సాగునీటి ప్రాజెక్టులైన ఉదయసముద్రం, నక్కలగండిని కాంగ్రెస్ ప్రభుత్వం త్వరతగతిన పూర్తి చేసి మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగునీరు అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ సమావేశానికి హాజరై సత్యం మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి అయినట్లయితే మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలలో వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. రైతులను దృష్టిలో పెట్టుకొని కాలయాపన చేయకుండా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి ఆగస్టు 15 నాటికి రుణమాఫీ చేస్తామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించడం హర్షించదగ్గ విషయమని, అర్హులైన రైతులందరికి రుణమాఫీ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం సీజన్‌లో రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు. సమావేశంలో గురుజ రామచంద్రం, బొల్గూరి నరసింహ, తీర్పురి వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య, ఈ.బిక్షంరెడ్డి, చాపల శ్రీను, దుబ్బాక భాస్కర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్ పాల్గొన్నారు.




## వస్త్రపరిశ్రమపై ఆధారపడ్డ కార్మికులను ఆదుకోవాలి : సిపిఐ



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమ పూర్తిగా కుదేలైందని, వస్త్ర పరిశ్రమపై ఆధారపడ్డ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ కార్మిక ఆసాముల కుటుంబాలు నాలుగు మాసాలుగా ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోలేకఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈమధ్యకాలంలోనే సుమారు 8 మంది కార్మికులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమైన విషయమన్నారు. ఈ విషయాలపై మూడు మాసాలుగా అనేక రకాల ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గతంలో మాదిరిగా పవర్లూమ్ పరిశ్రమకు 50 శాతం విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలని, గత బతుకమ్మ చీరల బకాయిలను చెల్లించాలని, పరిశ్రమ పునర్ వైభవం పొందే విధంగా రాయితీలు కొనసాగించే చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పంతం రవి, సోము నాగరాజు పాల్గొన్నారు.

## ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

### 26న జిల్లావ్యాప్తంగా ధర్నాలు




ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : పెరిగిన ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం హన్మకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. సమావేశానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలతో పాటు పెట్రోల్, డిజీల్, గ్యాస్ ధరలు పెరిగి సామాన్యులకు మోయలేని భారం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ధరలను తగ్గిస్తామని చెప్పి ప్రధాని మోదీ మాట మార్చారన్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు కూడా ఆకాశాన్నంటాయని, టమాట, పచ్చి మిర్చి కిలో రూ.100 కు చేరుకున్నాయని, ఉల్లిగడ్డ కిలో రూ.50కి చేరిందని అన్నారు. గడిచిన వారం పది రోజులలోనే ధరలు అమాంతం పెరిగినా పాలకులు మాత్రం చోద్యం చూస్తున్నారన్నారు, పేదలు, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో లేకుండా ధరలు పెరిగినా ప్రభుత్వాలు ధరలను నియంత్రించే చర్యలు చేపట్టడం లేదన్నారు. పెరిగిన ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో నిరసన ధర్నాలు నిర్వహించాలని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, నకీర్త ఓదెలు, బాషబోయిన సంతోష్, కొట్టెపాక రవి, ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్, ఏశబోయిన శ్రీనివాస్, బత్తిని సదానందం, రాసమల్ల దీనా, కామెర వెంకటరమణ, ఇల్లందుల రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీకి పొంచి ఉన్న ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి పరివాహనక ప్రాంతాలు పూర్తిగా తుడిచిపెట్టుకు పోయాయి. భారీ ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లింది. ఆ నాటి పరిస్థితుల నుండి కోలుకోవడానికి కనీసం ఆదేళ్లు పట్టింది. ఆ తర్వాత 2022 లో గోదావరికి 70.03 అడుగుల అతిపెద్ద వరద వచిచంది. కాగా 1986 వరదల సమయంలో కంటే 2022 వరదలప్పుడు ఎక్కువ ప్రాంతాలు నీటమునిగాయి. దిగువన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగు తుండటంతో ఈ పరిస్థితి ఎర్పడింది. గోదావరి నదికి ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం వద్ద గోదావరి వంతెనపై అప్పటి కలెక్టర్ అవినాష్ 144 సెక్షన్ విధించారు. అంతరాష్ట్ర రహదారులు మూసుకుపోయాయి. ఎటు చూసిన గోదావరి వరదనీరు తప్ప మరేమీ కనిపి ంచలేదు. ఇదిలా ఉండగా సీతారామ ప్రాజెక్టుతో కూడా దుమ్ముగూడెం మండలంలోని పలు గ్రామాలు నీటమునుగుతున్నాయి. భద్రాచలం పట్టణంలోని వరద నీరు ప్రవేశించ కుండా కూనవరం రోడ్‌లో మిగిలిపోయిన కరకట్ట పనులను చేపడుతున్నారు. వరదలు వచ్చే రోజులు దగ్గర పడుతున్నా ఆ పనులు పూర్తి కాలేదు. ఇప్పటికైనా అధికారులు చొరవతీసుకుని కరకట్ట పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**పరిష్కారం లేని స్లూయిస్‌లు :** గోదావరి వరద నీరు పట్టణంలోని ప్రవేశించి ముంచెత్తకుండా 2000 సం.లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కరరట్ట నిర్మాణాన్ని చేపట్టింది. పట్టణంలోని మురుగునీరంతా గోదావరిలో కలిసేందుకు రామాలయం సమీపంలో స్లూయిస్‌లు ఏర్పాటు చేశా రు. ఆ స్లూయిస్‌లతోనే ఇప్పుడు పెద్ద తంటొచ్చి పడింది. వరదల సమయంలో స్లూయిస్‌లు మూయడం వల్ల మురుగునీరంతా నదిలోకల వకుండా పైకి తన్నుతోంది.మరో ప్రక్క పెద్దఎత్తున వర్షం పడినా డ్రైనేజీలద్వారా నీరంతా ఇటుగా వచ్చి రామాలయం సమీప ప్రాంతాలతో పాటు అన్నదాన సత్రాన్ని ముంచెత్తుతోంది. ఇక గోదావరి వరదల సమయంలో ఈ ఇబ్బంది మరింతగా ఉంటుంది. 2022 వరదల్లో రామా లయం పరిసర ప్రాంతాలు పూర్తిగా జలమయం కావడంతో అక్కడ పడవల్లో తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.ప్రతీ ఏటా ఆ నీటిని తోడి పోయడం, ఒక్కొక్క సారి మోటార్లు మెరాయించడంతో పరిస్థితులు చేజారిపోతున్నాయి. సరైన మోటార్లు అందుబాటులో లేకపోవడంతో హెవీవాటర్ ప్లాంట్, సింగరేణి కంపెనీల నుండి భారీ మోటార్లు తీసుకొచ్చి నీటిని ఎత్తిపోస్తున్నారు. సొంతగా మోటార్లు ఏర్పాటు చేసుకోవడంతో పాటు స్లూయిస్‌ల వ్యవహారంలో శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ఎల్లో అలర్ట్ (మొదటి పేజీ తరువాయి)

కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాలో అక్కడ మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు. మంగళవారం నుంచి బుధవారం వరకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు సిద్ధిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అధికారులు వివరించారు. ఆదివారం మంచిర్యాల, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, హన్మకొండ, సంగారెడ్డితో పాటు హైదరాబాద్‌లో వర్షం కురిసింది. అత్యధికంగా మంచిర్యాల జిల్లా కాసిపేటలో 6 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైందన్నారు.

**హైదరాబాద్‌లో కూలిన విద్యుత్ స్తంభాలు.. సరఫరాకు అంతరాయం...పలుచోట్ల లైన్లు మరమ్మతు చేపట్టిన అధికారులు..** ఆదివారం సాయంత్రం నుండి కురిసిన భారీ వర్షాలకు రాజధాని హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మెహదీపట్నం తదితర ప్రాంతాల్లో చెట్లు కూలి విద్యుత్ స్తంభాలు, లైన్లపై పడడంతో స్తంభాలు నేల రాలాయి. పలు చోట్ల కరెంటు లైన్ల వైర్లు తెగి పోవడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. సమాచారం తెలుసుకున్న దక్షిణ తెలంగాణ విద్యుత్ శాఖ టిఎస్ ఎస్‌పిడిసిఎల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులకు దిగారు. కొన్ని చోట్ల కొన్ని గంటల్లోనే మరమ్మతు పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగా, మరి కొన్ని చోట్ల విరిగిన విద్యుత్ స్థంభాలను పునరుద్ధరించే పనిలో నిమగ్నమవుతున్నారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ఆనంద్ నగర్ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 11 కెవి ఫీడర్ సాయినగర్ పరిధిలోనూ ఒక విద్యుత్ స్తంభం కూలినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కాగా కొన్ని గంటల వ్యవధిలోనే పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



## బొగతలో పర్యాటకుల సందడి

ప్రజాపక్షం/వాజేడు : తెలంగాణ మినీ నయాగరా జలపాతంగా పేరుగాంచిన ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతానికి పర్యాటకులు సందడి చేశారు. ఛత్తీస్‌గఢ్, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, భద్రాచలం వివిధ ప్రాంతాల నుండి పర్యాటకులు ఆదివాసం సెలవుదినం కావడంతో 400 మందికి పైగా పర్యాటకులు బొగతను వీక్షించడానికి వచ్చారు. పచ్చని అడవుల మధ్యన జలపాతం ఆ అందాలను చూసి పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బొగత జలపాతం వద్ద ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొంది. పర్యాటకులు బొగతలో స్నానాలు చేస్తూ పిల్లా పాపలతో ఆనందంగా గడిపారు. పర్యాటకులు వారి చరవాణిలో బొగత అందాలను బంధించారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

ప్రజాపక్షం
మహానగరి
హైదరాబాద్ — రంగారెడ్డి
ఖమ్మం | సోమవారం | 24 జూన్, 2024 | 9

## హామీలు నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌దే



ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ : రైతు రుణమాఫీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆదివారం పెద్ద అంబర్‌పేట్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో బానా సంచా కాల్చి, సిఎం రేవంత్‌రెడ్డి ఫొటోకు పాలభి షేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. పెద్ద అంబ ర్‌పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కొత్త పల్లి జెపాల్‌రెడ్డి, ఎఐసిసి నాయకులు వల్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ హామీలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు చేవుల హరిశంకర్, రాజేంద్రర్, చామ క్రిష్ణరెడ్డి, చర్లపల్లి శంకరయ్య గౌడ్,సిద్దేక్కి మెహన్‌రెడ్డి, దేవిడి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నీట్ పరీక్షపత్రం లీకేజీ

### యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్

ప్రజాపక్షం/షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నీట్ పరీక్ష పత్రం లీకేజీ అయిందని, ఇందుకు పూర్తి బాధ్యత వహించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం షాద్‌నగర్ నుండి యువజన కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున రాష్ట్ర బిజెపి కార్యాలయం ముట్టడికి బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా అందె మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ నీట్ పరీక్ష పత్రం లీకేజీ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తులకు తక్షణమే అరెస్టు చేయడంతోపాటు నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష పత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి తక్షణమే రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు.

## అత్యాచారం.. నిందితుడిపై పోక్సో

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రేమిస్తున్నానంటూ ఇంటర్ విద్యార్థినికి మాయమాటలు చెప్పి అత్యాచారం చేసిన యువకుడిపై నారాయణగూడ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించా రు. ఎసిపి శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సైఫాబాద్ ప్రాంతా నికి చెందిన ఖలీల్ నారాయణగూడలో ఇంటర్ చదువుతున్న విద్యార్థినికి ప్రేమిస్తున్నానని చెప్పి అత్యాచారం చేశాడు. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఖలీల్‌ను అరెస్టు చేశారు.

## 76కిలోల గంజాయి పట్టివేత



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆది వారం జరిపిన దాడుల్లో 76 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలు గురు నిందితులను అరెస్టు చేశారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల నుంచి గంజాయిని తక్కువ ధరకు ఖరీదు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్ర యిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందడంతో జిన్నారం పల్లిలో రెండు ఆటోలో తరలిస్తున్న 76 కిలోలు, బైక్‌పై తరలిస్తున్న 4.50 కిలోల గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెండు ఆటోలు, బైక్‌ను సీజ్ చేసి నలుగురిని అరెస్టు చేశారు.

**దూల్‌పేట్‌లో..** ఆదివారం దూల్‌పేటలో జరిపిన తనిఖీల్లో రూ. 3.50 లక్షల విలువ చేసే 17.1 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎస్‌టి ఎఫ్ సూపరింటెండెంట్ నంద్యాల అంజిరెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దూల్‌పేట్‌కు చెందిన దినేష్ సింగ కర్నాటక ప్రాంతానికి చెందిన సోంపాల్‌రావు వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి దానిని చిన్న చిన్న ప్యాకెట్లతో పెట్టి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం దూల్‌పేట్, మల్చిపూర్ ప్రాంతాలల్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నా యని విశ్వసనీయ సమాచారం రావడంతో ఎస్ఐ సాయి కిరణ్, హెడ్ కాని స్టేబుళ్లు యాదగిరి రాజు, యాదగిరి, మహేస్, రజనీకాంత్లు దినేష్‌ను అద పులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.3.30 లక్షల విలువైన 17 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవీ, సూపరిండెంట్ అంజిరెడ్డిలు అభినందించారు.

## చైన్ స్నాచర్ అరెస్టు

ప్రజాపక్షం/హైదరాబాద్: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడితో పాటు దొంగ బంగారం కొనుగోలు చేసిన వ్యక్తిని సైతం సౌత్ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకట్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన గటాడి సాయికుమార్ అలియాస్ శ్రీనివాస్ (26) సరూర్‌నగర్‌లో నివాసముంటున్నాడు. లేడీస్ హెయిర్ డ్రెస్సర్ వ్యాపారం నిర్వహిస్తున్న సాయికుమార్ రాపిడోలో రైడర్‌గా కూడా పనిచేస్తున్నాడు. డబ్బులు సులు వుగా సంపాదించేందుకు చైన్‌స్నాచింగ్‌లు చేయాలని నిర్ణయానికి వచ్చా డు. మలక్‌పేటలోని ముంతాజ్ కాలేజీ సమీపంలో ఈనెల 18న రాత్రి నడుచుకుంటూ వస్తున్న వృద్ధ మహిళా మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలను లాక్కుని నంబర్ ప్లేట్ లేని హోండా యాక్టివాపై పరారయ్యాడు. చోరీ చేసిన ఆభరణాలను ఆర్మూర్‌కు వెళ్లి శ్రీరామ్ శ్రీనివా స్‌కు రూ.1.30 లక్షలకు విక్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీ సులు నిందితుడి వివరాలను సిసిటివి ద్వారా రాబట్టారు. ఆర్మూర్‌కు వెళ్లిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితుడు సాయికుమార్‌తో పాటు దొంగ బంగారం ఖరీదు చేసిన శ్రీరామ్‌శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3.50 లక్షల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితు లను మలక్‌పేట్ పోలీసులకు అప్పగించారు.

## గొంతులో చికెన్ ముక్క ఇరుక్కుని వ్యక్తి మృతి

ప్రజాపక్షం/హైదరాబాద్: మద్యం సేవించిన ఓ యువకుడు చికెన్ తిన్నాడు. గొంతులో ఇరుక్కుపోవడంతో ఊపిరి ఆడక మృతిచెందాడు.ఈ సంఘటన సైదాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. షాద్‌నగర్ అన్నారం గ్రామానికి చెందిన శ్రీకాంత్ (39) శనివారం రాత్రి ఇంటి నుంచి బయలుదేరి మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌కు ఆర్‌టిసి బస్సులో వచ్చాడు. అక్కడి నుంచి బగ్గా వైన్స్ వద్ద మద్యం సేవించాడు. ఆ తరువాత ఎదురుగా ఉన్న బిర్యాని హోటల్‌లో చికెన్ తిన్నాడు. అదికాస్తా అతని గొంతులో ఇరు కున్ని ఊపిరి సరిగా ఆడకుండా అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. సైదాబాద్‌లో తన సోదరి ఇంటికి వెల్లేందుకు ఆటో ఎక్కాడు. ఆటోలోనే చనిపోయాడు. సైదాబాద్ చేరుకున్న తరువాత ఆటో డ్రైవర్ వెనకాల కూర్చున్న శ్రీకాంత్ ను చూసేసరికి చనిపోయి ఉన్నాడు. భయపడిన ఆటోడ్రైవర్ శవాన్ని ఫుట్ పాత్‌పై పడేసి పారిపోయాడు. పోలీసులు మృతదేహానికి ఉస్మానియా మార్చురిలో పోస్టుమార్ట నిర్వహించగా అసలు విషయం బయటపడింది. గొంతులో చికెన్ ముక్క ఇరుక్కుపోవడంతో చనిపోయాడని తేలింది.

## రైతు శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది : ఎమ్మెల్యే శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: రైతు శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టు బడి ఉంటుందని, ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ చేసేందుకు ప్రభుత్వం విధి విధానాలను విడుదల చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమని షాద్‌నగర్ ఎంఎల్‌ఏ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు.

**అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తాం...** అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంఎల్‌ఏ వీర్లపల్లి శంకర్ వివరించారు. ఏడాదిలోగా అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలతో పాటు ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను వర్తింపజేసేందుకు కృషి చేస్తున్న ట్లు పేర్కొన్నారు. సమావేశంలో బాబర్‌ఖాన్, బాల్‌రాజ్ గౌడ్, మహ్మద్ ఇబ్రహీం, శేఖర్, సీతారాములు, లింగారెడ్డిగూడ అశోక్ ఉన్నారు.

### వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

**కొత్తూరు:** వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు షాద్‌నగర్ ఎంఎల్‌ఏ వీర్లపల్లి శంకర్ సూచించారు. ఆదివారం కొత్తూరు మండల కేంద్రంలో ఉన్న అండర్‌పాస్ రహదారిని పరిశీలించారు. కార్యక్రమంలో జె.సుదర్శన్ గౌడ్, సిద్దార్థ, హరినాథ్‌రెడ్డితోపాటు వ్యాపారస్తులు ఉన్నారు.

# ఎల్లో అలర్ట్

### పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం హెచ్చరిక

### రాష్ట్రంలో మరో మూడు రోజులు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో మరోమూడురో జులు వర్షాలు కు రుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. పలుచోట్ల ఉరుము లు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షా లు కురు స్తాయన్నారు. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. ఆదివారం నుంచి సోమ వారం ఉదయం వరకు ఉత్తర తెలంగాణలో ఆదిలా బాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడ మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు ఉమ్మడి ఆదిలా బాద్‌తో పాటు నిజామాబాద్, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడ క్కడ వర్షాలు కురుస్తాయన్నారు. మంగళవారం నుంచి బుధవారం వరకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు సిద్దిపేట, భువనగిరి, రంగా రెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో అక్కడ క్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అధికారులు వివరించారు. ఆదివారం మంచిర్యాల, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, హన్మకొండ, సంగారె డ్డితో పాటు హైదరాబాద్‌లో వర్షం కురిసింది. అత్యధి కంగా మంచిర్యాల జిల్లా కాసిపేటలో 6 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైందన్నారు.

హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఆదివారం భారీవర్షం కురిసింది. మధ్యా హ్నం వరకు ఉక్కపోతతో నగర








ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అయితే సాయంత్రం ఒక్కసారిగా ఆకా శం మేఘావృతమై కారు మబ్బులు కమ్ముకున్నాయి. భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీనితో వరద నీటితో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నగరంలోని పలు ప్రాంతాలు వర్షంతో తడిసిముద్దయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయం కావ డంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగరం లోని మియాపూర్, చందానగర్, గచ్చిబౌలి, శేరిలింగం పల్లి, మాదాపూర్, ఫిలింనగర్, బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్, అమీర్‌పేట, సనత్‌నగర్, ఎల్‌బి నగర్, నాగోల్, చైతన్యపురి, కొత్తపేట్, సరూర్ నగర్, ముషీరాబాద్, చిక్కడపల్లి , రాంనగర్, ముషీరాబాద్, అశోక్‌నగర్, చాదర్‌ఘాట్, సైదాబాద్, చంపాపేట్, రాయదుర్గం తది తర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మలక్‌పేట రైల్వేబ్రిడ్జి కింద భారీ గా వరద నీరు చేరింది. చాదర్ ఘట్ నుంచి దిల్ సుఖ్ నగర్ వెళ్లే ట్రాఫిక్ స్తంభించిపో యింది. వనస్థలిపురం వద్ద భారీ వర్షానికి హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. రహదారి విస్తరణ పనులు చేస్తుండ టంతో వరద నీటితో వాహనదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కున్నారు. మరోవైపు చింతలకుంట వద్ద ట్రాఫి క్ రద్దీ ఏర్పడింది. వరదనీటిలో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. పలు ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ మళ్లించేం దుకు పోలీసుల చర్యలు చేపట్టారు.

### కూలిన విద్యుత్ స్తంభాలు.. సరఫరాకు అంతరాయం...

పలుచోట్ల లైన్లు మరమ్మతు చేపట్టిన అధికారులు.. ఆది వారం సాయంత్రం నుండి కురిసిన భారీ వర్షాలకు రాజధాని హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మెహదీపట్నం తది తర ప్రాంతాల్లో చెట్లు కూలి విద్యుత్ స్తంభాలు, లైన్లపై పడడంతో స్తంభాలు నేల రాలాయి. పలు చోట్ల కరెంటు లైన్ల వైర్లు తెగి పోవడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. సమాచారం తెలుసుకున్న దక్షిణ తెలంగాణ విద్యుత్ శాఖ టిఎస్ ఎస్‌పిడిసిఎల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులకు దిగారు. కొన్ని చోట్ల కొన్ని గంటల్లోనే మరమ్మతు పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్దరించగా, మరి కొన్ని చోట్ల విరిగిన విద్యుత్ స్థంభాలను పునరుద్ధరించే పనిలో నిమగ్నమవు తున్నారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ఆనంద్ నగర్ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 11 కెవి ఫీడర్ సాయినగర్ పరిధిలోనూ ఒక విద్యుత్ స్తంభం కూలినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కాగా కొన్ని గంటల వ్యవధిలోనే పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

## కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం : జంగయ్య




ప్రజాపక్షం/షాబాద్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసమే ఏఐటి యుసి నిరంతర పోరాటాలు చేస్తుందని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన ఏఐటియుసి నూతన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ షాబాద్ మండలంలో విస్తృతంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని, వేలాది మంది కార్మికులు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఈ ప్రాంతానికి వస్తున్నారని వివరించారు. కార్మికుల శ్రేయస్సు కోసం ఏఐ టియుసి నిరంతర పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. కార్మికుల సమ స్యల పరిష్కారం కోసం, యాజమాన్యాల దోపిడికి వ్యతిరేకంగా ఏఐటి యుసి పోరాటాలు నిర్వహించాలని సూచించారు. ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను అమలు చేయకుండా పరిశ్రమ యాజమాన్యం పై పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉంటాయని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుండి వస్తున్న కార్మికులకు చట్ట బద్ధంగా 50వేతనాలు ఎక్కువగా ఇవ్వాలని నిబంధనలు ఉన్నప్పటికి ఏ పరిశ్రమ యాజమాన్యం అమలు చేయడం లేదన్నారు. కార్మికులను నిలువు దోపిడికి పాల్పడుతున్న యాజ మాన్యాలపై ఏఐటియుసి నిరంతర పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, షాబాద్ మండల కార్యదర్శి నారా యణ శాబా, సిపిఐ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య, రఘురాం, మధు, మహిళా సంఘం నాయకురాలు మంజుల రాములు, జాంగీర్, మహమూద్ తదితరులు ఉన్నారు.

# పెరిగిన కూరగాయల ధరలు

### టమాటా @ 100



ప్రజాపక్షం/హైదరాబాద్ : పెరిగిన కూరగాయాల ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల వాసులు కూరగా యాల ధరలను వింటనే బెంబేలెత్తిపోతున్నారు.హైదరాబాద్ నగరంలో వీటి ధరలు మరింత అధికంగా ఉండడంతో ఇక్కడ నివసిస్తున్న నిరుపేద వర్గాల ప్రజలు ఏమి కొనేటట్టూ లేదు, ఏమి తీనాలో అంటూ గత పాటను గుర్తు చేసు కుంటున్నారు. అన్ని కూరగాయాల ధరలు కిలోకు రూ.100లకు పైకి ఎగబా కడంతో ఏమి కోనాలో తేల్చుకోలేకపోతున్నారు. ఏది ఉన్నా, లేకపోయినా అన్ని వేళ్లాలో సామాన్యుడి అన్ని వంటల్లో ఎదిగిపోయే టమాటా సైతం రూ.100ల మార్కును దాటడంతో మరింత ఇబ్బందిపడుతున్నారు. ఇటీవల వరకు రూ.100లకు 5 కిలోలు ఉన్న ఉల్లిగడ్డ కూడా కిలో రూ.50 నుంచి రూ 60ల ధర పలుకుతుండడంతో ఉల్లి ధర ఘాటుకు పేదలు ఉక్కిరి బిక్కిరి అవు తున్నారు. బినిస్ కాయ ఏకంగా కిలో రూ.150 నుంచి రూ.160 పలుకుతుం డగా, పచ్చి మిర్చి కిలో రూ. 100 నుంచి రూ.120, దొండకాయ, బెంగకా యలు, వంకాయల కిలో ధరలు రూ.80 నుంచి రూ. 100లకు చేరాయి. రైతు బజార్లలోనే ధరలు మండి పోతుంటే బహిరంగ మార్కెట్‌లో మరింత అధిక ధరలు నగరవాసులకు ధడ పుట్టిస్తున్నాయి. గత ఎండాకాలంలో ఎండ దెబ్బ లకు అశించిన స్థాయిలో కూరగాయాల తోట పెరగపోగా, మేమూడోవా రంలో వరుసగా కురిసిన భారీ అకాలవర్షాల కారణంగా మరింత దెబ్బతిన్నా యి. దీనికి తోడు జూన్ మొదటి వారంలోనే నైరుతి రుతు వపనాలు రాష్ట్రం లోకి ప్రవేశించినప్పటికీ ఇప్పటీ వరకు కురవాల్సిన వర్షాలు పడకపోవడంతో మార్కెట్ డిమాండ్ మేరకు పంట దిగుబడి లేకపోవడంతో అన్ని కూరగాయాల ధరలు మండిపోతున్నాయి. డిమాండ్ మేరకు కూరగాయాలు మార్కెట్‌కు వస్తే తప్ప ధరలు తగ్గే అవకాశం ఉండదని మార్కెట్ల అధికారులు వెల్లడించారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

### జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి

ప్రజాపక్షం/హయత్ నగర్ : సమస్యల పరిష్కారం కోసం తన సాయశక్తుల కృషి చేస్తా నని జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి అన్నారు. ఆదివారం మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ పరిధిలో పలు సమస్యలపై జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి డివిజన్ పరిధిలోని వివిధ కాల నీల సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరే షన్ పరిధిలోని శివ గంగ కాలనీ,వీరన్న గుట్ట శిరిడి సాయి నగర్ కాలనీ,వరద నగర్,ఆర్.టి సి కాలనీ,తోపాటు సిఎస్ఆర్ కాలనీ నుండి భూగర్భ డ్రైనేజ్ ట్రంక్ లైన్ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో శ్రీశైలం, నరేష్, బాబు రావు, శ్రీధర్ రెడ్డి, నర్సింహా యాదవ్, కోటయ్య, సత్యం,నరేంద్ర కుమార్, చిన్న యాదవ్ పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

ప్రజాపక్షం/నార్సింగి: గండిపేట మండలం నార్సింగి మున్సిపా లిటీ కోకాపేట్ గ్రామంలోని బొడ్రాయి దేవత మొదటి వార్షికో త్సవ ఉత్సవా లు ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు టిపిసిసి ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి , నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ విజయ్ బాబు, కౌన్సిలర్ దుర్గేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై నారు. ఈ సందర్భంగా టిపిసిసి ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు బాగా కురవాలని గ్రామ దేవతకు కోరుకున్నాను అని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిన్నల్లు పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహేశ్వరంలోనే 'ఎఐ' సిటీ..!

### 200 ఎకరాల్లో విస్తరణకు సన్నాహాలు

### వెయ్యి ఎకరాల్లో ఎలక్ట్రానిక్ సంస్థల ఏర్పాటుకు సంప్రదింపులు

### ఫార్మా భూముల్లో బల్క్‌డ్రగ్ కంపెనీల ఏర్పాటుకు స్వస్తి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : ఎమర్జింగ్ టెక్నాల జీల్లో ఒకటైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ(ఎఐ సిటీ)ని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం కేంద్రంగా ఏర్పాటు చేయా లని ఐటీశాఖ భావిస్తున్నట్లు తెలిసింది.ఐటీకారిడార్‌గా గుర్తింపు పొందిన గచ్చిబౌలి,మాదాపూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండటం, అనువైన స్థలాలు అందుబాటులో లేకపోవడంతో అంతర్జాతీయ విమానా శ్రయానికి అతి సమీపంలో ఉన్న మహేశ్వరం నియోజక వర్గంలోని ఈసిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఔటర్‌రింగ్ రోడ్డుకు సమీపంలో ఉండడం తోపాటు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు 15 కిలోమీటర్ల పరి ధిలో అనువైన స్థలాలను అన్వేశించే పనిలో సంబంధిత శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. జులైలో మహాన గరం వేదికగా నిర్వహించే ఏఐ సదస్సులో ప్రభుత్వం అధికారికంగా ఈఅంశాన్ని ప్రకటించే అవకాశం ఉన్న ట్లు తెలిసింది. ఇదే జరిగితే స్థానిక యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించడం మేక కుండా భూముల ధరలకు మరింత రెక్కలొచ్చే అవకాశం లేకపోలేదు., కోకాపేట, నార్సింగి, మణి కొండా, గండి పేట, సైబరాబాద్ సిటీలను మించి మరో విశాలమైన



మహానగరం ఈప్రాంతంలో ఆవృతం కాబోతోంది.

### మరో మహానగరం ఆవిష్కృతం

మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలో ఫార్మాసిటీని ఏర్పాటు చేయాలని గత బిఆర్‌ఎస్ ప్రభు త్వం భావించింది. ఆ మేరకు కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల్లో 19,330 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది.ఇప్ప టికే 14,000 ఎకరాలు సేకరణ పూర్తి చేసింది. వీటిలో ప్రభుత్వ,అసైన్డ్ భూములే అధికం. 450 పైగా బల్క్ డ్రగ్ కంపెనీలు ఇక్కడ ఏర్పాటు కాబోతున్నట్లు ప్రకటిం చింది.అయితే ఈ కంపెనీల వల్ల భారీగా వాయు, జల కాలుష్యం తో పశు, పక్షాదులతో పాటు ప్రజల ప్రాణాలు ఫణంగా పెట్టాల్సి వస్తోందనే ఆందోళన కూడా వ్యక్తం అవుతుంది. ఇదే సమయంలో కొంతమంది రైతులు సైతం తమ పట్టా భూములను ప్రభుత్వానికి ఇచ్చేందుకు నిరాకరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేసి, రైతుల నుంచి బలవం తంగా సేకరించిన భూములను తిరిగి వెనక్కి ఇవ్వను న్నట్లు ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన త ర్వాత ఫార్మాసిటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. భూము లను తిరిగి ఇవ్వక పోగా..అప్పటికే ప్రభుత్వం సేకరిం చిన ఈ భూముల్లో మల్టీజోన్ సిటీలను ఏర్పాటు చేయబో తున్నట్లుగా ప్రకటిచింది. కానీ తాజాగా పొల్యూషన్ రహిత ఫార్మా కంపెనీలకు అనుమతినిచ్చి,పొల్యూషన్ అయితే కంపెనీలను మరో ప్రాంతానికి తరలించే ప్రయ త్నంలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

### మరో మహా నగరంగా మహేశ్వరం

మహేశ్వరం చుట్టూ మరో మహా నగరం ఆవృతం కాబో తుంది. జాతీయ,అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సంస్థలు ఇక్కడ భారీగా నిర్మాణాలు చేపట్టనున్నాయి. ఆకాశ హార్మాలు,ఐటీ కంపెనీలు పెద్దసంఖ్యలో తరలిరానుం డటం ఇక్కడి వారికి కలిసి వచ్చే అంశం.

### జపాన్ పెట్టుబడులు

ఫార్మా భూముల్లో ప్రజలకు హాని కలిగించే బల్క్‌డ్రగ్ కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం దాదాపుగా స్వస్తి పలి కింది.వాటి స్థానంలో ఎలక్ట్రికల్,ఎలక్ట్రానిక్స్ వంటి సంస్థ లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది.ఇప్పటికే కొంగర కలాన్ వేదికగా ఫాక్స్‌కాన్ కంపెనీ ఏర్పాటైంది.పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. త్వరలోనే ఆ సంస్థ తన కార్యకలాపాలను ప్రారంభించే అవకాశం ఉంది. ఇక్కడ సుమారు మూడు వేల మందికిపైగా ఉపాధి అవ కాశం లభించే అవకాశాలు ఉన్నాయి. దీనికి సమీపం లోనే ఫార్మా భూములు ఉండటం,పారిశ్రామిక రంగా నికి కలిసి వచ్చే అంశం. ఓ ప్రముఖ జపాన్ కంపెనీ సైతం ఇక్కడ పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఆ కంపెనీకి ఈ ఫార్మాసిటీలో ని 200 ఎకరాలు కేటాయించే అవకాశం ఉంది.ఇప్పటికే కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్ పేట సర్వే నం.112లోని 20 ఎకరాల్లో మహేశ్వరం మెడికల్ కాలేజీ ఏర్పాటు కాబోతోంది.రూ.160 కోట్లతో మెడికల్ కాలేజీ భవనం, రూ.400 కోట్లతో ఆస్పత్రి భవనం కూడా అందుబాటులోకి రాబోతోంది. త్వర లోనే ఈ ప్రాంతం మెడికల్, ఎడ్యుకేషనల్ హబ్‌గా మార బోతోంది.

## 25న ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 25న మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డా. రాజశేఖర్ ఆప్తాల మిక్ అసిస్టెంట్ మురళి తెలిపారు. ఉమ్మడి వీపనగండ్ల చిన్నంబాయి మండలాల్లోని కంటి రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శిబిరానికి వచ్చే కంటి రోగులు ఆధార్ కార్డ్, రేషన్ కార్డులను తమ వెంట తీసుకురావాలని, కంటి పరీక్షల అనంతరం ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి పాలమూరులోని ఎనుగొండ కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని కంటి రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బాధితుడిని పరామర్శించిన ఎంఎల్ఎ



**ప్రజాపక్షం/వంగూర్ :** మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లి గ్రామానికిచెందిన పుప్పల పర్వతాలు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని మల్లాపూర్ రికవరి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆదివారం సమాచారం తెలుసుకున్న అచ్చంపేట ఎంఎల్ఎ డాక్టర్ వంశీకృష్ణ బాధితుడిని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. పరామర్శించినవారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోపతయ్య, రఘుపతిరెడ్డి ఉన్నారు.

## 25న చలో హైదరాబాద్

**ప్రజాపక్షం / జడ్చర్ల :** అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దివ్యాంగులకు 4 వేల నుండి 6 వేలు వృద్దులకు ,వితంతువులకు ,ఒంటరి మహిళలకు ,గీత కార్మికులకు ,బీడీ కార్మికులకు 2 వేల నుండి 4 వేల పించన్ పెంచుతామని చెప్పి 6 నెలలు గడుస్తున్న ఇప్పటికి తెలంగాణ ముఖ్యమంత్రి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందని వి.హెచ్ పిఎస్ జాతీయ కోర్ కమిటీ కో చైర్మన్ అందె రాంబాబు రాష్ట్ర అధ్యక్షులు కాళ్ళ జంగయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మహబూబ్‌నగర్ కర్నూల్ వనపర్తి నారాయణ పేట జిల్లాల జడ్చర్ల పట్టణ కేంద్రంలో అంబేద్కర్ భవనంలో జిల్లా అధ్యక్షుడు చెన్న కేశదులు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వి.హెచ్ పిఎస్ జాతీయ కోర్ కమిటీ కో చైర్మన్ అందె రాంబాబు రాష్ట్ర అధ్యక్షులు కాళ్ళ జంగయ్య ముఖ్య అథితులుగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చినహామీలన్ని తీర్చాలని, దివ్యాంగులకు ఉచితంగా ప్రయాణించే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు చిట్టి రాజు రాష్ట్ర కో కన్వీనర్ నరేందర్ రాష్ట్ర నాయకులు బిచ్చు నాయక్, ఏ శ్రీనివాసరావు విజయభాస్కర్ రెడ్డి, జైపాల్ రెడ్డి మహిళా నాయకురాలు పద్మ నాగేశ్వరి , ప్రభాకర్‌శెట్టి పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/వెల్దండ :** మండల కేంద్రంలో మెకానిక్‌పొందు ఇటీవల అనా రోగ్యంతో మృతి చెందాడు. ఆకుటుంబాన్ని పరామర్శించి అందరూ అండగా ఉండాలని ఆకుటుంబానికి వెల్దండ బిజెపి నాయకులు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి బిజెపిపార్టీ తరపున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు విజేందర్‌రెడ్డి, మాజీఎంపిటిసి చిందంకృష్ణయ్య, బిజెపి నాయకులు రామకృష్ణ, జంగయ్య సాగర్, కానుగులరవి, శ్రీధర్, మల్లేష్, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## జోరుగా అక్రమ ఇసుక రవాణా



**ప్రజాపక్షం/పాన్‌గల్ :** పాన్‌గల్ మండలంలో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతుంది. మండలంలోని గోప్లాపూర్, చిక్కెపల్లి , దావాజిపల్లి, బుసిరెడ్డిపల్లి, తెల్లరాళ్లపల్లి గ్రామాలలో అక్రమ ఇసుక రవాణా జరుగుతుంది. గోప్లాపూర్ గ్రామంలో పాఠశాల సమీపంలో భారీగా ఇసుక డంపు చేశారు. రాత్రి వేళలో ఇతర గ్రామాలకు ఒక్కొక్క ట్రాక్టర్‌కు 3 వేలచొప్పున విక్రయి స్తున్నారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యాల మాదిరిగా ఇసుక కుప్పలుగా పోసుకొని పగలు, రాత్రి వేళలో యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. కొన్ని రోజులుగా సాగుతున్న అక్రమ ఇసుక రవాణాపై సంబంధిత శాఖలైన రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ ఇసుక రవాణాకు అడ్డు అదనపు లేకుండా పోయింది. పోలీసులకు ముడుపులు చెల్లించి అక్రమ ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం. గ్రామాలలో ఇష్టా నుసారంగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా జరు గుతున్నప్పటికి అధికారులు, పోలీసులు పట్టించుకోవడంలో అం ర్యం ఏమిటి పలువురు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** కొల్లాపూర్ మండలం సింగోటం చెరువు నుంచి గోపాల్ దిన్నె రిజర్వా యర్‌కు కేఎల్ఐ సాగునీటి తర లింపుకు తవ్విన కాలు వలో భూములు కోల్పో యిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వనపర్తి సిపిఐ జిల్లా కార్యదర్గ సభ్యులు డిమాండ్ చేశారు. సిపిఐ వనపర్తి జిల్లా కార్యవర్గ సభ్యులు కె. శ్రీరాం, జె. రమేష్ , గోపాల్ కృష్ణ, వంకా గోపాల్ , వీపనగండ్ల మండల నాయకులు ఎం. కురుమయ్య ఆదివారం బొల్లా రంలో రైతులు కోల్పో యిన భూములను పరిశీలించారు. విలేకరులతో మా ట్లాడారు. వీపనగండ్ల మంలం బొల్లారం సర్వేనంబర్ 605,609లలో 48మంది రైతులు మొత్తం 52 ఎకరాల భూమిని కోల్పో యారన్నారు. రెండేళ్ల క్రితం ఉన్న ఎమ్మెల్యే పంటల పరిహారం పేరుతో ఎకరాకు ఒక పంటకు రూ. 35000 మాత్రమే ఇప్పించి ఆ తర్వాత పట్టించుకోలేదన్నారు. ఎకరాకు 12 లక్షల నష్టపరిహారం ఇస్తామని హామీ నిలపెట్టుకోలే దన్నారు. భూ సేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరకు మూడు రేట్లు ధర నష్టపరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ కాలువలో భూములు కోల్పోయిన రైతులందరిని సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## ఎల్ఓసీలు వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం/వనపర్తిటౌన్ :** సేవే పరమావధిగా భావించి ప్రతిక్షణం ప్రజల కోసం తపిస్తూ పని చేస్తున్న మన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నిరుపేదల వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించి 193 రోజుల్లో 105 ఎల్ఓసీలను బాధితులకు అందజేసి తన సేవాభావాన్ని రుజువు చేసుకున్నారు. 2023 డిసెంబర్ 9వ తేదీన వనపర్తి ఎమ్మెల్యేగా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి ఆయన పేద ప్రజల ఇబ్బందులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అత్యవసర వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఒక్కరికి తనవంతు సహాయ సహకార అందిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు ఆసుపత్రి వైద్యులతో మాట్లాడుతున్నారు. పలు ఆసుపత్రులలో వనపర్తి నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అత్యవసర సేవలు అందించేందుకు ఒకవ్యక్తిని ఏర్పాటు చేసి వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చూస్తున్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం ప్రజాసేవకై మాత్రమే తాను రాజకీయాల్లోకి వచ్చానని ఎల్లవేళలా ప్రజాసేవలోనే ఉంటానని ఎవ నేరుగా తనను ఆశ్రయించవచ్చనినియోజకవర్గ ప్రజలకు భరోసా కల్పించారు.

# చెంచు మహిళపై దాడి అమానుషం

### సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్ నర్సింహ్మ





**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** గిరిజన చెంచుమహిళ ఈశ్వరమ్మపై దాడిచేసిన దుండగుల ఆస్తిజప్తుచేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్ నర్సింహ్మ డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామ చెంచు పెం టలో నివశిస్తున్న చెంచు ఈశ్వరమ్మ అనే మహిళను సిపిఐరాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్ నర్సింహ్మ, సిపిఐరాష్ట్రసమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జి, సిపిఐరాష్ట్ర సమితిసభ్యులు వి.వెంకటయ్య, సిపిఐ రాష్ట్రసమితిసభ్యులు కొల్లాపూర్ నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ఫయాజ్, సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు కేశవులు గౌడ్, కొల్లాపూర్ సిపిఐ మండల కార్యదర్శి తుమ్మలశివుడు, ఎఐటియూసి జిల్లా ప్రధానకార్యదర్శి శివశంకర్ తదితరులతో కూడిన సిపిఐ బృందం ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి బాధిత మహిళను పరామర్శించారు. ఈశ్వరమ్మపైదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మొలచింతపల్లి గ్రామానికిచెందిన కొంతమంది రాజకీయ పలుకుబడి కలిగిన ఉన్మాద వ్యక్తులు అత్యంత పాశవికంగా ఆమెపై శారీరకమానసిక దాడిచేసి ఆమెని తీవ్రంగా గాయపర్చిన వ్యక్తులను ఎవరిని వదిలి పెట్టకుండా అందరిని కఠినంగా శిక్షిం చాలని డిమాండ్ చేశారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై సం బంధిత డాక్టర్‌తోపాటు సూపరిం టెం డెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. బాధిత మహిళ ఈశ్వరమ్మకు న్యాయంచేయకపోతే సిపిఐపార్టీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్త ఆందోళనలుచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయ కులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

### నిందితులను కఠినంగా శిక్షించాలి

### జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్‌హుస్సేన్‌నాయక్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** మొలచింతలపల్లి గ్రామానికిచెందిన ఈశ్వరమ్మపైదాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి, ఈశ్వరమ్మ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని జాతీయ ఎస్‌టి కమీషన్‌సభ్యులు జాటోతుహుస్సేన్ జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్‌ను ఆదేశించారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం మొలచింతలపల్లి గ్రా మంలో చెంచు మహిళ ఈశ్వర్మపై జరిగిన అమానవీయ ఘటనపై జాతీయ ఎస్‌టికమీషన్ సభ్యు లు జాటోతుహుస్సేన్‌నాయక్ మొలచింతలపల్లి సంఘటన స్థలాన్ని పరామర్శించి విచారణ చేపట్టి నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాధిత మహిళ ఈశ్వరమ్మను జిల్లా కలెక్టర్ బడావత్‌సంతోష్‌తో కలిసి ఆయన పరామర్శించారు. ఆమెకు అందుతున్న వైద్యసేవలపై వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి 6లక్షల రూపాయలను ఆర్థిక సహాయంగా చెల్లించాలన్నారు. ఈసందర్భంగా జాతీయ ఎస్‌టి కమీషన్ సభ్యులు జాటోతుహుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ పాశవికదాడిని ఖండించి ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధిత మహిళకు జాతీ య ఆదివాసి కమీషన్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఇలాంటి పాశవిక దాడులకు ఎవ రూ పాల్పడిన జాతీయ ఆదివాసి కమీషన్ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. ఆయనతోపాటు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి జడ్పిటిసి పోతుగంటిభరత్‌ప్రసాద్, జిల్లాబిజెపిపార్టీ అధ్యక్షులు ఎల్లేని సుధాకర్‌రావు, ఇతర అధికారులు ఉన్నారు.

## ఎర్రజెండా సూర్యుడు ఇకలేడు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి** బడుగు బలహీనవర్గాల నాయకుడు ఎర్రజెండా సూర్యుడు కామ్రేడ్ జెట్టిగాలన్న ఇకలేడని సిపిఐరాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ తాలుకా గంద్రావుపల్లి గ్రామానికిచెందిన నాయకులు సిపిఐపార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్‌జెట్టిగాలన్న సంతాపసభను పెద్దకొత్తపల్లి సిపిఐమండల కార్యదర్శి బొల్లెద్దులశ్రీనివాస్ అధ్యక్షతన కామ్రేడ్‌గాలన్న సంస్మరణసభ నిర్వహించారు. ముందుగా కామ్రేడ్‌గాలన్నకు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఐరాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ మాట్లాడుతూ పేదలకు ఎర్రజెండా మాత్రమే అండగా ఉంటుందన్నారు. ఈసంస్మరణసభలో ముత్యాలయాదిరెడ్డి, సిపిఐరాష్ట్రసమితి సభ్యులు సిపిఐజిల్లా కార్యవర్గసభ్యులు పెబ్బేటివిజయుడు, కోళ్ల యేసయ్య, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండిలక్ష్మి పతి, ఎఐటియుసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, కుటుంబసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాజ్యసభలో బిఆర్‌ఎస్ పార్టమెంటరీ పార్టీ డిప్యూటీ నేతగా ఎంపి వద్దిరాజు రవిచంద్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజ్యసభలో బిఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ నేతగా ఎంపి వద్ది రాజు రవిచంద్రను బిఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు నియమించారు. పార్టీ విప్‌గా ఎంపి దీవకొండ దామోదర్రావునకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు కెసిఆర్ లేఖ రాశారు. ఇదిలా ఉండగా.. ఇటీవల బిఆర్‌ఎస్ అధినేత రాజ్యసభలో ఫ్లోర్ లీడర్‌గా సీనియర్ నేత కెఆర్ సురేష్‌రెడ్డిని నియమించారు. పార్లమెంటరీ పార్టీ, రాజ్యసభ పక్షనేతగా ఉన్న కే కేశవరావు స్థానంలో సురేష్‌రెడ్డిని నియమించారు. కెకె స్థానంలో సురేష్‌రెడ్డిని పార్టీ పక్షనేతగా ప్రకటించిన విషయం తెలిసిందే.

## అనుమతి లేని కళాశాలల హాస్టల్స్‌ను తీసివేయాలి

### డిఐఈఓ శ్రీధర్ సుమన్‌ను సస్పెండ్ చేయాలి

### ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, యన్‌యస్‌యుఐ, పిడిఎస్‌యు నాయకుల డిమాండు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రైవేట్ కళాశాలలపై ఎలాంటి అనుమతులు లేకుండా హాస్టల్స్ నడుపుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆదివారం కళాశాల ముందు ధర్నా చేపట్టారు. విద్యార్థి సంఘాల నాయకులు ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రాజు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, యన్‌యస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ డిఐఈఓ శ్రీధర్ సుమన్ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం దగ్గర 2 లక్షలు లంచం తీసుకుని కళాశాలలకు మద్దతుగా మాట్లాడుతున్నారని వారు ఆరోపించారు. విద్యార్థి సంఘాల నాయకులు ఎన్ని సార్లు ఫోన్ చేసిన సమాధానం ఇవ్వకుండా మొబైల్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడని వారు అన్నారు. హాస్టల్స్ నడుపుకుంటే ఏమైతది అని విద్యార్థి సంఘాలకు సమా ధానం చెబుతు దాటవేస్తున్నారని వారన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు వస్తున్న సమాచారం తెలుసుకుని 12 గంటలకు తినడానికి పోతున్న అని డొంక తిరుగుడు సమాధానం చెబుతున్నారని వారన్నారు. తక్షణమే ప్రైవేట్ కళాశాలలకు తొత్తుగా మారిని డిఐఈఓ శ్రీధర్ సుమన్‌పై చర్యలు తీసుకోని సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండు చేశారు. ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకుని పక్షంలోకలెక్టర్ ముందు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

## దివ్యాంగుల పెన్షన్ హామిని నిలబెట్టుకోవాలి

### జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య



**ప్రజాపక్షం/జడ్చర్ల:** కాంగ్రెస్ ఎన్నికల సమయంలో వికలాంగులకు 6 వేల రూపాయల పింఛన్ పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు అది వెంటనే అమలు చేయాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం జడ్చర్ల అంబేద్కర్ కళాభవన్‌లో మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట జిల్లా నాగర్‌కర్నూల్ జిల్లా మూడు జిల్లాల దివ్యాంగుల పో రాట సమితి ఆధ్వర్యంలోదివ్యాంగుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ హామీ ఇచ్చి నేటికి 6 నెలలు కావస్తున్నా నేటికి ఇచ్చిన హామీని నేటికి నెరవేర్చడం లేదని, వెంటనే ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షుడు కాల జంగయ్య, జాతీయ కార్యదర్శి అందరాంబాబు, జిల్లా అధ్యక్షుడు ఎస్.చెన్న కేశవులు, జిల్లా ఇన్ చార్జి బీచ్యనాయక్, కో కన్వీనర్ నరేందర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు పద్మ, అంబేద్కర్ సం గం అధ్యక్షుడు కొంగలి నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, వనపర్తి జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, లలిత, తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సం ఘం కార్యదర్శి వివిధ మండల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విద్యుత్ బిల్లులు మాఫీ కావట్లేదు

### బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏ జి జగదీష్ రెడ్డి

### రైతు బంధు సాయాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఆపవద్దని వినతి



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** రాష్ట్రంలో విద్యుత్ బిల్లుల మాఫీ అమలు కావడం లేదని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏ జి జగదీష్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకుడు రావుల చంద్రశేఖర్ రెడ్డితో కలిసి మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతు బంధు సాయాన్ని ఆపడానికి వీలులేదన్నారు. రైతు భరోసా పేరుతో 15,000 ఇస్తామని కాంగ్రెస్ నేతలు మాట తప్పారని పేర్కొన్నారు. రైతు భరోసాపై క్యాబినెట్ సబ్ కమిటి ఎందుకు వేస్తున్నారో చెప్పాలన్నారు. క్యాబినెట్ సబ్ కమిటి వెనుక వున్న మతలబు ఏంటో కూడా తెలియాలన్నారు. రైతు ఋణమాఫీతో సంబందం లేకుండా రైతు బంధు రైతులకు ఇవ్వాలి. పింఛన్ల గురించి కాంగ్రెస్ ప్రభుత్వం నోరు మెదపడం లేదని, క్యాబినెట్ సబ్ కమిటీ రైతులను మోసం చేయడానికి వేసిన కమిటి కనిపిస్తోందన్నారు. యాసంగిలో రైతులకు ఏ విధంగా రైతుబంధు ఇచ్చారో ఇప్పుడు అట్లాగే ఇవ్వండని, బిఆర్‌ఎస్ హయాంలో జూన్ నెలాఖరు లోగానే రైతుల ఖాతాల్లో రైతు బంధు వచ్చేదని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూ ర్తిగా దెబ్బతిన్నాయని పురుషులు,మహిళలు అన్న తేడా లేకుండా దాడులు జరుగుతున్నాయని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోను శాంతిభద్రతలు బాగలేవన్నారు. చివరికి వీధి కుక్కలు సైతం స్వైర విహారం చేసి మహిళలపై దాడులు చేస్తున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. పరీక్షల్లో లీకేజీలు తప్ప ప్రభుత్వం నుండి ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో నదులను ఇసుక మాఫీయా తోడేస్తోందని , దారి దోపిడీ లాంటి పరిస్థితులు ఏర్పడ్డాయని వారు ఆరోపించారు. ప్రభుత్వం పరిపాలనపై దృష్టి పెట్టాలని కోరారు. జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి కమిషన్ లేఖపై మీడియా అడిగిన ప్రశ్నకు మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి స్పందించారు. జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి విద్యుత్ కమీషన్ నుండి తనకు లేఖ వచ్చిందని, అందులో కమీషన్‌కు వాంగ్మూలం ఇచ్చిన వారిపై మీ అభిప్రాయం వారం రోజుల్లో చెప్పాలని కోరారరన్నారు. తనకు ఉన్న సమాచారాన్ని విద్యుత్ కమీషన్‌కు ఇస్తానని , కమీషన్‌కు ఇచ్చే వాంగ్మూలంలో వారి తప్పులను బయటపెడతానని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. అందరినీ విచారిస్తేనే విద్యుత్ కమీషన్ కు సమగ్ర సమాచారం వస్తుందని కొందరిని పిలిచి అడిగితే రాదన్నారు. ఛత్తీస్‌ఘడ్ మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్‌తో పాటు ఆ రాష్ట్ర విద్యుత్ శాఖ అధికారుల ఒడి కూడా విద్యుత్ కమీషన్ సమాచారం తీసుకోవాలని కోరారు. ఎలక్ట్రిసిటీ రెగ్యులరేటరీ కమిటీ ( ఈఆర్‌సి) పై ఎన్.జీ.టి స్టే ఇచ్చిందని, పర్యావరణ అనుమతులు ఇచ్చిన వారిని విచారణకు పిలుస్తారా? లేక ఎన్‌జిటి ని విచారణకు పిలుస్తారా.? అని ప్రశ్నించారు. వారందరినీ విచారణకు పిలువకపోతే సమగ్ర విచారణ కిందకు రాదన్నారు. విద్యుత్ కమీషన్ చైర్మన్ జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆరు వేల కోట్ల నష్టం జరిగినట్లు సమాచారాన్ని ప్రజలకు తెలిపారని, ఆ సమాచారాన్ని తెలిపిన వారినీ కమీషన్ చైర్మన్ విచారణకు పిలవాలని బిఆర్‌ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. విద్యుత్ కమీషన్ ఏర్పాటు చేసి అలా లీకులు ఇస్తే ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినట్లే అవుతుందన్నారు. బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ లేవనెత్తిన అంశాలపై విద్యుత్ కమిషన్ విచారణ చేయాలని, లేకుంటే కమీషన్ చైర్మన్ బాధ్యతగా తప్పుకోవాలని మరో సారి కోరుతామని జగదీశ్ రెడ్డి అన్నారు.



## బస్సునడపాలని వినతిపత్రం

**ప్రజాపక్షం/వంగూర్ :** ఉమ్మాపూర్ డిండి పల్లెవెలుగు బస్సు నడపాలని కాంగ్రెస్ నాయకులు ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని ఆర్‌టిసి డిపో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఎంపిటిసి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై 15రోజులుకావొస్తున్న నేటికి గ్రామాల్లో ఆర్‌టిసి బస్సు నడపకపోవడం బాధాకరమని అన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్న ఆయా గ్రామాల ప్రజలు మండలకేంద్రానికి వెళ్లాలన్న బస్సు సౌకర్యంలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు కావున ఆర్‌టిసి ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామాలలో పల్లెవెలుగు బస్సులను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు , మాజీసర్పంచ్ వెంకటరెడ్డి, బాలస్వామి ఉన్నారు.

## దేవాలయ నిర్మాణానికి విరాళం

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని బైరాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మదేలయ్య దేవాలయానికి గ్రామమాజీ సర్పంచ్ దార్ల కుమార్ రూ.50వేలనగదును కమిటిసభ్యులకు ఆదివారం దేవాలయ ఆవరణలో అందజేశారు. ఈసందర్భంగా దేవాలయకమిటి సభ్యులు దార్ల కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు. దార్ల కుమార్ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి తనవంతుకృషిచేశానని ఇంకా గ్రామాలలో గ్రామదేవతల అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు.

**బాలానగర్‌లో**

బాలానగర్ మండలం వీరన్నపల్లి గ్రామంలో నూతనంగా నిర్మాస్తున్న పోచమ్మ ఆలయ నిర్మా ణానికి తన వం తుగా బాలానగర్ మండల మాజీ వైస్ ఎంపీటీసీ లింగ్యా నాయక్ రూ. 25011 విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి అడగగానే లింగు నాయక్ ముందుకొచ్చి తన వంతు నిరాళం అందజే యడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు లింగు నాయక్ ను శాలువాతో సన్మానించినట్లు వెల్లడించారు.

## గుండెపోటుతో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మృతి

**ప్రజాపక్షం/మల్దకల్ :** జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండలం మద్దెల బండ గ్రామానికి చెందిన బోయ ఉల్లి అంపన్న గుండెపోటుతో మరణించడం జరిగింది. ఈయన మృతి కాంగ్రెస్ పార్టీకి మద్దెలబండ గ్రామానికి తీరని లోటు ఈయన మృతికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముఖ్య నాయకులు సంతాపం తెలియజేయడం జరిగింది.

# సిఎం అయ్యాక రేవంత్‌రెడ్డి పింఛన్లను మర్చిపోయారు

### ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం అయ్యాక రేవంత్‌రెడ్డి పింఛన్ల గురించి మర్చిపోయారని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బిఆర్‌ఎస్ నేతలు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మన్నె గోవర్ధన్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే పింఛన్లు రెండు వేల నుండి నాలుగు వేల రూపాయలకు పెంచుతామని చెప్పారని, వికలాంగులకు నాలుగు వేల నుండి ఆరు వేలకు పెంచుతామని అన్నారని, అయితే సిఎం అయ్యాక రేవంత్ రెడ్డి పింఛన్ల గురించి మర్చిపోయారని ఆరోపించారు. మూడు నెలల పాటు పింఛన్లను ఇవ్వకుండా రేవంత్ రెడ్డి ఆపారని తెలిపారు. పింఛన్లపై ఆధారపడిన అవ్వ,తాతలకు పింఛన్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.2004 నుండి 2014 వరకు పింఛన్ కేవలం 200 రూపాయలు మాత్రమే ఉం దేదని, కెసిఆర్ సిఎం అయ్యాక 2014 నుండి పింఛన్లను రెండు వేల రూపాయలకు పెంచారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలపై కెసిఆర్ కు వున్న ప్రేమ రేవంత్ రెడ్డికి లేదని అన్నారు. తాము ప్రశ్నిస్తే మాపై ఎదురుదాడి చేస్తున్నారన్నారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వున్న నియోజక వర్గాల్లో ప్రోటోకాల్ పాటించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణలక్ష్మి చెక్కులను మాకు తెలియకుండా పంపిణీ చేస్తున్నారన్నారు.మా హుజురాబాద్ ప్రజలను ఇబ్బంది పెడితే తాట తీస్తాం అని హెచ్చరించారు. అధికారుల కోసం బ్లాక్ బుక్ రెడీ చేశానని తెలిపారు. బిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక అధికారులకు బ్లాక్ డేస్ వుంటాయన్నారు. ఫ్లై యాష్ రవాణాలో నాకు పొన్నం ప్రభాకర్ లీగల్ నోటీసులు పంపించారని ఆ విషయం మా లీగల్ టీమ్ సమాధానం చెప్తుందన్నారు. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు పార్టీ మారితే బిఆర్‌ఎస్ కు వచ్చే నష్టం లేదన్నారు.

# అంబరాన్ని అంటిన రైతు సంబరాలు

### పలువురు రైతులు సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

**ప్రజాపక్షం/పెబ్బేరు:** కాంగ్రెస్ పార్టీ రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ ఆగస్ట్ 15వ తేదీన అం టూ ప్రకటన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పలు వురు రైతులు ధన్యవాదాలు తెలిపారు. పెబ్బేరు మండల కేంద్రంలో రైతన్నలు భారీ ఎత్తున ఎద్దుల బండ్ల ప్రదర్శన చేసి సిఎం, వ్యవ సాయ శాఖమంత్రి, ఎమ్మెల్యేల చిత్రపటాలను సుభాష్ చౌక్‌లో పాలభి షేకం చేసి, స్వీట్లను పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్ర మంలో భఆరీ సంఖ్యలో రైతులు కాంగ్రెస్ మండల నేతలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**కల్వకుర్తిలో :** రాష్ట్రముఖ్యమంత్రి ఏకకాలంలో 2లక్షల రైతు రుణ మాఫీ చేస్తానని హామీ ఇవ్వడంతో సోమవారం ఉదయం 11గంటలకు పట్టణంలోని మహ బూబ్ నగర్‌చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పలువురు రైతులు పాలాభిషేకం నిర్వ హించనున్నట్లు కల్వకుర్తి మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, కాంగ్రెస్‌పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డిలు ఆదివారం తెలిపారు. ఈ కార్య కమానికి ఎంఎల్‌ఏ కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజాప్రతి నిధులు అధిక సంఖ్యలోహాజరై విజయవంతం చేయాలని కోరారు.

**వంగూర్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి 2లక్షల రుణమాఫీ విషయంపై ముఖ్య మంత్రి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లి రైతులు, కాంగ్రెస్‌పార్టీశ్రేణులు హర్షం వ్యక్తంచేస్తూ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ వేమారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంవచ్చిన ఆరునెలల్లోనే వ్యవసాయరంగానికి పెద్దపీటవేస్తూ క్యాబినెట్ సమావేశంలో సాహోసపేతమైన నిర్ణయం తీసుకోవడం చాలా గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు పిల్లివెంకటయ్యయాదవ్, రాములుయాదవ్, జంగయ్యయాదవ్, ప్రశాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్‌ప్రతినిధి :** రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని తీసుకున్న నిర్ణయం చారి త్రాత్మకమని డీసీసీ అధ్య క్షుడు ఎమ్మెల్యే జి.మధు సూదన్ రెడ్డి అన్నారు. రుణ మాఫీపై కేబినెట్ తీసుకున్న నిర్ణయం పట్ల జిల్లా కేంద్రంలోని మల్లికార్జున్ చౌరస్తాలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రప టానికి రైతులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ఇతర నాయకులు పాలాభిషేకం చేశారు. అనం తరం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ 2022 లో వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, ఆ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ డిసిసి అధ్యక్షులు రంగారావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, వినోద్ కుమార్, నాయకులు చంద్ర కుమార్ గౌడ్, ఏపి.మిథున్‌రెడ్డి, సీజే బెనహర్, ఎన్‌పి వెంకటేశ్ పాల్గొన్నారు.



ప్రజాపక్షం
మహానగరి
మేడ్చల్ మల్కాజ్‌గిరి — వికారాబాద్
ఖమ్మం | సోమవారం | 24 జూన్, 2024 | 11

## కుట్టు మిషన్లు అందజేసిన నందమూరి సుహాసిని



**ప్రజాపక్షం/చర్లపల్లి:** పేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేయడం అభినందనీయమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నందమూరి సుహసిని అ న్నారు. ఆదివారం ఇసీఐఎల్ భవానీ నగర్ కాలనీలో గూడపాటి ఫౌండేషన్ ద్వారా మహిళలకు కుట్టు మిషన్లను ఫౌండేషన్ చైర్మన్ గూడపాటి శరత్‌తో కలసి సుహసిని అందజేశారు. తెలుగు యువత మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సాయి నాగార్జున,రామ్మోహన్,ఫౌండేషన్ సభ్యులు,కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్‌జైన్ హైదరాబాద్ లోని అయాన నివాస గృహలంఓ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రజాసంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరేలా కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్ కు అదేశించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్‌ఒసిని అందజేసిన స్పీకర్



**ప్రజాపక్షం/బంట్వారం :** బంట్వారం మండల కేంద్రానికి చెందిన కొండి గారి చంద్రయ్య కు స్థానిక ఎమ్మెల్యే మరియు తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్యమంత్రి సహయ నిధి కింద రూ.లు 2 ,30,000 విలువ గల ఎల్ఓసి అదివారం అనారోగ్యంతో బాధ పడుతున్న లబ్ధిదారు చంద్రయ్య కు వైద్యం కోసం ఆయన కుటుంబ సభ్యులకు తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ క్యాంపు కార్యలయంలో ఎల్ఓసి పత్రాన్ని అందజేశారు. మండల అధ్యక్షులు ప్రభాకర్, మండల పార్టీ అధ్యక్షులు వేంకటేశం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు వేంకటయ్య, మాజీ సర్పంచు నర్సిములు, నాయకులు సిద్ది రాములు, యాదగిరి, శ్రీనివాస్, శంకర్ యాదవ్, రాజనీకాంత్, తదితరులు ఉన్నారు.

## జానపద కళలను కాపాడటమే ధ్యేయం

**ప్రజాపక్షం / కొడంగల్ :** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న జానపద కళలను కాపాడుతు, కళాకారుల ను ప్రోత్సహించడమే మా ధ్యేయమని తెలంగాణ రాష్ట్రం జానపద కళాకారుల సంఘం జిల్లా ప్ర ధాన కార్యదర్శి ఎం. కృష్ణయ్య, వర్కంగ్ ప్రెసిడెంట్ కె.రమేష్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతు రాష్ట్రంలో ఆనాధిగా ఉన్న జానపద కళారూపాలను ప్రదర్శిస్తు జీవనోపాధి పొందుతున్న కళాకారులను తమ సంఘం వెన్నంటు ఉందని వారు అ న్నారు. ప్రతి ఏటా తమ సంఘం ఆద్వర్యంలో ఎన్నో రకాల జానపద కళాప్రదర్శనలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇందులో బాగంగానే వచ్చే నెల 3వ తేదీన అన్ని జిల్లాల అధ్యక్ష ప్రదాన కార్యదర్శులతో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కన్నారు. తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్‌గౌడ్ ఆద్వర్యంలో నిర్వహించే సమావేశం ఉంటుందన్నారు. అలాగే తమ సంఘానికి గత ఆరు సంవత్సరాలుగా చేయుతనందిస్తు రాష్ట్రంలోని జానపద కళాకారులకు తమ వంతు సహాకారం అందిస్తున్న సారెపల్లి కొండల్‌రావును రవీంద్రభారతిలో ఘనంగా సన్మానించే కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలకు జిల్లాలోని కోలాటం, అడుగుల భజన, జానపదా కళాకారుల బృందాలు స్వచ్చందంగా పాల్గోని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

## దేవాలయ పాలక మండళ్లను పూర్తి చేయండి



**ప్రజాపక్షం/తాండూరు:** తాందూరు నియోజకవర్గంలో ని దేవాలయాల్లో పాలక మండళ్లను త్వరలో పూర్తి చేయాలని కోరు తూ రాష్ట్ర దేవాదయ శాఖ మంత్రి కొండ సురేఖను తాందూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహార్‌రెడ్డి కోరా రు. మంత్రిని మర్యాద పూర్వకం గా కలసిన ఎంఎల్ఏ మనోహార్‌రెడ్డి తాందూరులో దేవాలయ పాలక మండళ్లకు సంబంధించిన నామినేటెడ్ పోస్టుల భర్తికి సంబంధించిన ప్రతిపాదనలు మంత్రికి అందజేశారు. ఎన్నికల కోడ్ సంబదర్భంగా పాలక మండళ్ల నియామకాలు ఆగిపోయిన విషయం తెలిసిందేనని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసినందున త్వరలోనే తాండూరు నియోజకవర్గంలోని దేవాలయాల పాలక మండళ్ళలకు పాలక వర్గాన్ని పూర్తి స్థాయిలో నియమించాలని కోరారు.

## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** బలిదాన్ దివాస్ సందర్భంగా డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాజ్‌సుఖ్ నగర్ కాలనీలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి నివాళులర్పించారు. అనంతరం మొక్కలను నాటారు.కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్,లక్ష్మి,నాయకులు వేణుగోపాల్, రవీందర్‌రెడ్డి,శ్యామ్‌ప్రసాద్,నక్క కిషోర్,జ్యోతి,బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** 108వ జ్ఞానమాల సందర్భంగా జ్ఞానమాల టీమ్ ఆధ్వర్యంలో బిజెఆర్ కాలనీ జమ్మిగడ్డ పాఠశాల విద్యార్థులకు ఆదివారం పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేసారు. ముందుగా డాక్టర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి జ్ఞానమాల సమర్పించారు. బిజెఆర్ కాలనీ అధ్యక్షుడు ఎస్ఎ రహీమ్, నర్సింహాచారి, అభినందనరెడ్డి, వంశరాజు, మల్లేష్, సతీష్‌బాబు, పున్నం, స్వామి, శ్రీనివాస్, రవి రజక, అనీల్‌కుమార్, మెకానిక్ కొండల్, శ్రీశైలం, లింగం, కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి, కాంతారావు తదితరులు సహకరించారని, ప్రతి నెలా ఆదివారం ఇదే విధంగా విద్యార్థులకు జ్ఞానమాల టీం వివిధ కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాసం మైపాల్‌రెడ్డి, నరేందర్ రావు, దయానంద్, అరుణ్‌కుమార్, కుమార స్వామి, చిన్నారావు, గిరి, నా గేష్, వేణు, ఉప్పలయ్య, సాయిలు, లక్ష్మి నారాయణ, రవి, సద్గురుచారి, జగన్మోహన రావు, బాషా, ప్రభు పాల్గొన్నారు.



# ఇసుక దోపిడీకి అడ్డేది?

### తాండూరులో భారీగా ఇసుక డంప్‌లు
### మామూళ్ళ మత్తులో అధికార యాంత్రాంగం




**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో ఇసుక అక్రమ రవాణకు అడ్డు అదుపు లేకుండా పోయింది. కొందరు అక్రమార్కులు కాగ్నా వాగు నుండి యాధేచ్చగా ఇసుక తరలించి తాండూరు పట్టణంలో భారిగా డంపింగ్‌లు చేసుకుని దోసుకుంటున్నారు. పట్టపగలే ఇసుక అక్రమ రవాణ సాగుతున్న రెవెన్యూ, పోలీసు, మైన్స్ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఎవ్వరైన అడ్డు పడితే వారి ఆగడాలకు అదుపు లేకుండా పోయింది. పట్టపగలే ఇసుకను తరలించి ప్రభుత్వ ఖజానకు గండి కొడుతున్న అధికారులు మాత్రం మినుకు మనడం లేదు. అధికార పార్టీ నేతల అండదండలతో తాండూరులో ఇసుక దోపిడికి అదుపు లేకుండా పోయిందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తాండూరు పట్టణలో సాయిపూర్‌లో ఎక్కడ పడితే అక్కడ భారిగా ఇసుక డంప్‌లు చేశారు. బహిరంగ ప్రదేశంలో ఇసుకను డంప్ చేసి అధిక ధరలకు విక్రహించిన దండుకుంటున్నారు. తాండూరు ప్రాంతానికి మణహారంగా ఉన్న కాగ్నా నదిపై ఇసుక సూరులు గద్దలా వాలిపోతున్నారు. ఎకంగా ప్రతి రోజు వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి కాగ్నా నదిని కాజేస్తున్నారు. ఇటీవల కురిన వర్షానికి వాగులో ఇసుక మెట్టలు మెండుగా పేర్కపోవడంతో అక్రమార్కులకు వరంగా మారింది. దీనిని అదును చేసుకున్న పకృతిని సంపదను దండుకుని ప్రభుత్వ ఖజానకు గండికొడుతున్నారు. ఏలాంటి అనుమతులు లేకుండా పట్టపగలే ఇసుకను తరలించిన అధికార యంత్రాగం మాత్రం చర్యలు తీసుకోక పోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎవ్వరైన తమ అవసరాల కోసం ఇసుకను తరలిస్తే వారి ట్రాక్టర్లను అడ్డుకుని సీజ్ చేసే పోలీసు అధికారులు అక్రమార్కుల విషయంలో మాత్రం మినుకు మనడం లేదు. అక్రమార్కులు అందించే మాముళ్ళ మత్తులో అధికార యాంత్రాంగం జోగుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైె జిల్లా స్థాయి అధికారులు స్పందించి తాండూరులో సాగుతున్న ఇసుక దోపిడిని అరికట్టాలని నది పరివాహక ప్రాంత ప్రజలు పేర్కోంటున్నారు.

## నిరుద్యోగ నిర్మూలనకు రాష్ట ప్రభుత్వం కట్టుబడి ఉంది

### స్పీకర్ ప్రసాద్‌కుమార్






**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీత రెడ్డి ,పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి , యంపీపీ చంద్రకళ ,మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల , ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ మెగా జాబ్ మేళాలె 70 కంపెనీలలో 5000 ఉద్యోగాలకు 18నుండి 35 సంవత్సరాల వయస్సు గల చదువురాని నిరుద్యోగేల నుండి మొదలుకొని పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యా ఆర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించడంజరగింది. జాబ్ మేళాలకు విచ్చేసిన అభ్యర్థుల ఉద్దేశించి సభాపతి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాది అవకాశాలను కల్పించే దిశగా మెగా జాబ్ మేళాలను నిర్వహించడం జరిగింది అన్నారు. ప్రభుత్వం ఏర్పాడిన అతి తక్కువ కాలంలో 30 వేల ఉద్యోగాలే కల్పించడం జరగిందన్నారు. ఇంకా లక్షా 70 వేల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం తగు చర్యలు చేపడుతున్నట్లు ఆయన అన్నారు. యువతతో వ్యక్తిగత నైపుణ్యతో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధితో వృద్దిలోకి వచ్చే విధంగా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాట్లు అయాన అన్నారు. కొడంగల్ నియోజకవర్గం ఆభివృద్ది ద్వారా పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా ముమ్మర చర్యల చేపడుతున్నట్లు అయన తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పి.సునితరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువత మెగా జాబ్ మేళా ఎంతగానో దోహదపడుతుందన్నారు. దేశానికి యువకులు వెన్నెముక లాంటి వారిని ,ఉద్యోగాలు లేవని చింతించకుండా వ్యవసాయ రంగాల్లో కూడా రాణించాలని ఆమె సూచించారు. పరిగి ఎమ్మెల్యే రామోమహన్‌రెడ్డి మాట్లాడుతూ యువత విద్యతోపాటు తమలో ని ప్రతిభను కూడా మెరుగుపరచుకోవలన్నారు. మోగజాబ్ మేళా లో వచ్చిన ఉద్యోగంలో చేరాలని , తమ గౌరవానికి ,ప్రతిష్టకు ఇది మంచి అవకాశం అని అయాన అన్నారు. యువత ఉద్యోగాలను పొంది తమ కుటుంబాలకు భరోసా ఉండాలని అయాన తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి , టీజీ స్టేప్ మేనేజర్ వేణుగోపాల్‌రావు జెడ్పీ సీఇఓ సుదీర్ డివైఎస్ఓ హనుమంతురావు ,పట్టాణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి వివిధ కంపనీల ప్రతినిధులు పాల్గోన్నారు.

## మేడిపల్లి మండలం రైతు సంఘం మహాసభ

### 15 ఎకరాలు ఉన్న రైతులకు, కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలి
### మేడ్చల్ జిల్లా కార్యదర్శి సామ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/బోడుప్పల్:** మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దేవేందర్ నగర్ కాలనీలో రైతు సంఘం మహాసభ నిర్వహించడం జరిగినది. ఈ మహాసభకు రైతు సంఘం మండల అధ్యక్షుడు ఉప్పల కొమరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా రైతు సంఘం కార్యదర్శి సామా వెంకటరెడ్డి, అధ్యక్షులు నిమ్మల నరసింహ, గౌరవ అధ్యక్షులు సి.ఎస్.దశరథ, సహాయ కార్యదర్శులు డి. జంగయ్య, సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమమును ఉద్దేశించి వీరు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు, రైతు భరోసా 15 ఎకరాల ఉన్న రైతులందరికీ ఇవ్వాలని మరియు కౌలు రైతులను గుర్తించి వారికి కూడా రైతు భరోసా ఇవ్వాలని మరియు కౌలు రైతులను గుర్తించి వ్యవసాయం చేస్తున్నాడా లేదా అని నిర్ధారించాలని గుర్తించిన కౌలు రైతులకు (ఎల్.ఈ.సి) కార్డులు ఇవ్వాలని రైతు భరోసా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని 2011 చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ జరిగినది. జిల్లాస్థాయిలో కౌలు రైతుల సంఘం నాయకులను కలుపుకొని కౌలు రైతుల గ్రూప్ మీటింగ్సు ఏర్పాటు చేసి వారి యొక్క అనుభవాలను తీసుకొని సమీక్షలు నిర్వహించాలని కోరడం జరిగింది. 2 లక్షల రుణమాఫీ చేసి, కొత్త బ్యాంకు రుణాలు రైతులకు అందించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్, బికేఎం యు మండల కార్యదర్శి భూతం ఐలయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి మాచర్ల కనకయ్య, ఇస్తారి సోమరాజు, మేరీ, రమా, రమేష్, కవిత, కల్పన, వనజ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**రైతు సంఘం మేడిపల్లి మండలం నూతన కమిటీ:** మండల అధ్యక్షుడు ఉప్పల కొమురయ్య, మండల కార్యదర్శి మాచర్ల కనక య్య, సహాయ కార్యదర్శిగా మేరీ, కోశాధికారిగా రమ, కౌన్సిల్ సభ్యులుగా శోభ, కల్పన, వనజ, నాగమ్మ, కవితలు, ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగింది.

## మొక్కలు నాటిన కార్పొరేటర్ శ్రవణ్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** బిజెపి వ్యవస్థాపకులు డా.శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా శివపురి కాలనీలో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కుమార్ పార్టీకి చెందిన ఆడ్వకేట్ శ్రీనివాస్, వెంకట్, రమణ, లక్ష్మమాన్, సం తోష్, ప్రసాద్, వెంకటేష్, రాజశేఖర్, సాయిబాబ, మహేందర్ తదితరులతో కల్సినివాళులర్పించినఅనంతరంవిష్ణుపురికాలనీపార్కులో మొక్కలు నాటారు

## బాలమల్లయ్యకు సేవాకీర్తి అవార్డు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** గత కొద్ది కాలంగా శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బిర్రు బాల మల్లయ్య కొనసాగిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు పలువురికి ఆదర్శనీయంమని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్ అధ్యక్షుడు అయ్యప్ప అన్నారు. ఆదివారం బాలమల్లయ్యకు ఈ సందర్భంగా సేవాకీర్తి అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. నేరేడ్‌మెట్ చౌరాస్తాలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ తెలంగాణా రాష్ట్ర జనరల్ సెక్రటరీ కె.ఎల్.నారాయణరెడ్డి,సంఘ సేవకులు షేర్ల అనిల్, మేడ్చల్ మల్కాజిగిరి జాయింట్ కార్యదర్శి కోటేశ్వరి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

## బషిరాబాద్‌లో వింత ఘటన

### చనిపోయాడని అంతిమయాత్రకు ఏర్పాట్లు
### బతికున్నాడన్నా సమాచారంతో షాక్‌గురైన కుటుంబీకులు



**ప్రజాపక్షం/తాండూరు :** రైలు పట్టాలపై చనిపోయాడు అనుకున్న వ్యక్తి బతికి వచ్చిన ఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలో వింత ఘటన చోటు చేసుకుంది. వివరాలోకి వెళ్ళితే బషిరాబాద్ మండల నవంద్గి గ్రామానికి చెందిన సుత్తెల్లి ఎల్లప్ప(35)గతంలో నవంద్గి పిఎసిఎస్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ వద్ద పశువుల కాపారిగా పనిచేసే వాడని అయితే అతను మద్యానికి బానిస కావడంతో ఆయన వద్ద పని మానివేశాడు. మద్యానికి బానిసైన ఎల్లప్ప అప్పటి నుండి తాండూరు,వికారాబాద్ ప్రాంతాల్లో అడ్డా కూలి పనులకు వెళ్ళె వాడు. పనులు చేసుకుని రెండు మూడు రోజులకు ఒక్కసారి ఇంటి వెళ్ళి వచ్చేవాడని తెలిపారు. అయితే శనివారం రాత్రి వికారాబాద్ రైల్వే స్టేషన్ ఓ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకోని వ్యక్తి మృతి చెందాడు. ఇది గమనించిన రైల్వే పోలీసులు అతని వద్ద ఉన్న సెల్ పోన్ ఆదారంగా వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే రైలు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ముఖం పూర్తిగా చిద్రం కావదంతో అతనిని గుర్తు పట్టలేక పోయారు. పోన్ నంబర్ ఆదారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు ఆదివారం మృతదేహాని గ్రామానికి తీసుకవచ్చి అంత్యక్రియాల తంతును కూడా నిర్వహించారు. చివరగా అంతియాత్రకు బయలు దేరిన సమయంలో ఎల్లప్ప చావలేదని, బ్రతికే ఉన్నాడని తాందూరు బస్టాండ్ సమీపంలో కనిపించినట్లు కుటుంభీకులకు సమాచారం అందింది. దీంతో ఒక్కసారిగా ఆ కుటుంబ సభ్యులు,గ్రామస్తులు ఆశ్చర్యానికి గురైనారు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఆ గ్రామానికి చెరుకుని వ్యక్తి మృత దేహం ఎక్కడదని గుర్తించే పనిలో పడ్డారు. చనిపోయిన వ్యక్తి ఎల్లప్ప వద్ద ఉన్న సెల్ పోన్ దొందలించినట్లు గుర్తించారు. సెల్ పోన్ దొంగలించిన వ్యక్తే రైలు ప్రమాదంలో మరణించిట్లు రైల్వే పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ ఘటన అటు గ్రామస్తులను, ఇటు రైల్వే పోలీసులను ఖంగుతినిపించింది.

## దైవచింతనతో మానసిక ప్రశాంతత

### ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జీడిమెట్ల గ్రామం మెయిన్ రోడ్, గాంధీ విగ్రహంలో గల శ్రీ దుర్గ మాత ఆలయ 12వ వార్షికోత్సవం మరియు బోనాల పండుగ జాతరలో ఆదివారం ఎమ్మెల్యే కెపి వివేకానంద ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంటా సిద్దిరాములు, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాలే నాగేష్, బాల మల్లేష్, బేకు ఆనంద్ బాబు, శ్రీకాంత్, విజయ్ హరీష్, కాలే గణేష్, శ్యామల, ఆలయ కమిటీ సభ్యులు శంకరయ్య, బాలరాజు, నవీన్, కుమార్, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## భిక్షపతి ముదిరాజ్‌కు మహానంది అవార్డు ప్రదానం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** సామాజిక సేవా దృక్పథంతో సంబంధాలు చూస్తూ వివాహాలు చేస్తున్న మల్కాజిగిరి మండల ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు కటికల భిక్షపతి ముదిరాజ్‌ను రవీంద్రభారతిలో అఖిల భారత మ్యారేజి వెల్ఫేర్ అసోసియేషన్ మహానంది అవార్డును అందించారు. వివాహ సంబంధాలు కుదరటం అనేది ప్రస్తుత సమాజంలో వ్యాపారాత్మకంగా మారి కష్టతరమవుతున్న సందర్భంలో భిక్షపతి ముదిరాజ్ తన బాధ్యతగా సేవలందిస్తున్నారని మల్కాజిగిరి మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు చెరుకు సాబరాజ్ ఆయనకు సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి మండల ముదిరాజ్ మహాసభ గౌరవ అధ్యక్షుడు రొయ్యల కృష్ణమూర్తి, బొల్లు సంపత్, దండు ప్రసాద్ ముదిరాజ్, ప్రచార కార్యదర్శులు శివంది ఆంజనేయులు ముదిరాజ్, సురేష్ ముదిరాజ్, గౌతం నగర్ అధ్యక్షుడు భూమయ్య, కనకయ్య ముదిరాజ్, జనార్ధన్, మల్లేశం, కటికల రవీందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

### గొల్ల కురుమ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ కంకల ఏలెందర్




**ప్రజాపక్షం/బోడుప్పల్:** తెలంగాణ రాష్ట్ర విప్,ఆలేరు ఎమ్మెల్యే,బీసీల ముద్దుబిడ్డ బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని గొల కురుమ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ కంకల ఎలెందర్, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొ॥ రామ్ షెఫర్డ్ లు డిమాండ్ చేశారు. ఆదివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో గొల కురుమల ప్రాత మరువలేనిది అని తెలిపారు. రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్నటువంటి గొల్లకురుమలకు మంత్రివర్గ విస్తరణలో సముచిత స్థానం కల్పించాలన్నారు. నీతికి, నిజాయితీకి మారుపేరైనా కురుమలు అంతే నిబద్ధతతో పనిచేస్తారన్నారు.శాసనసభ ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గం నుండి అత్యధిక మెజారిటీతో గెలిచిన బీర్ల ఐలన్నకు మంత్రి పదవి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంత్రివర్గంలో స్థానం కల్పిస్తే ప్రజలకు వేలు చేసిన వారవుతారని పేర్కొన్నారు. రాబోయే మంత్రివర్గ విస్తరణలో బీర్ల ఐలన్నకు మంత్రివర్గంలో స్థానం కల్పించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ విద్యార్థి సంఘం నాయకులు డా॥ బర్ల మహేందర్, కుమారస్వామి, మహేశ్, రమేశ్, నరేందర్, లింస్వామి, అంజి, గోపాల్ బిసి జాక్, ఓయూ జాక్ నాయకులు తదితరులు పాల్గోన్నారు.

## అత్యాశతో సైబర్ నేరస్తుల బారిన పడొద్దు: ఎస్ఐ సైదులు




**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు అప్రమత్తంగా ఉండాలని నేరేడ్ మెట్ క్రైమ్ విభాగ ఎస్ఐ సైదులు సూచించారు. ఆదివారం నేరేడ్‌మెట్‌లోని అడిఫెన్స్‌కాలనీలో సైబర్ క్రైం, యాంటీ డ్రగ్స్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సైదులు మాట్లాడుతూ మన బలహీనతలనే పెట్టుబడులుగా మార్చుకొని నేరాలకు పాల్పడటం, నేరస్తులకు మనకు కనపడనంత దూరంలో ఉంటూ వేల నుండి మొదలెడితే లక్షల రూపాయల్లో దోపిడీ చేస్తుంటారని, ఒక సారి పోగొట్టుకొన్న సొమ్ము తిరిగి రాబట్టుకోవటం అతి కష్టమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. రుణాలు, ఉద్యోగాలు, ఆన్‌లైన్ పేమెంట్స్,కేవైసి అప్‌డేట్, ఆన్‌లైన్‌లో వస్తువులు తక్కువ ధరలకే విక్రయాలు అంటూ ఎప్పటికప్పుడు తమ ఎత్తుగడలను మార్చుకొంటూ కాల్స్ , మెసేజిలు , వాట్సప్ సందేశాలు చేస్తూ ఆశలు కలిగించే గుర్తు తెలియని నేరస్తులు డబ్బులు తమ బ్యాంకు ఖాతాలలో వేయించుకొని నిలువునా దోచుకోవటమే సైబర్‌నేరాల విధానమన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. అదే విధంగా ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ తీసుకోవటం కానీ అమ్ముతుండటం కానీ తెలిసినా వెంటనే సమాచారం అందించాలని, ఈ సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## పేట్ బషీరాబాద్‌లో అగ్ని ప్రమాదం

**ప్రజాపక్షం/పేట్ బషీరాబాద్ :** పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో అగ్ని ప్రమాదం జరిగింది. సుచిత్రలో గల ఉప్పల సెలూన్‌లో ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. మం టల ధాటికి సెలూన్ పూర్తిగా దగ్ధం అయింది. దట్టమైన పొగలు రావడంతో సెలూన్‌పైన అంతస్తులో గల ము గ్గురు యువతులకు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణం నష్టం ఏమీ జరగలేదని చెప్పారు. షాపు య జమాని ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

## క్రీడ

# స్మృతి మంధాన హ్యాట్రిక్ సెంచరీ మిస్..

### దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ క్లీన్‌స్వీప్



**బెంగళూరు:** భారత మహిళల క్రికెట్ జట్టు అదరగొట్టింది. దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌ని 30 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది. ఆదివారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన చివరి (మూడో) వన్డేలో టీమ్‌ఇండియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. ఈ మోస్తరు లక్ష్యాన్ని భారత్.. 40.4 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలి రెండు వన్డేల్లో సెంచరీలు బాదిన వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (90; 83 బంతుల్లో 11 ఫోర్లు) ఈ మ్యాచ్‌లో త్రుటి సెంచరీ మిస్ చేసుకుంది. దీంతో హ్యాట్రిక్ సెంచరీల రికార్డు చేజారింది. శతకానికి చేరువైన మంధాన.. మ్లాబా వేసిన 31 ఓవర్‌లో వెనుదిరిగింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (42; 48 బంతుల్లో 2 ఫోర్లు) రాణించింది. జట్టు విజయానికి రెండు పరుగుల అవసరమైన దశలో హర్మన్‌ప్రీత్ రనౌట్‌గా పెవిలియన్ చేరింది. రిచా ఘోష్ (6*) సిక్సర్‌తో మ్యాచ్‌ని ముగించింది. షఫాలీ వర్మ (25), ప్రియా పునియా (28), జెమీమా రోడ్రిగ్స్ (19*) ఫర్వా లేదనిపించారు. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో ఓపెనర్ వోల్వార్ట్ (61; 57 బంతుల్లో 7 ఫోర్లు) అర్ధ శతకం బాదగా.. మరో ఓపెనర్ తజ్మిన్ బ్రిట్స్ (38; 66 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించింది. ఈ జోడీ 20 ఓవర్లలో తొలి వికెట్‌కు 102 పరుగులు జోడించింది. వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔటవ్వడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ఒక్కసారిగా గాడితప్పింది. తర్వాత భారత బౌలర్లు వరుసగా వికెట్లు పడగొట్టడంతో పెద్ద భాగస్వామ్యాలు నమోదు కాలేదు. నాడిన్ డిక్లెర్క్ (26), మైకే డి రిడర్ (26*) ఆదుకోవడంతో స్కోరు 200 దాటింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 2, అరుందతి రెడ్డి 2, శ్రేయాంకా పాటిల్, పూజ వస్త్రాకర్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. మహిళల క్రికెట్‌లో మూడు వన్డేల సిరీస్‌లో అత్యధిక పరుగులు (343) చేసిన క్రికెటర్‌గా స్మృతి మంధాన రికార్డు సృష్టించింది.

# హోరాహోరీ తప్పదా?



### షాక్‌లో ఉన్న కంగారూలు.. జోరు మీదున్న టీమ్‌ఇండియా..

**న్యూఢిల్లీ :** టీ20 ప్రపంచ కప్ 2024 సూపర్8లో ఆస్ట్రేలియాను అఫ్గానిస్థాన్ ఓడించడంతో సెమీస్ రేసు ఆసక్తికరంగా మారింది. గ్రూప్1 నుంచి వరుసగా రెండు విజయాలతో టీమ్‌ఇండియా దాదాపుగా సెమీస్ చేరింది. అఫ్గాన్ చేతిలో ఓటమిపాలై షాక్‌లో ఉన్న కంగారూల జట్టు సోమవారం టీమ్‌ఇండియాతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గితేనే ఆస్ట్రేలియా సెమీస్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. లీగ్ దశ నుంచి వరుస విజయాలతో దూసుకుపోతున్న టీమ్‌ఇండియా.. ఆస్ట్రేలియాతో మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. ఈ మ్యాచ్‌లో ఓడినా భారత్ సెమీస్ చేరడానికి అవకాశాలుంటాయి. ఆసీస్‌తో మ్యాచ్‌కు బ్యాటర్లందరూ లయ అందుకోవడం టీమ్‌ఇండియాకు కలిసొచ్చే అంశం. బంగ్లాదేశ్‌పై సూర్యకుమార్ మినహా ప్రధాన బ్యాటర్లందరూ ధనాధన్ ఇన్నింగ్స్‌లు ఆడారు. టోర్నీ ఆరంభంలో నిరాశపర్చిన విరాట్ కోహ్లీ ఫామ్ అందుకోవడం ఊరటనిచ్చే రూలపై కూడా ఈ ద్వయం నుంచి మెరుపు ఆరంభాన్ని ఆశిస్తోంది జట్టు. రిషభ్ పంత్, హార్దిక్ పాండ్య ప్రస్తుత ఫామ్‌ని కొనసాగించాల్సిన అవసరముంది. సూర్యకుమార్, శివమ్ దూబె కూడా చెలరేగితే ఆసీస్ బౌలర్లకు తిప్పలు తప్పవు. పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, స్పిన్నర్ కల్‌దీప్ యాదవ్ మరోసారి చెలరేగితే టీమ్‌ఇండియాకు తిరుగుండదు. అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్ పాండ్య కీలక సమయాల్లో వికెట్లు పడగొడుతూ తమవంతు పాత్ర పోషిస్తున్నారు. అఫ్గానిస్థాన్ చేతిలో ఓడినంత మాత్రాన ఆసీస్‌ను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఇందులో గెలిస్తేనే కంగారూలకు సెమీస్ అవకాశాలు ఉండటంతో మ్యాచ్ హోరాహోరీగా సాగడం ఖాయం. ఆసీస్ ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (179 రన్స్), డేవిడ్ వార్నర్ (172 పరుగులు) మంచి ఫామ్‌లో ఉన్నారు. వీరిద్దరి దూకుడుకు భారత బౌలర్లు ఆరంభంలోనే అడ్డుకట్ట వేయాల్సిన అవసరముంది. మిడిల్ ఆర్డర్‌లో స్టాయినిస్ (167 రన్స్) అదరగొడుతున్నాడు. అతడు బంతితోనూ రాణిస్తున్నాడు. మ్యాక్స్‌వెల్ ఫామ్ అందుకోవడం ఆసీస్‌కు కలిసొచ్చే అంశం. పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, హేజిల్‌వుడ్‌లతో పేస్ విభాగంగా పటిష్ఠంగా ఉంది. కమిన్స్ ఇప్పటికే రెండుసార్లు హ్యాట్రిక్ సాధించిన సంగతి తెలిసిందే. స్పిన్నర్ ఆడమ్ జంపా బౌలింగ్‌లో భారత బ్యాటర్లు జాగ్రత్తగా ఆడాలి. అతడు టోర్నీలో ఇప్పటివరకు 13 వికెట్లు పడగొట్టాడు. టీ20 ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియాపై భారత్‌దే పైచేయి. ఇప్పటివరకు పొట్టి కప్‌లో ఇరుజట్ల మధ్య ఐదు మ్యాచ్‌లు జరగ్గా.. టీమ్‌ఇండియా 3, ఆసీస్ 2 మ్యాచ్‌ల్లో నెగ్గాయి.



# బజరంగ్‌పై నాడా మరోసారి వేటు

రెజ్లింగ్ స్టార్ బజరంగ్ పునియాపై మరోసారి సస్పెన్షన్ వేటు పడింది. డోపింగ్ పరీక్షకు శాంపిల్ ఇవ్వని కారణంగా 'నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ' బజరంగ్‌ను సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది. అయితే నెల క్రితమే ఆయనపై తొలిసారి వేటుపడగా, ముందస్తు నోటీసులు జారీ చేయని కారణంగా ఆ వేటును క్రమశిక్షణ సంఘం ఎత్తివేసింది. ఆ తర్వాత ఇటీవలె నోటీసులు ఇచ్చిన నాడా తాజాగా చర్యలకు ఉపక్రమించింది. ఇంటర్నేషనల్ పోటీల్లో పాల్గొనే ప్లేయర్లపై దేశీయంగా నాడా డోపింగ్ పరీక్షలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగానే మార్చి 10న బజరంగ్ పునియా నుంచి డోపింగ్ ఏజెన్సీ మూత్ర నమూనాలను కోరింది. అయితే ఆయన వారికి ఆ శాంపిల్‌ను అందించలేదని తెలిపింది. దీంతో నిబంధనలను ఉల్లంఘించారని పేర్కొంటూ బజరంగ్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ నేపథ్యంలో జులై 11లోగా ఈ విషయంపై ఆయన స్పందించాలని ఆదేశించింది.



# రిలీజ్‌కు ముందే 'కల్కి' వసూళ్ల వర్షం

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు నాగ్ అశ్విన్ కాంబినేషన్ లో చేసిన అవైటెడ్ భారీ చిత్రం కల్కి 2898 ఎడి కోసం ప్రపంచ ఆడియెన్స్ చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రంలో సెన్సేషనల్ కాస్ట్ నటించగా అంతకంతకు మంచి అంచనాలు సినిమాపై పెరుగుతూ వెళ్తున్నాయి. అయితే ఈ సినిమా ఇంకా థియేటర్స్ లోకి రాకుండానే వసూళ్ల పరంగా దుమ్ము లేపుతుంది అని చెప్పాలి. యూఎస్ మార్కెట్ లో ఈ సినిమాకి బుకింగ్స్ ఆల్రెడీ ఓపెన్ కాగా అక్కడ మాత్రం ప్రీ సేల్స్ వసూళ్లు కల్కి దుమ్ము లేపింది. తాజాగా ఈ చిత్రం 2.6 మిలియన్ డాలర్స్ మార్క్ ని దాటేసి ఏకంగా 3 మిలియన్ డాలర్స్ వసూళ్ల దిశగా దూసుకెళ్తుంది. 21 కోట్లకి పైగా గ్రాస్ ని ఇంకా రిలీజ్ కి ముందే కొట్టేసింది అని చెప్పాలి. మొత్తానికి అయితే కల్కి మేనియా మామూలు లెవెల్లో లేదని చెప్పాలి. ఇక ఈ భారీ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందించగా వైజయంతి మూవీస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

## రీల్



### ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిన్‌కు

# 'దేవర'లో ఎగ్జయిటింగ్ అనుభవం

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం 'దేవర'. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ డైరెక్షన్లో ఈ మూవీ అత్యద్భుతంగా, శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోంది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాలో మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. 'దేవర'లో ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిన్ కొరియోగ్రఫీ చేయనున్న కొత్త పాట చిత్రీకరణ కోసం టీమ్ థాయిలాండ్ వెళ్లింది. పఠాన్, వార్, ఫైటర్ వంటి చిత్రాల్లో అద్భుతమైన స్టెప్పుల్ని కంపోజ్ చేసిన కొరియోగ్రాఫర్‌గా బాస్కో మార్టిన్‌కు మంచి క్రేజ్ ఉంది. ఇప్పుడు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ దేవర చిత్రానికి పని చేస్తుండటంపై బాస్కో ఎగ్జయిట్ అయ్యారు. ఆయన తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఫోటోను షేర్ చేయటం ద్వారా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. బాస్కో షేర్ చేసిన ఆ ఫొటోలో ఫ్రెష్ లుక్తో ఉన్న ఎన్టీఆర్‌ను చూడొచ్చు. ఎన్టీఆర్ అసాధారణ ప్రతిభను బాస్కో కొనియాడారు. అలాగే బిహైండ్ సీనుకు సంబంధించిన గ్లింప్స్ అందరిలోనూ అంచనాలను మరింతగా పెంచాయి. ఎన్టీఆర్ ఎంత గొప్ప డాన్సరో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అలాంటి స్టార్‌కు బాస్కో మార్టిన్ నృత్యరీతులను కంపోజ్ చేయటమనేది అందరిలోనూ ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ పాట అన్నీ మాధ్యమాల్లో గ్లోబల్ రేంజ్ సెన్సేషన్ను క్రియేట్ చేసింది. అమేజింగ్ సినిమాటిక్ ఎక్స్ హై యాక్షన్ థ్రిల్లర్ను రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. నందమూరి కళ్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్ యువఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్, ఆర్.రత్నవేలు సినిమాటోగ్రఫీ, సాబు శిరిల్ ప్రొడక్షన్ డిజైనింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

# నెటిజన్‌కు అనసూయ కౌంటర్



జబర్దస్త్ యాంకర్‌గా ప్రేక్షకులను అలరించి ఫుల్ క్రేజ్‌ను సంపాదించింది 'అనసూయ'. తాజాగా తన గురించి 'ఎక్స్'లో పోస్ట్ పెట్టిన ఓ నెటిజన్కు తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. అసలు ఆ నెటిజన్ ఏం పోస్ట్ పెట్టాడంటే.. అనసూయ పాల్గొన్న ఓ టీవీ కార్యక్రమానికి సంబంధించిన క్లిప్పింగ్ను షేర్ చేస్తూ.. ''ఏంటీ నాన్సెన్స్ అనసూయ..? ఏదైనా అంటే విక్టిమ్ కార్డ్ చేస్తారు' అని పోస్ట్ పెడుతూ వాంతి చేసుకున్నట్టు కనిపించే ఎమోజీలను కూడా ఆ పోస్ట్‌కి యాడ్ చేశాడు. దీంతో ఈ పోస్ట్ పై అనసూయ వ్యంగ్యాస్త్రాలు విసురుతూ.. 'మీరిలా తీవ్ర అనారోగ్యంగా ఉండటానికి కారణమేంటో తెలుసుకోవచ్చా? ఎమోజీ, మీ మైండ్ విషయంలో..' అని రిప్లై ఇచ్చింది. మొత్తానికి అనసూయ బుల్లితెర నుంచి వెండితెర మీదికి ఎంట్రీ ఇచ్చి అక్కడ కూడా ఫుల్ డిమాండ్‌తో ప్రస్తుతం ఫుల్ బిజీగా ఉంది.

# రాహుల్ గాంధీ భావోద్వేగం

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ యుపిలోని రాయ్‌బరేలి, కేరళలోని వయనాడ్ పార్లమెంటు స్థానాల నుంచి పోటీ చేసి గెలిచిన విషయం తెలిసిందే. నిబంధనల ప్రకారం ఒకరు ఒక స్థానానికే ప్రాతినిధ్యం వహించాలి. దీంతో రాహుల్ వయనాడ్‌ని వదులుకోవడానికి సిద్ధమయ్యారు. త్వరలో అక్కడ జరగబోయే ఉపఎన్నికలో ప్రియాంక గాంధీ బరిలోకి దిగనున్నారు. ఈ నేపథ్యంలో వయనాడ్ ప్రజలను ఉద్దేశిస్తూ రాహుల్ భావోద్వేగ లేఖ రాశారు. తన నిర్ణయాన్ని మీడియాకు చెప్పేందుకు చాలా బాధపడినట్టు లేఖలో వివరించారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న సమయంలో.. వయనాడ్ ప్రజల ప్రేమాభిమానాలే కాపాడాయని అన్నారు. వప్రియమైన వయనాడ్ ప్రజలారా.. మీరంతా క్షేమంగా ఉన్నారని ఆశిస్తున్నాను. నేను నా నిర్ణయాన్ని మీడియా ఎదుట చెప్పేటప్పుడు నా కళ్లల్లో బాధ మీరంతా చూసే ఉంటారు. నేను ఎందుకు బాధపడ్డానో తెలుసా? మీ సపోర్ట్ కోసం ఐదేళ్ల క్రితం మిమ్మల్ని కలిశాను. అప్పటికి నేను పెద్దగా పరిచయం లేకపోయినా నన్ను నమ్మి గెలిపించారు. ప్రేమాభిమానాలు కురిపించారు. ఏ వర్గానికి చెందిన వారైనా, ఏ రాజకీయ పార్టీకి మద్దతిచ్చినా, రోజు రోజుకీ నాపై వేధింపులు ఎక్కువైనప్పుడు అండగా నిలిచారు. మీ అంతులేని ప్రేమే నన్ను రక్షించింది. వరదల సమయంలో ఎదురైన పరిస్థితులను ఎప్పటికీ మర్చిపోలేను. కుటుంబాలు జీవితాలను కోల్పోయినా, ఆస్తులన్నీ కొట్టుకుపోయినా మీలో ఒక్కరు కూడా హుందాతనాన్ని కోల్పోలేదు. మళ్లీ నన్ను గెలిపించారు. మీ ప్రేమను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. వేలాది మంది ప్రజల ఎదుట నా ప్రసంగాలను అనువాదం చేసిన ధైర్యసాహసాలు కలిగిన యువతులను మర్చిపోలేను. పార్లమెంట్‌లో మీ తరపును గొంతు వినిపించడం నిజంగా ఎంతో సంతోషాన్ని, గౌరవాన్ని ఇచ్చింది. బాధగా ఉన్నా, వెళ్లక తప్పడం లేదు. మీ తరపున పోరాడేందుకు నా సోదరి ప్రియాంక గాంధీ ఉన్నారు. మీరు ఆమెకు అవకాశం ఇస్తే.. మీ ఎంపీగా అద్భుతంగా పని చేస్తారన్న నమ్మకం నాకుంది. రాయ్‌బరేలీలోనూ ఇక్కడిలాగే ఆదరాభిమానాలు చూపించే ప్రజలున్నారు. మీతోపాటు రాయ్‌బరేలి ప్రజలకు ఒకే మాట ఇస్తున్నా. దేశంలో రోజురోజుకి వ్యాప్తి చెందుతున్న విద్వేషం, హింసపై పోరాడి వాటిని ఓడిస్తాను. మీరంతా నా కుటుంబ సభ్యులే. మీకెప్పటికీ అండగా ఉంటాను' అంటూ రాహుల్ భావోద్వేగపూరిత లేఖ రాశారు. ఈ లేఖ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

# నీళ్లు విడుదల చేసే వరకూ దీక్ష: ఆతిశీ



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీకి తాగు నీటిని విడుదల చేసే బ్యారేజీ గేట్లను హర్యానా ప్రభుత్వం మూసివేసిందని ఢిల్లీ జలవనరుల శాఖ మంత్రి ఆతిశీ అన్నారు. హత్నీకుండ్ బ్యారేజీ నిండా నీరున్నా విడుదల చేయట్లేదని ఆరోపించారు. వాటా ప్రకారం దక్కాల్సిన నీటిని విడుదల చేసేంతవరకూ నిరవధిక దీక్షను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దేశ రాజధానికి హర్యానా నుంచి పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలన్న డిమాండ్‌పై ఒత్తిడి తెచ్చేందుకు అతిశీ చేపట్టిన దీక్ష మూడో రోజుకు చేరింది. 'ఢిల్లీకి అందాల్సిన నీటి కంటే 100 ఎంజిడి తక్కువగా హర్యానా ప్రభుత్వం విడుదల చేస్తోంది. దీంతో దాదాపు 28 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు' అని ఆమె 'ఎక్స్' వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు. ఢిల్లీకి రావాల్సిన తాగు నీటిని విడుదల చేయాలని కోరుతూ ఆతిశీ శుక్రవారం నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. దక్షిణ ఢిల్లీలోని భోగల్‌లో చేపట్టిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపి సంజయ్ సింగ్, దిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు. తాగునీటి సరఫరా కోసం ఉత్తరప్రదేశ్, హరియాణాలపై ఢిల్లీ ఆధారపడుతోంది. వాటా ప్రకారం.. హర్యానా నుంచి ఢిల్లీకి 613 ఎంజిడి (రోజుకు మిలియన్ గ్యాలన్లు) రావాల్సి ఉంది. కానీ, హరియాణా 513 ఎంజిడిలను మాత్రమే విడుదల చేస్తోందని ఆప్ ఆరోపిస్తోంది.

# ఏడాది పెరిగిన సగటు వయసు!



**న్యూఢిల్లీ:** సగటు వయసు ఏడాది పెరిగింది అనగానే, ఎక్కడ? ఏమిటి? అనే ప్రశ్నలు రావడం సహజం. ఇది లోక్‌సభలో ప్రస్తుత సభ్యులకు సంబంధించింది. 2019లో ఏర్పాటైన 17వ లోక్‌సభలో సభ్యుల సగటు వయసు 55 సంవత్సరాలు కాగా, ఈసారి, అంటే 18వ లోక్‌సభకు ఎన్నికైన అభ్యర్థుల సగటు వయసు 56 సంవత్సరాలు. అంటే గత ఐదేళ్ల కాలంలో, లోక్‌సభలో ఎంపిల సగటు వయసు ఓ ఏడాది పెరిగింది. వీరిలో ఎంత మంది, ఎన్ని రంగాల్లో అనుభవజ్ఞులు? ఏ మేరకు దేశ పురోగవృద్ధికి సహకరిస్తారు? దేశ ప్రజలకు, ప్రత్యేకించి పేదలకు ఏ రీతిలో సేవలు అందిస్తారు? అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. ఇలావుంటే, అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్ (ఎడిఆర్) నివేదికను అనుసరించి, ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన ఎంపిల్లో 11 మంది 76 సంవత్సరాలు పైబడినవారే. 66 మంది ఎంపిల వయసు 66 నుంచి 75 సంవత్సరాల మధ్యలో ఉంది. ప్రపంచంలోనే ఎక్కువ మంది యువత ఉన్న దేశాల్లో ఒకటిగా గుర్తింపు తెచ్చుకున్న మన దేశంలో, రాజకీయాలు మాత్రం ఇంకా 'సీనియర్ల' చేతిలోనే ఉన్నాయని స్పష్టమవుతున్నది. నిజానికి ఎక్కువ మంది యువతీ యువకులు చట్టసభల్లోకి అడుగుపెడితే, దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక స్వరూపమే మారిపోతుంది. విదేశీ వ్యవహారాలు వంటి కొన్ని రంగాల్లో అనుభవానికి పెద్దపీట వేయాలి. తప్పదు. ఎంతో ఆచితూచి వ్యవహరించాల్సి ఉంటుంది కాబట్టి, అనుభవజ్ఞుల సేవలు అత్యవసరం. అయితే, చాలా అంశాల్లో యువతదే నిర్ణయాధికారమైతే, ఫలితాలు గొప్పగా ఉంటాయి. ఈసారి లోక్‌సభకు ఎన్నికైన వారిలో 35లోపు వయసుగలఎంపిలు 25 మంది ఉండడం కొంత వరకూ సంతోషాన్ని కలిగించే అంశం. 543 మంది లోక్‌సభ సభ్యుల్లో, సగానికిపైగా, 263 మంది ఎంపిల కనీస వయసు 55 సంవత్సరాలు. 50 ఏళ్లను ప్రామాణికంగా తీసుకుంటే 381 మంది సభ్యులు ఉంటారు. కాగా. 215 మంది 61 సంవత్సరాల పైబడిన వయసుగలవారు లోక్‌సభలో ఉన్నారు. 66 కంటే ఎక్కువ వయసుగల సభ్యుల సంఖ్య 2019తో పోలిస్తే 116 నుంచి 105కి తగ్గింది. 66 నుంచి 75 సంవత్సరాల మధ్య వయసున్న వారు 94 మందికాగా, 76 సంవత్సరాలు పైబడిన వారు 11 మంది ఉన్నారు. 1951–52లో, భారత మొదటి లోక్‌సభ ఎన్నికలు జరగ్గా, అప్పటి ఎంపిల సగటు వయసు 46.5 సంవత్సరాలు. 1998లో స్వల్పకాలిక లోక్‌సభకు ఎన్నికైన ఎంపిల సగటు వయసు 46.4 సంవత్సరాలు. లోక్‌సభ చరిత్రలో ఇప్పటి వరకూ సగటు తక్కువ వయసు అదే. మొదటి లోక్‌సభ ఈ జాబితాలో రెండో స్థానంలో నిలుస్తుంది. చాలాకాలం యువ భాగస్వామ్యం లేకుండా పోవడంతో, సగటు వయసు పెరిగిందే తప్ప తగ్గలేదు. ఈసారి ఎంపిల్లో 30 మంది 35 ఏళ్లలోపువారు కావడం కొంత వరకూ ఊరటనిచ్చే అంశం. ఇలావుంటే, ప్రస్తుత లోక్‌సభలో అత్యంత ఎక్కువ వయసుగల ఎంపిగా తమిళనాడులోని శ్రీపెరంబదూర్ నుంచి ఎన్నికైన డిఎంకె అభ్యర్థి టిఆర్ బాలు రికార్డు సృష్టించాడు. ఆయన వయసు 82 సంవత్సరాలు. 80 పైబడిన ఏకైక ఎంపి కూడా ఆయనే. ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్ నుంచి ఎన్నికైన సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) అభ్యర్థి అవధేష్ ప్రసాద్ 79 సంవత్సరాలతో రెండో స్థానంలో నిలిచారు. 78 ఏళ్ల హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్) సభ్యుడు జితన్ రాయ్ మాంఝిది ఈ సభలో మూడో స్థానం. లోక్‌సభకు పోటీ చేయడానికి కనీస వయసు 25 సంవత్సరాలు. ముగ్గురు ఎంపిలు, ప్రియా సరోజ్ (మచిలీ షహర్ నియోజకవర్గం/ సమాజ్‌వాది పార్టీ), పుష్పేంద్ర సరోజ్ (కౌశాంబి నియోజకవర్గం/ సమాజ్‌వాది పార్టీ), శాంభవి (సమస్తిపూర్ నియోజకవర్గం/ లోక్ జనశక్తి పార్టీ) వయసు 25 సంవత్సరాలు.

# భద్రతా బలగాలపై మావోయిస్టుల దాడి..

### ఇద్దరు జవాన్లు మృతి

**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మరోసారి ఘాతుకానికి తెగబడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో పేలుడు మందుపాతరలతో ఓ ట్రక్కును పేల్చివేశారు. ఈ ఘటనలో.. సిఆర్‌పిఎఫ్ 'కోబ్రా' యూనిట్‌కు చెందిన ఇద్దరు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్ (కోబ్రా) 201వ యూనిట్.. జాగరగుండ పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. ఈ పేలుడు సంభవించిందని ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఈ ఘటనలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కానిస్టేబుల్ శైలేంద్ర (29), కేరళకు చెందిన డ్రైవర్ విష్ణు (35) ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. ఆ సమయంలో ట్రక్కులో వీరిద్దరే ఉన్నారని వెల్లడించారు. దాడి సమాచారం అందుకున్న వెంటనే అప్రమత్తమైన భద్రత దళాలు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ విచారం వ్యక్తం చేశారు.

# బీహార్‌కు ఏమైంది..?



### వరుసగా కుప్పకూలుతున్న వంతెనలు.. ఆందోళనలో ప్రజలు

**న్యూఢిల్లీ :** బీహార్‌లో వరుసగా వంతెనలు కుప్పకూలుతున్నాయి. ఇప్పటికే పలు బ్రిడ్జిలు పేకమేడలా కూలిపోగా.. తాజాగా తూర్పు చంపారన్ జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న మరో వంతెన కూలిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. వారం రోజుల వ్యవధిలో ఇది మూడో ఘటన కావడం గమనార్హం. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మోతీహరి ప్రాంతంలో రూ.1.5 కోట్ల వ్యయంతో 16 మీటర్ల వంతెనను నిర్మిస్తున్నారు. నిర్మాణ దశలో ఉన్న ఈ వంతెన కూలిపోవడానికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన అధికారులు శాఖా పరమైన దర్యాప్తునకు ఆదేశించారు. కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీపక్ కుమార్ సింగ్ తెలిపారు. ఈ వంతెన నిర్మాణానికి గతంలో స్థానికులు అడ్డుపడ్డారు. దీంతో వారే కూల్చేసి ఉంటారా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా వాడుకలో ఉన్న సివాన్ జిల్లాలోని గండక్ కాలువపై నిర్మించిన వంతెన భారీ శబ్దంతో శనివారం కూలిపోయిన సంగతి తెలిసిందే. దాదాపు 40 సంవత్సరాల క్రితం నిర్మించారని, సరైన నిర్వహణ లేకపోవడంతోనే వంతెన కూలిపోయిందని సమాచారం. మరో వైపు అరారియా జిల్లాలో బక్రా నదిపై రూ.కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన ఓ వంతెన ప్రారంభానికి ముందే కుప్పకూలింది. దీనికి గల కారణాలను తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వారం రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలో మూడు వంతెనలు కూలిపోవడంతో అక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ ప్రమాదవశాత్తు కూలిపోయాయా? లేదా?ఎవరైనా కూల్చి వేస్తున్నారా? అనే కోణంలో అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు.

# నకిలీ కరెన్సీతో గిరిజనులకు నక్సల్స్ మోసం

### పెద్దఎత్తున డబ్బులు స్వాధీనం



**సుక్మా :** ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో నక్సలైట్లు ముద్రించిన నకిలీ నోట్లను తొలిసారి పెద్దమొత్తంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ మాత్రం వెల్లడించలేదు. కొరాజ్‌గుడ గ్రామంలో నకిలీ కరెన్సీ వ్యవహారం వెలుగుచూసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ నోట్లను బస్తర్‌లో నిర్వహించే స్థానిక మార్కెట్‌లలో గిరిజనులను మోసగించి నక్సల్స్ మారుస్తున్నట్లు చెప్పారు. నకిలీ కరెన్సీ ముద్రిస్తున్నారన్న తెలియడం వల్ల సెంట్రల్ రిజర్వ్ ఫోర్స్, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, బస్తర్ ఫైటర్స్ సహా జిల్లా పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. తమ రాకను ముందే పసిగట్టిన నక్సల్స్, వస్తువులను వదిలి దట్టమైన అడవిలోకి పారిపోయినట్లు వెల్లడించారు. ఘటనాస్థలిలో రూ.50, రూ.100, రూ.200, రూ.500 విలువ కలిగిన నకిలీ నోట్లు, ప్రింటింగ్ పరికరాలు, ఇన్వర్టర్, సీరా బాటిళ్లు, తొమ్మిది ప్రింటర్ రోలర్లు, ఆరు వైర్‌లెస్ సెట్లు, తుపాకులు, బ్యాటరీలు, భారీగా మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

# ముగిసిన నీట్ రీ-ఎగ్జామ్.. దాదాపు సగం మంది గైర్హాజరు

**న్యూఢిల్లీ :** నీట్ పరీక్షలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు వెల్లువెత్తుతోన్న వేళ సుప్రీంకోర్టు ఆదేశాలతో గ్రేస్ మార్కులు కలిపిన అభ్యర్థులకు నిర్వహించిన నీట్ రీఎగ్జామ్ ముగిసింది. ఆదివారం జరిగిన ఈ పరీక్షకు దాదాపు సగం మంది డుమ్మా కొట్టారు! ఏడు సెంటర్లలో మొత్తం 1,563 మందికి మళ్లీ పరీక్ష నిర్వహించగా.. 813మంది మాత్రమే హాజరయ్యారు. 750మంది గైర్హాజరైనట్లు ఎన్‌టీఏ అధికారులు వెల్లడించారు. వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్‌యూజీ 2024 పరీక్షా ఫలితాల్లో ఏకంగా 67మందికి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు రావడం పట్ల అనుమానాలు వ్యక్తమైన విషయం తెలిసిందే. దీంతో కొందరు అభ్యర్థులు, పలు సంస్థలు కోర్టును ఆశ్రయించడంతో ఈ వివాదం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పరీక్ష రోజున కొన్ని కేంద్రాల్లో సమయం కోల్పోయిన అభ్యర్థులకు గ్రేస్ మార్కులు కలిపినట్లు ఎన్‌టీఏ చెప్పింది. దీనిపై స్పందించిన సర్వోన్నత న్యాయస్థానం గ్రేస్ మార్కులు కలిపిన 1,563 మందికి మళ్లీ పరీక్ష నిర్వహించాలన్న ఆదేశాల మేరకు అధికారులు ఆదివారం పరీక్ష నిర్వహించారు. అలాగే, నీట్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో బిహార్‌లోని పలు సెంటర్లలో మే 5న పరీక్షకు హాజరైన వారిలో 17మందిని డిబార్ చేసినట్లు ఎన్‌టీఏ ఆదివారం ప్రకటించింది. పరీక్షలో అక్రమ పద్ధతులకు పాల్పడినందుకు తొలుత 63మంది అభ్యర్థుల్ని డిబార్ చేయగా.. శనివారం గుజరాత్‌లోని గోద్రాలో మరో 30మందిని అధికారులు డిబార్ చేశారు. ఇదిలా ఉండగా.. ఎన్‌టీఏ వెబ్‌సైట్, ఇతర వెబ్ పోర్టల్స్ అన్నీ పూర్తిగా సురక్షితంగానే ఉన్నాయని ఎన్‌టీఏ అధికారులు స్పష్టం చేశారు. వెబ్‌సైట్‌లు హ్యాక్ అయ్యాయంటూ తప్పుడు కథనాలు వస్తున్నాయని.. అదంతా తప్పుదారి పట్టించే సమాచారమేనంటూ 'ఎక్స్' వేదికగా వివరణ ఇచ్చారు.